# గ్రంథాలయ సర్వస్వము

సంపుటము ౧౦. ] ధాత – అధిక భాద్రపదము – సెప్టెంబరు 1936 [ సంచిక ౪.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారిచే ప్రకటితము.

సంపాదకులు:

గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎం. ఏ.

మారేపల్లి రామచంద్రశాస్త్రి.

అయ్యంకి వేంకటరమణయ్య.

వార్షిక మూల్యము:
సభ్యులకు రు 3 – 0 – 0.

సచిత్ర మాసపత్రిక
బెజవాడ

విడిసంచిక
నాలుగు అణాలు.

# భక్తిప్రబోధిని.

—♦ భక్తిప్రచారముచేయు మాసపత్రిక. ♦—

భగవాన్ శ్రీ రామకృష్ణపరమహంస, శ్రీ వివేకానంద, రామతీర్థ, శ్రీ హరనాథ్ ఠాకుర్, శ్రీ చైతన్యమహాప్రభువు మొదలగువారు బోధించిన భక్తివిశేషములను తెల్పుచుండుటయే దీని ప్రత్యేకలక్షణము.

☞ కడచిన నాలుగు వత్సరములనుండి ప్రచురింపబడు చున్నది.

సం. చందా. పోస్టేజితో రు 1—0—0.

శ్రీ రామకృష్ణ పూజామందిరము

కొత్తపేట, గుంటూరు.


# గ్రంథాలయ సర్వస్వము

చందా: ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వచందాతో రు 3 లు మాత్రమే.

ప్రతినెల 5-వ తేదీన వెలువడును.

వ్యాసములు

గ్రంథాలయ శాస్త్రము - ఆంధ్రవాఙ్మయము- ఆంధ్రాభ్యుదయము - జాతీయ పునర్నిర్మాణములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘములయొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనలు ఇందు ప్రకటింపబడును.

పటములు

గ్రంథాలయ భవనములయు, గ్రంథాలయ సభలయు గ్రంథాలయ సేవకులయు సంస్థలయు పటములు ఇందుముద్రింపబడును.

గమనింపుడు

ఈ పత్రిక ప్రతినెల 5-వ తేదీన వెలువడును. కావున వ్యాసములను పంపువారు ఏ నెల పత్రికయందు ప్రకటింపవలెనో దానికి వెనుకటినెల 15-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.


ప్రకటన రేట్లు

| | |
|---|---|
| ఒకసారి 1 పుటకు | రు 20-0-0 |
| ఒకసారి ½ పుటకు | రు 12-0-0 |
| ఒకసారి ¼ పుటకు | రు 6-0-0 |


వివరములకు :—

మేనేజరు, గ్రంథాలయసర్వస్వము, బెజవాడ.

RSVP01A158



శ్రీ భ్రమరాంబా మల్లేశ్వరాంధ్ర గ్రంథాలయము,
( అంతర్భాగము ).




శ్రీ భ్రమరాంబా మల్లేశ్వ రాంధ్రగ్రంథాలయమ్, బెజవాడ. [illegible]



శ్రీ యార్లగడ్డ శ్రీకృష్ణ చౌదరిగారు,

రేపల్లెతాలూకా గ్రంథాలయ సంఘాధ్యక్షులు.

వరా శె స్ప గ్రాఁథాలయదా... బెజవాడ.

# గ్రంథాలయసర్వస్వము.


సంపుటము ౧౦ | ధాత - అధికభాద్రపదము - సెప్టెంబరు 1936 | సంచిక ౪


## కర్మయోగము

(శ్రీ గా. హరిసర్వోత్తమరావుగారు, ఎం. ఏ.)

వినిచెదవు నీవు వీనుల వినికి లేక, చూపెదవు నీవు చూపుల చూపు లేక
తెలిపెదవు నీవు తలపుల తలపు లేక, యర్థమగు నెట్లు నీజాడ యవనిజులకు
సందియమునందె గజరాజు చెంది యార్తి, కొందలము నందె ద్రౌపది కోరి నమ్మి
భక్తి ప్రహ్లాదు డయ్యును బలి యొసంగె, నేలపాలయ్యె సీతమ్మ నిన్ను బొంది
భక్తు లిందర నీరీతి భంగపరచు, కారణం బేదియైనను కల్గుగాక
యొక్క భక్తుండు నిన్నుదా నొడిసిపట్టె, నతని నరయంగ లేమొకో యాంజనేయు
భక్తిజ్ఞానంబులను నమ్మి భ్రమయుకంటె, సేవపరతను నీకార్యసిద్ధి కొదవి
కర్మయోగాన నానందగతిని గనుట, మేలుగా జూపి మారుతి మిన్నుముట్టె.

## గోమాత

(విద్వాన్, శ్రీ కల్లూరి వేంకటసుబ్రహ్మణ్యదీక్షితులుగారు.)

సీ. జనని! నీకనుల నీ మినుకుఁగాటుక రేక, కనిపించు నేతల్లి యునిచెనమ్మ
నుదుట నేవేళ సంపదలొల్కు కల్యాణ, తిలక మే సతి తీర్చిదిద్దేనమ్మ
స్తనభరంబున గొను గునియించు నీ వింత, నడల నేముద్దియ నడపెనమ్మ
రారాజు లెదురైన తేరిచూడవు; ఇంత, గాంభీర్య మేసాధ్వి గఱపెనమ్మ
ప్రకృతి యేనాఁడొ దిద్దె సౌభాగ్య మింత, మార్చుకొనవేల నేఁటియమ్మలనుజూచి;
కాలగమనప్రచండసాంకర్యదోష, మలముకొన దేల? ధేనుమాతా! వచింపు.

# విజ్ఞాపనము

గ్రంథాలయ సర్వస్వము జులై - ఆగస్టుమాసములలో వెలువడని కారణమునుగుఱించి ఒకింత మనవి చేయవలసియున్నది. ఇప్పటిప్రపంచ పరిస్థితులలో గ్రామపునర్నిర్మాణమునకును, జాతీయపునర్నిర్మాణమునకును వలయు సాధనములలో గ్రంథాలయములు ప్రథమస్థానమును అలంకరించుచున్నవి. కేవలము గ్రంథములను సేకరించి భద్రపఱుచుటతోపాటు పలువిధముల విజ్ఞానమును ప్రజలలో వెదఁజల్లు సాధనముల సమకూర్చుట గ్రంథాలయముల కర్తవ్యము. ఈస్థితిలో మన ఆంధ్రదేశ గ్రామగ్రంథాలయోద్యమ ముఖపత్రమగు ఈ 'గ్రంథాలయ సర్వస్వము'ను కేవల సాంకేతికవిద్యతోనే కాక జాతీయపునర్నిర్మాణమునకు వలయు వివిధవిషయములతోకూడ తీర్చి చదువరుల కందఁజేయవలసిన మాబాధ్యతను గుర్తించి, తగు ప్రయత్నముమీఁద మా ఆదర్శము నెఱవేర్చుటకు సమర్థులగు సంపాదకులసాహాయ్యమును పొందఁగలిగితిమి. ప్రసిద్ధులగు వ్యాసకర్తలయు, పరిశోధకులయు తోడ్పాటు కూడ పొందుటకు కృషి చేయుచున్నాము. కార్యాలయము తృప్తికరముగ నడుపుటకువలయు ఏర్పాట్లు అన్నియు చేయఁబడుచున్నవి. ఇట్టి ఏర్పాట్లు చేయుటలో రెండునెలలు 'సర్వస్వము' ప్రకటింపఁజాలమికి చింతిలుచున్నాము. ఇఁకముందు సక్రమముగ పత్రిక నందఁజేయఁగల మని విన్నవించుచున్నాము. కాన, మా ఆదర్శములను గుర్తించి ఆంధ్రులెల్లరును - పల్లెటూరివారును, పట్టణములవారును - మా పత్రికకు హెచ్చుగ చందాదారులుగ చేరి ప్రోత్సహింప కోరుచున్నాము. ప్రకటనకర్తలు మాఱుమూలలకుకూడ చేరు మా పత్రికను ఉపయోగించుకొని మేలొంద ప్రార్థితులు.

ఖద్దరుసంస్థానమువారి కే. యస్. బార్టరుకంపెని - బెజవాడ (వస్తుమార్పిడి శాఖ) లో రెజిస్టరుచేసికొన్న చందాదారులకు వస్తురూపకమగు చందామీఁద "గ్రంథాలయ సర్వస్వము" అందఁగలదు.

"గాంధివిలాస్",
గవర్నరుపేట, బెజవాడ.

మేనేజరు
గ్రంథాలయ సర్వస్వము.

# రష్యా సోవియటు విద్యార్థిని

(ఆర్మిక్ ఆర్కేలియన్)

స్వీయ చరిత్ర.

కష్టపుదినములు పోయి సుఖముగ జీవనము చేయుచున్నాము. జారుప్రభుత్వపు రోజులలో స్త్రీలుపడిన ఇక్కట్లను గురించి నాతల్లి ఇప్పటికిని చెప్పుచుండును. ఆరోజులలో స్త్రీ ఒకపల్లెటూరుబడిలో .ఉపాధ్యాయినిఅగుటకు వలయు జ్ఞానము సంపాదించుటయన్న ఎంతో గొప్ప. యుక్తవయస్కులగు బాలికలు తాము పెండ్లి చేసికోదలచిన భర్తలనుగురించి తమ అభిప్రాయములను వెలిబుచ్చుటకైనను హక్కుఉండెడిది కాదు. తల్లిదండ్రుల యిష్టప్రకారమే అంతయును జరుగవలెను. పన్నెండు సంవత్సరములకన్న తక్కువవయస్సుగల బాలికలకుకూడ వివాహము చేసెడివారు.

విప్లవమునకు పూర్వము సంఘములోగాని, కుటుంబములో గాని స్త్రీలయొక్క స్థానము బహునీచముగ ఉండెడిది. మగవారితో సమానముగ ఒకబల్లమీద కూర్చుండి భుజించుటకుకూడ హక్కులేదు. పురుషులు బల్లమీద కూర్చుండిన స్త్రీలు క్రిందకూర్చొవలెను. పాఠశాలలలో బాలికలకు స్థానము లేదు. మగపిల్లలతో మాట్లాడుటకు వీలులేదు. ఉన్నతజాతి స్త్రీలకు ప్రత్యేక పాఠశాల ఒకటి ఉండెడిగ. ఆర్మీనియను కార్మికుల ఆడుపిల్లలకు అక్షరజ్ఞానమే లేదు. వీరు భార్యలుగను దాసీలుగను ఉండుట తప్ప గత్యంతరములేదు. కార్మికవిప్లవము స్త్రీలను ఈ దుస్థితినుండి తొలగించి మానవ సంఘములో వారికి స్వతంత్రస్థానము నేర్పరిచెను.

"అజరుబేజన్" లో మారుమూల నున్న ఒక పట్టణములో ఒకనాడు బందిపోటుదొంగలు పడిరి. తుపాకులు పేల్చిరి. ఆర్మీనియను కుటుంబములపై బడి దోచుకొని వారిగృహములను శిథిలీకృత మొనర్చిరి. రాత్రి నడిజామున మా తండ్రి "బట్టలుకట్టుకొనుము, పారిపోవలెను." అని కేకలువేయసాగెను. నాచిన్ననాటిఈభయంకర దృశ్యములు ఇప్పటికిని కలలో కనుపించిచుట్లున్నవి. అప్పుడు నావయస్సు నాలుగు సంవత్సరములు. ఈ గలభా నాకర్థముకాలేదు. ఆనుద్రాలో దుస్తులు ధరించి ఇల్లు విడిచి బయలుదేరితిమి. బందిపోటువారు"షుస్బె"లోని ఆర్మీనియనులను వెంటాడ వారును పారిపోవుచుండిరి.

అందరును పట్టణమును వదలిరి. సగము నాశనముచేయబడిన "స్టెపనాకర్టు"లో మేము తల దాచుకొంటిమి. ఆశిథిలములలో మేమే ప్రథమ నివాసులము. బందిపోటుదొంగలు ఎప్పుడు వచ్చి పడుదురో అను భీతిచేత నాతండ్రికి రాత్రిళ్లు నిద్రయే లేదు. ఈ స్థితిలో నెలలు సంవత్సరములనిపించెను. శీతకాలము ప్రవేశించెను. కట్టగుడ్డయు తిన తిండియు లేదు. మాఅవస్థ భగవంతునకెరుక. 'రెడ్ఆర్మీ' (ఎర్రచొక్కాలసైన్యము) వారి సహాయమున పట్టణము కొంత సురక్షితమయ్యెను.

1923 సంవత్సరములో నేను బడిలోకి వెళ్లితిని. బడిలోనున్న ఎనిమిది సంవత్సరములు వేగముగ గడిచెను. చదువుకొను ఈరోజులు సందడి సంతోషముతో నిండియుండెను. మొదటినుండియు పురోగాముల దుస్తులను ధరించి వారి ముఠాలలో కలసి.పనిచేయు అభిలాష నాకు మెండు. వారి పనిపాటలు, వారి గానము నాకు

ఆహ్లాద మొనగూర్చెడివి. "నాభవిష్యత్తు ఎట్లుండును? ముందుచదువు ఎక్కడ?" అను రెండే సమస్యలు నన్ను వేధించెడివి.

తుదకు ఉపాధ్యాయినివృత్తి స్వీకరింప నిశ్చయించితిని. ఎండకాలపు సెలవులలో 'టిఫ్లిసు' లో రసాయనిక శాస్త్రపరిశోధనాలయములో చదువుచున్న నామిత్రులుకొందరు స్టెపనాకర్టుకు వచ్చిరి. వారిజీవితచరిత్ర వినినంత నాకు ఉద్రేకము కలిగెను. వారివలె నేనును ఎట్లు చదువుకొందునా అను ఆలోచనలో నిమగ్నురాలనైతిని.

దరఖాస్తు పెట్టితిని. జబాబునకు ఆదుర్దాతో ఎదురుచూచుచుంటిని. ఒకనాడొక వార్తాహారుడుమా ఇంటిగుమ్మముముందునిలబడినాచేతికొకతంతినిచ్చెను. అందులోని అంశములేవన:

"విద్యాలయ ప్రవేశమున కనుమతి యిచ్చితిమి. తత్క్షణము రమ్ము" ఈతంతి 'ఆర్జోనికిజె' లోని బోధనాభ్యసన విద్యాలయమునుండి వచ్చినది. విశ్వవిద్యాలయ విద్యార్థిని కానుంటినని నాకు కలిగిన ఆనందమేనా! నాతలిదండ్రులు కూడ నాకుకలిగిన అవకాశమునకు సంతసించిరి. పెద్దలనాటి పరిస్థితుల స్మరింపదొడగిరి. పాపము! వారి యుద్యోగము లెట్టివి? చెప్పులు కుట్టుట, గేటుకాపలా కాయుట, దర్జీపని చేయుట మొదలగునవి; ఈ పనులుతప్ప వారితరము లెరుగరు. స్త్రీలలో ఒకతెయయినను అక్షరజ్ఞానము కలిగియుండలేదు.

'ఆర్జోనికిజె'లో మొదటిరోజు ఉదయము పెందలకడనే సూర్యోదయమగుసరికి లేచితిని. నూతనజీవితమునుగురించి పెక్కుఆలోచనలునామనస్సున నిండినవి. చదువుటెట్లు? పరిచయులు లేరే? క్రొత్తపట్టణములో ఒంటరిగా కాలము గడపవలె. అని నాలో నేను తర్కించుకొనుచుంటిని. పాఠశాలకు గంటకొట్టక పూర్వమే వెళ్లితిని. అచట ఎవరును లేరు. వసారాలలో అటుఇటు పచారీలు చేయుచు తరగతిగదులయొక్కయు - పరిశోధనశాలలయొక్కయు ద్వారబంధములపైవైపున నున్న ప్రకటనఫలకములందలి వ్రాతలను తిలకింపదొడగితిని. ఇందే గదా నేను నాలుగు సంవత్సరములు చదువుకొనవలసియున్నది! నాకు రష్యన్ భాష రాదే! నిర్వహించుట ఎట్లు? అనుభావములు క్షణికములై పొడగట్టినవి.

కొంతసేపటికి కిలకిలలాడుచు విద్యార్థులు వసారాలలో చేరిరి. చేతిలో వ్రేలాడుసంచులతోను చంకలో నిరికిన పుస్తకములతోను వారు చిన్న చిన్న గుంపులుగా చేరి ఉల్లాసముతో మాట్లాడుచుండిరి.వీరలు పాఠశాలకు చిరపరిచయులు. క్రొత్తవారు కారు. పాఠశాలపెట్టిన తరువాత దాదాపు ఒకనెలకు సెప్టెంబరు 26వ తేదిని నేను పాఠశాలలో చేరితిని. గంటకొట్టిరి. నామనసులో ఆలోచనలన్నియు చెల్లాచెదరాయెను. ఉపన్యాస ప్రాసాదములోనికి విద్యార్థులు ప్రవేశించిరి. వెనువెంట నేనును వెళ్ళితిని.

విద్యాలయములో చేరిన తరువాత జనెవరి నెలవరకు చదువులో అప్పుడప్పుడు నాకు చాలా తక్కువమార్కులు వచ్చుచుండెను. పదార్థవిజ్ఞానశాస్త్రపరీక్షలో మూడుసార్లు తప్పితిని. చదువజాలనను నిస్పృహకు అప్పుడప్పుడు లోనైతిని. చదువుమాని ఇంటికి తిరిగివెళ్లుచో నాస్థితి ఏమి? నాతలిదండ్రులేమనెదరు? సిగ్గుచేటుకాదా? అని తిరిగి తెలివితెచ్చుకొంటిని. విద్యార్థి సంఘము నాకు చాల సాయపడెను. చాలమంది బాలికలు నాకు సాయమొనర్చిరి. వారితోబాటు నేను

రష్యనుభాషను నేర్చుకొంటిని. క్రమేణా అభివృద్ధి కలిగినది. ఇదివరకుకన్న చాలా మెరుగు. మొదటి పరీక్షలో అన్నిటిలోను మంచిమార్కులువచ్చెను.

విశ్వవిద్యాలయములో మొదటి సంవత్సరము గడపితిని. అది నాభవిష్యత్తుకు పునాది. ఆసంవత్సరములో విద్యాలయము అచ్చటిజీవితము నాకు చక్కగా పరిచయమయ్యెను. పెక్కురు స్నేహితులైరి. రెండవ సంవత్సరములో అన్నివిధముల మార్పుకలిగెను. చదువులన్నిటిలోను సెబాసనిపించుకొంటిని. కార్మికవిప్లవపుపదునేనవవార్షికోత్సవ సందర్భమున నాకు రెండుపుస్తకములు బహుమతి ఇచ్చిరి. ఇది స్వల్పమేకాని నాకు అమూల్యము. కారణము-ఇదియే నేను పొందిన మొదటి బహుమానము.

ఈ విద్యాలయమున గ్రంథస్థ విద్యయే పరమావధికాదు. ప్రపంచానుభవము సమకూర్చుకొనుట విధ్యుక్తము. సోవియటు విద్యాలయములోని విద్యార్థి విద్యతోబాటు వికాససౌష్ఠవము పొందవలెను. అందుచేత గడపదాటక కాలుగదపక కూపస్థ మండూకములుగా నుండ వీలు లేదు.

నేను విద్యార్థిసంఘముయొక్క ఒకముఠాకు కార్యకర్త్రిని నైతిని. మాముఠా ఎప్పుడును అగ్రస్థానము వహించెను. సంవత్సరాంతమున మేముచేసినపనికి ఎర్రజెండా బహుమానమును పొందితిమి. మరుసటి సంవత్సరము నన్నువిద్యార్థిసంఘకార్యదర్శినిగా ఎన్నుకొనిరి. ఇప్పుడు నేనువిద్యాలయ సంఘ సహాయ కార్యదర్శినిగా పనిచేయుచున్నాను.

కొద్దికాలముక్రిందట మాకు జంతుశాస్త్ర పండితుడగు 'లేవు బోరిసోవిచ్'గారు విద్యార్థిసంఘ కార్యాలయములోనికి వచ్చిరి. విద్యాలయాధికారులు అప్పుడు చాలామంది బాలికలకు శాస్త్రపరిశోధనలో ఉన్నత విద్య నభ్యసించు అవకాశమీయసంకల్పించిరి. పండితుడు నాతో "ఆర్మిక్? నిన్నుకూడా పండితశ్రేణిలోనికి తీసికొనబోవుచున్నాము" అనెను. ఇది నాకు గలిగిన మహాభాగ్యము. అందరికిని ఇది లభించదు. రష్యనుభాష ఎంతమాత్రము రాదని నిస్పృహచెందిన ఆర్మీనియనుబాలికనగు నేను విద్యార్థులలో అగ్రస్థానము వహించి విద్యాలయముయొక్క ఉన్నతశ్రేణిలో చేరు భాగ్యము లభించెను కదా యని లోలోన సంతసించితిని. శాస్త్రపరిశోధనలకు ముందు కలుగగల అవకాశములను ఊహించుకొని బింకపడితిని.

విద్యార్థులు ఖాళీసమయములో వివిధవ్యాసంగములందు పాల్గొందురు. 'ఫొటోగ్రాఫ్' 'సంగీతము' 'నాటకము' మొదలగు వివిధవర్గములు కలవు. నాకు పర్వతారోహణమన్న ఉత్సాహము మెండు. ప్రపంచములోని సుప్రసిద్ధపర్వతశిఖరములను గురించి చాలవరకు చదివితిని. ఆల్ప్స పర్వతములను గురించి కూడా చదివితిని. "ఆప్టే" అను కార్మికసంచార సంఘమువారు విద్యాలయములో ఒక కమిటీని ఏర్పాటుచేయగా ముందు నేను సభ్యురాలనుగా చేరి నాతోడి స్నేహితులను కూడా పురికొల్పితిని.

సాయంత్రపువేళ కార్మికవనవిహారమున తఱచుగా ఎదుటకనబడు కాకృస్ మహాపర్వతపంక్తి యొక్క అద్భుతదృశ్యమును నేత్రానందముగొల్ప వీక్షించుచుండెడిదానను. మంచుతో నిండి తళతళ మెరయుచున్న "కాజ్ బెక్" శిఖరము అందులో నన్నాకర్షించెను.

ఒకనాడట్లు విహరించుచుండ "కాజ్ బెక్" శిఖరారోహణము శిశిరఋతువున చేయవలెనను

తలంపు జనించెను. మేము ఆరుగుర ముంటిమి. అందులో నే నొక్కతెనే స్త్రీని.

మార్చి 24 వ తారీఖున "కాజ్ బెక్" శిఖరారోహణమునకై 'నికాకెరికాష్‌విల్లి'గారినాయకత్వముక్రింద బయలుదేరితిమి. ఆయన మంచి ధైర్యశాలి. ఇదివరలో పదునేడు పర్యాయములు శిఖరమునెక్కినవాడు. అందరియెడల ప్రేమకలవాడు. "శీతకాలములో స్త్రీ 'కాజ్ బెక్' పర్వతశిఖరము నెక్క ప్రయత్నించుట ఇదియే ప్రథమము. 'ఆర్మిక్' కు ఈ కార్య నిర్వహణమున మనము పూర్తిగా తోడ్పడ తగును" అని పురిగొల్పుచుండును.

కాలమానస్థితి బాగుగ నుండినది. మంచు దట్టముగ లేదు. అరుణకిరణముల యందు మంచుమల తేజః పుంజము లీనుచుండినది. పిల్లతెమ్మెరలు శిఖరమునుచుట్టియాడుచు ఎగురు మంచుతుంపరలకు నవనవరూపముల కల్పించుచుండినవి. మేము చేరదలచుకొన్న మొదటి మిట్ట 13000 అడుగుల ఎత్తునగల వాతావరణ పరిశోధనశాల. అక్కడ భారమితియంత్రము 360 మిల్లిమీటర్ల ఒత్తిడిని కనబరచినది. శీతకాలపు షైరుకై అచటి కరుదెంచియుండిన ఒక ముఠావారు మాకు స్వాగతమిచ్చిరి. ఆపర్వతము మీది ఆదిమనివాసులు సాహసించి పర్వతము నెక్కిన స్త్రీని ఇదివరలో చూచియుండలేదు.

మాలో చాలామందికి పర్వతపుగాలివలన సహజముగ కలుగు తలనొప్పి - డోకుమొదలగు చిహ్నములు కలిగెను. ఆరాత్రిఅచ్చటనే గడప నిశ్చయించితిమి. మార్చి 26వ తేది అయిదుగంటలకు తిరిగి ఆరోహింప గడంగితిమి. 'కాజ్ బెక్' పర్వతశిఖరము నిటారుగా మానెత్తికి సూటిగా నుండినది. చూపులకు కడుదాపులో నుండెను. రెండడుగులలో చేరలేమా అనిపించెను. కొంత దూరముపోయిన తరువాత ఆ ప్రదేశములో మంచుగడ్డలనుపట్టుకొని ప్రాకులాడవలసివచ్చెను. క్రింద నొక గొప్ప సెలయేరు ప్రవహించుచుండెను. చుట్టుప్రక్కల నిశ్శబ్దము, నిరామయము, మృతప్రపంచతుల్యము.

పోయినకొలది పర్వతము మరింత నిటారుగా నుండి ప్రాకులాడుటకు సైతము వీలుండినది కాదు. కాళ్ళు బరువెత్తెను. నన్నెవరో దిగలాగినట్లు తోచెను గుండెలు దడదడ కొట్టుకొన సాగెను.

అందరకును అలసటయే. ప్రాకి ప్రాకి ఒక చతురంగణము చేరితిమి. పర్వత శిఖరము 160 అడుగుల దూరములోనే ఉన్నను మేము చుట్టిపోవలసినమార్గము పొడవై ఉండెను. జారకుండుటకు మంచుగడ్డలలో నొక్కులు చేసికొని ఎగబ్రాకవలసిఉండినది. ముందు స్నేహితులు త్రోవ తీయ వెనువెంటనే పోవుచుంటిని. ఆకస్మికముగా నాకాలిపట్టు వదలినది. పాదము పల్లటిలి తల క్రిందులుగ అగాధములోనికి పడుస్థితి నన్ను జంకించినది. మే మందరము పట్టినత్రాడు కంపించి నామిత్రులను హెచ్చరించినది. నేను కేకవేయకమునుపే వారు నాసంరక్షణమునకై దుమికి చేతిపారలతో పల్లములుచేసి నాజారుడును నిరోధించిరి. త్రాటిని అందుకొంటిని. ప్రయాణము సాగినది. శిఖరము చేరితిమి. ఆసంతోషము నేమని తెలుపుదును! పైని తెలిమబ్బుల ఆకసము-చుట్టును సుందరదృశ్యము- మేమొండొరుల చేతులలో చేతులుకలుపుకొని ఆనుహా విజయోత్సవమును కొండాడితిమి.

వందలకొలది పర్వతారోహకులు చేర తపించినట్టియు, కవులు గానముచేయునట్టియు,

ముదుసలులు అబ్బురపుకథలుగా చెప్పుకొను నట్టియు "కాజ్‌బెక్" పర్వతశిఖరము మాపాదములను తలధరించినది. విజయవినోదమున నొక గంట గడచె. మాధైర్య స్థైర్యములు దిట్టపడుటకు ఇది ప్రథమసోపాన మాయెను.

నే నీ విజయమునుగురించి ఒకవిద్యార్థులసభలో ముచ్చటించితిని. విద్యార్థులందరమును కలసి మరియొకసారి ప్రయత్నించుటకు ప్రోత్సహించితిని. ఇంతకన్నను మిన్నయైన, ఎల్బ్రిజ్, అను శిఖరము 'కాకసస్'పర్వతములలో గలదు. ఆరుగురు బాలికలము కలసి ఆ శిఖరమును చేరవలెనని నిశ్చయించితిమి.

ఏప్రిల్ 9వ తేది రాత్రి విద్యార్థిసంఘసభ్యులు ఇద్దరు మాతో ప్రయాణమైరి. మాకు కైదండనొసగి,విజయాశీర్వాద మొనరించిరి. అధికోత్సాహముతో పాటలు పాడుచు ఉల్లాసముగా కాలము గడుపుచుంటిమి. మానాయకుడగు "తిమాసుప్రినావు" పర్వతారోహణమును గురించి కొన్ని శాస్త్రసూచనల జేసెను. మా కవయిత్రి "షూరాపోల్టోరానేవా" ఆరోహకుల గూర్చి ఒకపద్యము రచించెను. ఏప్రిల్ 9 అంతయు 'ఎల్బ్రిజ్' పర్వతసమీపమున 'టెగ్లింకి'లో విశ్రమించితిమి. రేడియోసంగీతము - మాండొలిన్‌వాద్యము వ్యవసాయశాస్త్రచర్చ - వీనితో కాలము గడపితిమి. అయిదుగంటలకు పరుంటిమి. అందరికిని 'ఎల్బ్రిజ్' మీదనే ధ్యాస; నిద్ర యెరికిని రాదు.

ఆరోహణపు టేర్పాట్లన్నియు పూర్తిఅయ్యె. "సుప్రి నావు"తో భోజనసామగ్రి ఏర్పాటు కూడ చేసితిని.

భోజనానంతరముదుస్తులు ధరించి,శీతలమారుతమువీచుచుండ పర్వతారోహణమునకు బయలు దేరితిమి. పోనుపోను వాతావరణ మననుకూలమయ్యె. పెద్దసుడిగాలి వీచెను. శీతోష్ణస్థితి 30 డిగ్రీలు తగ్గెను. అతిశీతలముచే పాదములును మంచుగడ్డలయ్యెను. ధైర్యము వీడక ఆమంచుకొండపై నడచినడచి "ఎల్బ్రిజ్" శిఖర పూర్వభాగమును చేరితిమి.

అచట ఇరువై నిమిషములు గడపి పశ్చిమ శిఖరమువైపు పయనమైతిమి.

నాతో నాసహకారి "నానిఝుసేవు" మరియు 'స్వేప్నికోవా' 'తిమాసుప్రినావు' ఈ ముప్వురు మాత్రము బయలు దేరిరి. పశ్చిమ శిఖరారోహణము మరింత ప్రమాదముతో కూడినది. క్షణక్షణము గండమే. ఈ శిఖరము చాలానిటారుగా ఉన్నది. పెద్ద పెద్ద మంచుగడ్డలు త్రోవకడ్డము. కష్ట పరంపరలు సహించి ఒకత్రాటి సహాయముతో ప్రాకులాడి మూడుగంటలగునరికి శిఖరము చేరితిమి. పూర్తిగా నలసితిని. ఇది మరియొక నూతనవిజయము. "నిజమేనా! శిఖరము చేరినామా" అని "మరుషియాం స్వేప్నికోవా" నన్ను కౌగిటచేర్చుకొనిప్రశ్నించెను. కొంతసేపు అటుఇటు పచారుచేసితిమి. అక్కడ ఒక టోపీయు - ఒకగాజుబుడ్డియు కనబడెను. ఆ బుడ్డిలో 1889 న సంవత్సరములో ఈ శిఖరము నెక్కిన కొందరు ఇటలీ దేశస్థుల పేర్లుగల కాగితముండెను.

"సేవాసంరక్షణలకు సిద్ధము." అని చెక్కిన ముద్రికను నేను ధరించితిని. పర్వతారోహణ బిరుదమును నాకు కలదు. సాహసాంకమును ధరింపవలె ననుభావ ముదయించినది.

ఒకనాడు విద్యాలయ కార్యాలయమున కేగితిని. అక్కడ "ఓషివ్రా" అను డైరక్టరును కలసికొంటిని. "గాలిగొడుగుగంతులు వేయ నేర్చెదవా" అని ఆయన ప్రశ్నించెను. * * *

నాకు ఉత్సాహముకలదు. మా దేశపత్రికలలో దీనిని గురించి ఇదివరలో చూచితిని. తరిఫీయతు పొంద ప్రయత్నించితిని. కాని సాగలేదు. విద్యాలయములో దీనిని నేర్పుటకు ఒక శాఖ నేర్పరచిరి. నే నందులో సూత్రములను నేర్చుకొంటిని. ప్రత్యక్ష పరిశ్రమ చేయుటకు కూడా ఏర్పాటుచేసిరి.

సెప్టెంబరు 14 వ తేది ఉదయము విద్యార్థుల మందరము వాయువిమానశాలవద్ద చేరితిమి. క్రొత్తగా నిర్మింపబడినవై 2 వాయువిమానము సిద్ధముగా నున్నది. దుముకుటకు ఏర్పాట్లు అన్నియు చేసిరి. స్నేహితులు నాచుట్టు గుమికూడి వారికి తోచిన సూచనలు - సలహాలు నిచ్చిరి. విమానము రెక్కమీదికి వచ్చిన తరువాత క్రిందవైపు చూడవద్దని కొందరు సలహా నిచ్చిరి. కొందరు దుముకు నప్పుడు కనులు మూసికొమ్మనిరి.

గాలిగొడుగు ధరించివిమానములో కూర్చుంటిని. యంత్రము త్రిప్పగనే పెద్దధ్వనితో విమానము పైకి లేచెను. ఒక్కసారి విమానశాలను చుట్టివచ్చెను. సుమారు 2700 అడుగుల యెత్తున నుంటిమి.

వైమానికుడు వాయువునదలి రెక్కమీదికి వెళ్ళి దుముకుటకు నాకు సంజ్ఞచేసెను.

రెక్కమీదికి వెళ్ళితిని. స్నేహితు లిచ్చిన సలహాలు మఱచితిని. నేలవైపుచూచితిని. మనుష్యులు చిన్నచుక్కలవలెను చెట్లు గడ్డిపోచలవలెను కనుపించెను. నేను నిర్భయముగ నుంటిని. కొన్నిక్షణములలో విమానమునుండి క్రిందికి దుమికితిని. ఉచ్చును లాగివైచితిని. స్వచ్ఛముగు తెల్లటి ఆగాలిగొడుగు నన్ను సంరక్షించుటకు తరంగములుతరంగములుగా విరిసినది.

మంద మందగమనమున నేలపై వ్రాలితిని. మిత్రబృందము కలకలలాడుచు నన్ను చుట్టుకొనిరి. సంతోషారావములు చెలరేగినవి. నన్ననుకరించి మరి నలువురు విద్యార్థినులు వెన్వెంటనేవిమానమునెక్కి గాలిగొడుగుగంతుల గాంభీర్యము ననుభవించిరి. ఆదినమే నాకు సుదినము; చిరస్మరణీయము.

ఇక నొక్క సంవత్సరమున నిందు పండితబిరుదమునంది విద్యార్థులకు నా అభిమాన విద్యంగఱపుచు సంకల్పసిద్ధి నందుదును.

# నేను

(కవితాసమితిసభ్యుడు)

విశ్వసంరక్షకుడవంచు విశ్వసించి, ఎన్నిమారులు నీకడ విన్నవింతు
నస్మదనురాగభావరాహస్యవృత్తి, హృదయలజ్జానుభూతి పరిత్యజించి.

* * * *

హాసపులకితనవమధుమాసనిశల, వలపు వేదురువెట్ట చెక్కులు చెమర్ప
ఈకడల నెంత వెదకి తపించినానొ, వ్యోమపదవర్తియౌ చందమామ సాక్షి.

* * * *

అమృతగంధిల మాలతాంతములనడుమ, నే నొక సుమంబునై పుట్టినాన కాని
సార్థకతగాంచ నోచుకోజాలనైతి, దేవదేవ! త్వత్పాదసంసేవనమున.

# బ్రిటనులోని వయోజన విద్యోద్యమము

(శ్రీ జటావల్లభుల పురుషోత్తముగారు, ఎం. ఏ.)

నేటికి సుమారు 125 సంవత్సరముల క్రిందటనే ఇంగ్లండులో వయోజనవిద్యోద్యమము ప్రారంభమైనది. పాఠశాలకుబోవు వయస్సునకు మించిన నిరక్షరాస్యులను బైబిలు చదివి యర్థము చేసికొనగలుగువారినిగ జేయుటయే యాదిలో నాయుద్యమముయొక్క యుద్దేశము. కాలక్రమమున నీ యుద్యమముయొక్క యుద్దేశము విస్తృతము కావింపబడినను నేటికిగూడ నందు మతవిషయమునకు ప్రాముఖ్య మీయబడుచునే యున్నది. బ్రిటనులోని నేటివయోజనపాఠశాలల యుద్దేశములను గమనించుచో నీయంశము స్పష్టము కాగలదు. అవి యీక్రిందివిధముగ నున్నవి:—

(1) స్త్రీలను పురుషులను బాగుపరచి వారిని చక్కగ జీవయాత్రను నడుపగలవారినిగ జేయుట.

(2) బైబిలును స్పష్టముగను స్వేచ్ఛగను సగౌరవముగను నిష్పక్షపాతముగను చదువుట.

(3) క్రైస్తవు లందఱును కలసి పనిచేయుటకును నైకమత్యముతో నుండుటకును తగినవిధమున క్రైస్తవులలోని భిన్నశాఖల నేకము చేయుట.

(4) సంఘముయొక్క వివిధశాఖలవారు ప్రజాసేవను పరస్పర సహాయమును గావించుట కనువగురీతిని వారిని సమ్మేళనము చేయుట.

(5) ప్రజలలో సార్వజనిక భావమును సాంఘికనీతిని గల్గించి వృద్ధినొందించుట.

(6) పౌరత్వబాధ్యతను ప్రజలకు బోధించుట.

(7) అంతర్జాతీయ సౌభ్రాత్రమున కనుకూలమగు విషయముల నన్నిటిని ప్రోత్సహించుట.

(8) వీలయినంతవఱకు ప్రజల కందఱకును నన్నివిషయములలోను సమానావకాశములను గల్గించుట.

(9) ఏసుక్రీస్తుయొక్క జీవితము నరము చేసికొని దాని ప్రకారము నడచుకొనుటకును క్రీస్తుపట్ల భక్తిని గలిగి యుండుటకును స్త్రీపురుషులకు సహాయము చేయుట.

వయోజన పాఠశాల లన్నియు నీయుద్దేశములను పాటింపవలెనను నిర్బంధము లేదు. కాని సాధారణముగ నన్నియు వీనిని పాటించును. ఈపాఠశాలలో నేడు కఱపబడుచున్న విద్యయొక్క స్వరూపము మఱింత బాగుగ బోధపడుటకై 1936 వ సంవత్సరపు వయోజన పాఠశాలా గ్రంథము (Hand book) నుండి కొన్ని పాఠవిషయముల నీ క్రింద నిచ్చుచున్నాను: విశ్వోత్పత్తి; యువకుల యాదర్శము; ఆధ్యాత్మికాన్వేషణము; ప్రేమ, స్నేహము, వివాహము; ఉద్యోగము, విశ్రాంతి; మన మెందులకు సత్యసంధులుగ నుండవలెను? న్యాయము, సంప్రదాయము, అభివృద్ధి, సంస్కరణము; యేసుయొక్కయు నాతని శిష్యులయొక్కయు ప్రభావము; ప్రజాభిప్రాయము, మతము, రాజకీయము; ప్రాచీనప్రపంచభావములు; అంతర్జాతీయసహకారము. మచ్చున కిచ్చిన యీ విషయములను బరికించుచో ఇంగ్లండులోనివయోజన పాఠశాలలలో నేర్పబడు విద్య జీవితముయొక్క విశాలాంశములకు సంబంధించిన దనియు నొకశాస్త్రములో ప్రత్యేక ప్రావీణ్యము గల్గించుట దాని యుద్దేశము కాదనియు తెలియగలదు.

ఇట్టి విద్యను వయోజనులకు బోధించు పాఠశాలలు నేడు బ్రిటీషుద్వీపములలో 1450 కలవు. అందు 50000 మంది సభ్యులున్నారు. పాఠశాలలో విద్యను నేర్చుకొనుటయే కాక పాఠశాలను నిర్వహించు బాధ్యతకూడ నీ సభ్యులపైనే యుండును. వారందఱును గలసి యధ్యక్షుడు, కార్యదర్శి మున్నగు కార్యనిర్వాహకవర్గము నెన్నుకొందురు. ప్రతి పాఠశాలయు నీ విధముగ స్వయంపోషకముగ నుండి యాజిల్లా (కౌంటీ) లోని యితర పాఠశాలలన్నిటితోను సంబంధము గల్గియుండును. ధనము, సలహాలు మున్నగు విషయములలో నివి యన్నియు పరస్పర సహకారభావముతో వర్తించును. ఇట్టి మండల పాఠశాలా సంఘములు బ్రిటనులో 29 గలవు. ఈ మండలసంఘములన్నియు కలసి 'జాతీయ వయోజనవిద్యాలయసమ్మేళన' మను నొకసంస్థగ నేర్పడియున్నవి. ఈసమ్మేళనముయొక్క కార్యాలయము లండనులో నున్నది. ఈ సమ్మేళనమువారు వయోజనవిద్యోద్యమమునకు సంబంధించిన పత్రికను కరపత్రములను గ్రంథములను ప్రచురించుచుందురు. ఉద్యమమునకు సంబంధించిన ముఖ్యసమస్యల నీ సమ్మేళనమే పరిష్కరించును. మఱియు క్రొత్తగ పాఠశాలలను స్థాపించుటకూడ దీని యుద్దేశములలో నొకటి. వివిధపాఠశాలలును మండలసంఘములునుగూడ దీని కేటేటను చందాల నిచ్చుచుండును. గడచిన 24 సంవత్సరములనుండియు నీసమ్మేళనమువారు ప్రతిసంవత్సరమునను నా సంవత్సరమున ననుసరింపతగిన పాఠప్రణాళికను, నా పాఠముల సంగ్రహవివరణమును గల్గియుండు నొక గ్రంథమును ముద్రించుచున్నారు. ఈ గ్రంథముల ప్రతులు సంవత్సరమునకు ఇరువదిరెండువేలు సెలవగుచున్నవి. దీనిని బట్టి యాదేశమున వయోజనవిద్యపట్ల నెంతశ్రద్ధ గలదో తెలియగలదు.

ముఖ్యవిషయములలో వయోజన పాఠశాలలన్నియు నొకేవిధముగనే యున్నను వివరములలో నొక పాఠశాలకును మఱొక పాఠశాలకును చాల భేద ముండవచ్చును. కొన్ని పాఠశాలలకు సభ్యులేకాని భవనముండదు. ఏయద్దె యింటనో వారు వారమున కొకసారి సమావేశమగుచుందురు.

కొన్ని పాఠశాలలకుదివ్యభవనములున్నవి. అన్ని పాఠశాలలునుగూడ వారమునకొకసారియే సమావేశమగుచుండును. కొలదిపాఠశాలలకు వేసవిసెలవులుండును. పురుషులకును స్త్రీలకును సాధారణముగ వేర్వేరు పాఠశాల లుండును. మిశ్రమపాఠశాలలుగూడ కొన్ని యున్నవి. ఈనడుమ వీని సంఖ్య పెరుగుచున్నది. అన్ని పాఠశాలలును ఆదివారము నాడుదయమున కూడును. స్త్రీలపాఠశాలలుకొన్ని మరొక సెలవుదినమున సాయంకాలము సమావేశమగుచుండును. ఈ నడుమ యువకుల ప్రత్యేక పాఠశాలలుగూడ చాలస్థాపింపబడుచున్నవి.

జాతీయవయోజనవిద్యాసమ్మేళనమువారు ప్రచురించు గ్రంథములో సంవత్సరములో నేవారమున నేవిషయమై పాఠము జరుగవలెనో నిర్ణయింపబడి యుండును. కాన నొక వారమున పాఠశాలలన్నిటిలోను నొకే విషయమై పాఠములు జరుగును. ఆయా పాఠశాలల సభ్యులును, కార్య నిర్వాహకులునుగూడ కొన్ని పాఠములను బోధించుచుందురు. ఇతర పండితుల నాహ్వానించి వారిచే నిర్ణీత విషయములపై నుపన్యాసము లిప్పించుట తఱచుగ జరుగుచుండును. ఇతరవిషయములపైగూడ కొన్ని యుపన్యాసము లాదివారమునను నితరదినములలోను గూడ నరుదుగ గావింపబడు చుండును. సాధారణముగ నడుపబడు నీవిద్యావిధానమేకాక కొన్ని పాఠశాలలలో కొన్ని విశేషములుకూడ కాననగును. నాట్యకళ, నాటకకళ, గానము, ఆటలు, గృహపరిశ్రమలు, తోటపనిమున్నగు నంశములను బోధించుటకు ప్రత్యేకదినము లేర్పాటు చేయబడును. గ్రుడ్డివారు, వికలాంగులు మున్నగువారికి సేవచేయుట కూడ కొన్ని పాఠశాలలలో కార్యక్రమములో చేర్పబడినది. ఈ యుద్యమమునకు సంబంధించిన అంతర్జాతీయసంఘమువారీవిషయమై శ్రద్ధగల కొలదిమందిని జట్టులుగ విదేశములకు తీసికొని వెళ్ళియు విదేశపు జట్టులను తమ దేశమునకు రప్పించియు నంతర్జాతీయ దృక్పథమును నంతర్జాతీయ సహకారభావమును వయోజనులలో గల్గించుటకు యత్నింతురు. స్త్రీల ప్రత్యేక పాఠశాలలలో గృహనిర్వహణము, శిశుపోషణము మున్నగునవి కూడ నేర్పబడును. అట్లే యువకుల పాఠశాలలలో వారికి సంబంధించిన యంశములుగూడ కఱపబడును. అవసరముల కనుగుణముగ విద్యావిధానమును సరిపెట్టుకొనుట యీ పాఠశాలలలోనెల్ల నొక సుగుణముగ నున్నది. దీనికి తోడుగ స్వాతంత్ర్యము, నిరాడంబరత్వము నను నవి గూడ ప్రతిపాఠశాలయొక్క వాతావరణములోను ప్రధానలక్షణములుగ గన్పట్టుటచే మొత్తముపైని బ్రిటిషు వయోజనపాఠశాలలన్నియు పూర్ణమైన ప్రజాస్వామిక సిద్ధాంతముపై నడుపబడుచున్నవని చెప్పవచ్చును.

సాధారణముగ ప్రతి పాఠశాలయు నొక యుదార పురుషునియొక్క గాని స్త్రీయొక్క గాని కృషిచే స్థాపింపబడుచుండును. పాఠశాలను స్థాపించు సంకల్పము తనకుగల్గినదని యెవరైనను లండనులోని జాతీయవయోజన పాఠశాలా సమ్మేళన కార్యదర్శులకు (30 బ్లూమ్సుబరీ వీథి) వ్రాయుచో నాకార్యదర్శులు వెంటనే యీ పాఠశాలలకు సంబంధించిన వాఙ్మయమంతను పంపి నూతన పాఠశాల స్థాపింపబడుటకు సమస్తమైనవాక్సహాయమును చేయగలరు. ఏటేటను నిట్టి పాఠశాలలనేకములు క్రొత్తగ స్థాపింపబడుచున్నవి. ఇందు శిక్షణమును పొందినవారనేకులు ప్రజాహిత జీవితములో గణ్యతను పొందుచున్నారు. కొందఱు పెద్ద యుద్యోగములను గూడ నిర్వహించుచున్నారు. ఇట్టివారొక రిద్దరు పెద్దసిటీలకు మేయర్లుగ గూడ నున్నారు.

వయోజనవిద్యావ్యాప్తికి మన దేశమునకున్నంత యావశ్యకత మఱి యేదేశములోను లేదు. అయిననుగూడ మన మీవిషయమున బ్రిటను చేయుచున్న పనిలో లేశమును చేయుటలేదు. ఆంధ్రదేశములో నిదివఱలో స్వల్పమగు ప్రయత్నము కావింపబడినది.

1929 వ సంవత్సరమున శ్రీ శనివారపు సుబ్బారావు గారు మున్నగువారు తాడేపల్లితాలూకాలోని యుపాధ్యాయులకొఱకు వసంతఋతు విద్యాలయమును నడపిరి. మూడుసంవత్సరములనుండి శ్రీ గోగినేని రంగనాయకులు గారు నిడుబ్రోలులో రైతాంగవిద్యాలయమును నడపుచున్నారు. క్రిందటి జూలైనుండి తాడేపల్లిగూడెము తాలూకా కృష్ణాయపాలెములో వారమున కొకదినము చొప్పున ఏబదిరెండువారములు రైతాంగ విద్యాలయపు తరగతులు నడపబడుచున్నవి. పైని వర్ణింపబడిన బ్రిటను లోని 52 వారముల ప్రణాళికపద్ధతిపైనే యీ తరగతులుండును. ఇట్టిపాఠశాలల నెన్నిటినో పెట్టి నడపిననే కాని మన దేశము విద్యావిషయమున నభివృద్ధినొందలేదు.

# ప్రజల విద్యావిధానమునకు రెండు ప్రథమసూత్రాలు

(శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, ఎం., ఏ.)

గజేంద్రునంతటివాడు తనలో ఉన్న బలము పూర్తిగా ఉడిగిపోయినతరువాతగాని 'నీవేతప్ప నితఃపరంబెఱుగ' ననలేదు. అందుచేతనే మనపెద్దలు కష్టకాలం కలిగితేనేగాని మానవుడు దైవాన్ని తలచుకొనడన్నారు. దైవమంటే పరవస్తువని మాత్రమర్థం కాదు. సత్కార్యాచరణము సర్వమును దైవమే.

*　　*　　*

ప్రపంచమంతటను తిండికిలేక అల్లాడుచున్న ఈనాటికిగాని బడిపిల్లలకు మన మేవిధమైన తరిబీతిచ్చుచున్నామో గట్టిగాచూచి మార్చవలెనని మన పెద్దల బుద్ధుల కెక్కిందిగాదు. 1920 లో మంత్రిత్వానికి వచ్చి మధ్య ఏ నాలుగేండ్లో తప్ప తమతో ఆరంభమయిన తమ పార్టీ ప్రభుత్వమే 16 ఏండ్లుసాగించుకొన్న పాత్రోగారు, చేతిలో అధికారమున్నప్పుడు పనిచేయకపోయినా సప్రూ రిపోర్టుకు తరువాత ఇప్పటికి గట్టిగా మాటలారంభించినారు.

*　　*　　*

కాంగ్రెసుమహానాయకులు దైవాన్ని మనసులో ఉంచుకొని 1905-06- సంవత్సరములలోనే దేశీయ విద్యకు బునాదులు వేయను జూచినారు బందరు జాతీయ కళాశాల ప్రణాళిక మనదేశంలో తయారైనది. తరువాత మరల గాంధీయుగంలోను జాతీయ విద్యను ప్రోత్సహించే తంటాలు పడినారు. గుంటూరుజిల్లా బ్రాహ్మణకోడూరులో ప్రత్యేకముఆరుదినములు జాతీయ విద్యాధికారుల సమావేశం జరిగి నేడే విధానాన్ని దేశమంతా అనుసరించవలెనని ఆలోచించుతున్నారో ఆ స్వరూపం కల విధానాన్ని - విద్యార్థి ఏమెట్టులో చీలిపోతే ఆ మెట్టులోనుంచి జీవితం ప్రవేశించి వ్యవసాయం కమ్మరం కుమ్మరం వడ్రంగం ఇత్యాది వృత్తులతో కూడ బ్రహ్మవిద్యవరకు సాధించడానికి అవకాశాలు ఉండవలెననే సిద్ధాంతంమీద నిర్మితమైన విధానాన్ని - సిద్ధముచేసినారు.

*　　*　　*

కాని కాంగ్రెసుకార్యక్రమంలో రెండు లోపాలు పెద్దవి బయలుదేరినవి. ఎంతమంది ఎన్నికబుర్లు చెప్పినప్పటికి తిండికి జరుగనది పంతుళ్లయినా పనిచేయ లేరు. కొంత బలవంత పెట్టే అధికారము ఉంటేనే కాని ఏనిర్మాణ కార్యక్రమమునకైనా ఎల్లకాలం దేశమంతటా నిలిచే శక్తి కలుగదు. ఈ రెండు హంగులు కాంగ్రెసులో కుదిరే కాల మిప్పటికి రాలేదు. ఇప్పుడైనా రాగలదా అనేది కాంగ్రెసువారితీర్మానం మీద ఆధారపడుతుంది. అధికారపదవులు శాసనసభలలో అంగీకరించితే అనుకొన్న అవకాశం దొరకవచ్చు లేకపోతే అది జారిపోవచ్చు.

*　　*　　*

కాంగ్రెసువ్యవహారాలలో మరియొకలోపము కూడ విద్యావిధానంమీద దృష్టిని కేంద్రీపరింపకుండా చేసినదని చెప్పవచ్చు. గాంధికి పూర్వం కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమంలో దేశీయవిద్యే ప్రధాన కార్యక్రమంగా ఉండిందనవచ్చును. అప్పటిలో మన సీమలోనైనా, బళ్లకంటె నిజంగా ఎక్కువ ప్రజాసామాన్యానికి పనికివచ్చే గ్రంథాలయోద్యమవ్యాప్తి కలిగింది. గాంధియుగానికి స్వచ్ఛంద సేనగా పనికివచ్చే

ప్రజాసమూహం సిద్ధమయ్యే వాతావరణం కలుగజేసింది.

* * *

గాంధియుగంలో — కారణం ఏదైనా కావచ్చు — సబబైనదే కావచ్చు — విద్యావ్యాపనం — సార్వజనిక విజ్ఞానవ్యాప్తి — నిర్మాణ కార్యక్రమములో ప్రథమాంగమనే తలంపు నశించిపోయింది. జాతీయవిద్యాలయాలు పెట్టినా ఎల్లదర్జాల విద్యార్థులకు పెద్దలకు వడకడం ప్రధానం, హిందీ ప్రధానమనడం తప్ప వైజ్ఞానిక వ్యాప్తిప్రధానం అనడం కృశించింది. ఇప్పుడు జవ్హారియుగంలో దరిద్ర్యవంతులతో పోరాడడమే మహాకార్యమనుకుంటే, కౌన్సిళ్లలో కార్యవిహీనంగా కూర్చోటమే మహత్కార్య మనుకుంటే గొప్ప పొరబాటు మళ్లీ కలుగవచ్చు.

* * *

ఎవ రేమి చేయనీ వదలనీ 'అన్నమో రామచంద్రా' యని యల్లాడి చావకుండ గౌరవంగా జీవనంచేసే విధానం విద్యార్థి అక్షరాభ్యాసం మొదలు స్నాతకుడయ్యేవరకు నిర్ణయించవలసిందనే శబ్దము మిన్నుముట్టించేకీర్తి సర్. టీ. బీ. సప్రూకు దక్కింది.

* * *

ఇప్పటి కప్పుడే అభిప్రాయముమీద అభిప్రాయం బయలుదేరుతున్నది. కొందరు అమెరికా పద్ధతులవలంబించమంటున్నారు. కొందరు రుష్యా పద్ధతు లవలంబించమంటారు. ఇంగ్లీషు స్నేహితులు మాంచెస్టరు పద్ధతికి దాటకూడదంటారు. ఇన్నిచోట్ల ఇన్నిపద్ధతులును ఉన్నవనడంలోని రహస్యం గ్రహించినట్లైతే మనకు సరియైన తెలివి కలుగుతుంది. అదియేమంటే ఎంతటిసారం ఇన్నిపద్ధ తులలోనిది గ్రహించినా, మనపద్ధతి అనవలసిన దానికి బునాది మన దేశజీవితంలోనే ఉంది అనడం. దీనికి ప్రాముఖ్యం కలిగించి ఇతర మార్గాలలోని సారం ఇముడ్చుకుంటే మనకు తరణోపాయం కలుగుతుంది.

* * *

మనవిధానంలోనిప్రథమసూత్రాలు రెండు పరిస్ఫుటంగా లోకమంతా అంగీకరించింది. గురుకులపద్ధతి చాల దివ్యమైన దనడం మొదటిది. ఇందులో మళ్ళీ రెండుసత్యము లిమిడినవి. గురువు ఉత్తమాచార సంపన్నుడుగా నుండును కాబట్టి సదా అతనిసన్నిధానంలో విద్యార్థి ఉండడంచేత సద్గుణ సంపన్నత కలుగుతుం దనడం మొదటిసత్యము. ఇంగ్లీషులో 'ది టీచర్ ఈజ్ ది ఎక్జాంపిల్ ఫార్ ది స్కాలర్' అనవచ్చు. ఈ సత్యం నిర్వహణంకావలెనంటే గురువులను ఉత్తములను సిద్ధము చేసుకొనవలెను. ఈ కులానికి పదిగురు, ఆకులానికి ఐదుగురు, మరియొకకులానికొకరు చొప్పున నౌకరీలు కలుగ చేస్తామనే శాఖ విద్యాశాఖమాత్రం కాకూడదు. ఉత్తమాచార శిక్షణకెవ్వడు నిలువగలడో - అనగా అరుణోదయము నాలుగింటికి లేచి శుచికి తగిన సర్వసాధనలు, చన్నీటిస్నానముతోకూడ చేసికొని, బీడీలు, సిగరెట్లు, పొడుము ఇత్యాది దుష్టమార్గములపొంత బోక తప్పుడర్జీలు వ్రాయడం, కోర్టుసాక్ష్యములకు తిరుగడం, పత్రములువ్రాసి బ్రతుకడం జరుపక, తమ విద్యాగోష్ఠియందే నిమగ్నులగు వ్యక్తుల తరిబీతున కేర్పరచవలె. నేటి పదిగంటల కారంభమయి అయిదు గంటలకు ముగిసే మెథడ్‌మాత్రి గురువృత్తి శిక్షణ నిజముగా పనికిరాదు. ముమ్మాటికి పనికిరాదు. ఇప్పు డుద్యోగమునందుండువారికికూడ ఈ సర్వశిక్షణయు కలుగజేయవలెను. ఇందుకు నిలువలేనివారు వృత్తినుండి నిర్గమించుట మేలు. ఇంతటి యోగ్యతయు గురువులకుండవలెనని

15



అన్ని దేశము లనుచున్నవిగాని ఉపాధ్యాయున కీశిక్షణనిచ్చు దేశము మాత్రము ఏ దేశమును లేదు. అన్ని దేశములలోను విద్యాబోధక వృత్తి అన్నివృత్తులవలెనే ద్రవ్యార్జన వృత్తి మాత్రముగా గణించుటచేత అహరహ మనంత ప్రశ్న లుత్పన్నమగుచున్నవి. నిజమగుమూలాధారమును భేదించిన దీ భూమియే. గురుకులంవాసములోని. రెండవసత్యము గురువు స్వయముగా పరామర్శింపగల యందరే విద్యార్థు లతని యనుజ్ఞలో నుండవలెను. గురుకులము చేరినచోట ఆ గురుసంఘమునందు తగినంతమంది యుండవచ్చును గదా! అట్టి సంఘములే నాటి విశ్వవిద్యాలయములు- తక్షశిల,నళందా,ఇత్యాదులు.

* * *

నేడదేరీతి గురుకులములు స్థాపింపనగునా యని సందియమువలదు. నేడేమి జరుగుచున్నది? కాలేజీలలో చదువు విద్యార్థులు తలిదండ్రులతో నివాసము చేసే వారైతేనే తప్ప హాస్టలులో ఉండవలసిన దే ననుచున్నారు కాదా! అణ్ణామలై నగరంవలె ఎచ్చటనో దూరాన విద్యానగరం కట్టినచోట తలిదండ్రులతో ఉండడమే అసాధ్యం. ఇక హైస్కూళ్లలోకూడ హాస్టలు లేర్పడుచున్నవి. ఇదివరలో ఏపట్టణవాసపుఉద్యోగస్థులబిడ్డలుమాత్రమే చదువుకొంటూఉన్నంత కాలం హాస్టలుల అవసరం, కనుపించలేదు. మహాజనంలోనుంచి విద్యార్థులు చదువుకోడానికి ఆరంభించిన తరువాత వీని యవసరం కనుపించి ఇవి అభివృద్ధి యగుచున్నవి. ఇక సైన్యశాఖలోను ఇతర కార్యశాఖలలోను మనవారు చేరడానికి ఈ విద్యాలయాలు ఏవీ పనికిరావని చిన్నతనములోనే పిల్లలను పెంచుట కారంభంచేసే విద్యాలయాలు తయారవుతున్నవి. ఇదంతటికిని ఒక్కటే అర్థ మున్నది. విద్యార్థిదశ ఆరంభమయినదంటే విద్యార్థి గురువునద్ద సర్వజీవితం గడపవలసిందనే ఏ విద్యాసంస్థ యినా కట్టడాలు, దీపాలు, రోడ్లు, అవసరమైనా, ప్రాణంమాత్రం కావు. ప్రాణం వానిని నడిపే వ్యక్తులు, అనగా గురువులు.

* * *

ఇప్పటివిధానంలో ఎక్కడ లోపంవస్తూఉందో చూడండి! ఒక్క టేపదంలో చెప్పమంటే ఒక్క ఇంగ్లీషుమాటలో చెప్పవచ్చును. ఇది డెమొక్రాటిక్కు కాదు. అంటే సార్వజనికంకాదు. అయ్యా అందరుప్రజలను చేస్పుకంటున్నారే? సార్వజనికం కాదనడంలో అర్థ మున్నదా అని ప్రశ్నించవచ్చును. సార్వజనికంఅంటే అందరికి ప్రవేశమాత్రాధికారం చాలదు. అందరికి అందుబాటులో ఉండవలెను. ఇప్పటి విద్యా విధానంలో అది మృగ్యం.అందుబాటులోవుండేభాగం ఎందుకు కొరగాని అక్షరాభ్యాసభాగం. ఇతరభాగాలు అందరికి అందుబాటులోనికి రావలెనంటే ఇప్పటి కాలంలో సోషలిజం సంప్రాప్తిస్తేనే ఆఫలం కలుగుతుందేమో?

* * *

దానిమాట ఎట్లున్నా విద్యార్థులకు అందుబాటులో ఉండడం కాకుండా సంఘం ఆవిద్యను ఉపయోగించుకొనడానికి విద్యనేర్చుకున్న విద్యావంతులు సంఘానికి అందుబాటులో ఉండేవైనం కూడ ఏర్పడవలె. ఇప్పుడీ విషయం ఆలోచించే వారే కానరారు విద్యావంతుడైనవాని దొక దర్జా, సంఘాని దొక దర్జా.సంఘంలోని వ్యక్తికి నెలకు జీవితానికి అయిదురూపాయలు చాలితే విద్యార్థికి ఏబదిరూపాయలు కావలె. ఆదర్జాలో తయారైన విద్యార్థి తరువాత సంఘంలో ఇముడలేడు. ఈయిమిడికకనుకుదిర్చే శిక్షణ విద్యార్థికిఆరంభంనుంచీ కలిగితీరవలె. దానికి విద్యాబోధకుడు

మార్గదర్శకుడు. సంఘసామాన్యమునకు మించని జీవితమునడపు విద్యాబోధకుని సాహచర్యము సంఘమునకు మించని ప్రతిదినజీవితానికిదగిన విద్యార్థిశిక్షణ రెండు ఏర్పడితేనే విద్యయందు సార్వజనిక తత్వము కుదురుతుంది. వీనికి ఆదర్శం ప్రాచీన కాలపు గురుకులమును నాటి బ్రహ్మచర్యమును అని అంగీకరింపకతప్పదు. సర్ సి. వి. రామన్, సర్ రాధాకృష్ణన్, కట్టమంచి రామలింగారెడ్డి యంతటివారలు తమ దర్జా విద్యార్థులకు నేర్పవలెననక విద్యార్థుల దర్జాలో, అనగా ప్రజాసామాన్యపు దర్జాలో, తాము జీవితము నడుపువారు కావలెను. దానికి ప్రాచీన కాలపు వానప్రస్థులు సన్యాసులైనను మరల మన జాతిజీవనములో తయారుకావలెను లేదా గాంధిపంథా ననుసరించి జీవితము గడుపుటకు నిశ్చయించు పరిపక్వజీవులైనను సిద్ధముకావలెను. నడమంత్రపునానబాలతో కార్యము సాగదు. ఈ తత్త్వ మెరుగక విద్యావిధానము తీర్చే ప్రభుత్వాలు ప్రజలను పీడించి తిని పరోపజీవులు కాగల ఉద్యోగులను తయారుచేయవచ్చును; పండితులను తయారుచేయవచ్చును.. వీరందరును ప్రజల మేలునకు తోడ్పడువారు కాజాలరు. లోకశాంతిని కల్యాణమును సమకూర్చజాలరు. తాము భోగలాలసులైన ధనవంతులై, ధనవంతుల రాజ్యమునకు మంత్రినిర్మాతలై అనుదిన లోకప్రళయమునకు పసికివత్తురు.

# సూయాణము = ?

శ్రీమున్నంగి......శర్మగారు కఠినపదములకును-వాక్యములకును అర్థములు మొదలగునవి తెలుపుచు, తెనుఁగు భారతము వెల్లడించుచుండుట పండితు లెఱుంగుదురు. ఆయన ఇపుడు విరాటపర్వపు పని చేయుచున్నారు. అందు, అర్జునుఁడు విరాటునకు ధర్మరాజు నెఱింగించుపట్టున ఈ క్రింది పద్దెపుమగణా కలదు:

"సీ. నడదివియులు నేసె నగరికి మాణిక్య
మకుటముల్ పూనిన మనుజపతులఁ
దగునాజ్ఞ సూ యా ణ ముగ నొనరించె మం
చిగ నేల నాలుగుచెఱఁగులకును
బీ్రతార్థిజనుల సచేతన త్యాగధ్వ
జములుగా నన్ని దేశములఁ బఱపె
దిక్కు లన్నింటను దెలుపారుపూఁత గా
వించె నుజ్జ్వలయశోవిభ్రమంబు
రాజసూయాధ్వర ప్రవర్తకుఁడు నిత్య
సత్యభాషామహావ్రతశాలి పాండు
రాజదుగ్ధపయోనిధిరాజు ధర్మ
రాజు సుమ్ము మత్స్యావనీరమణ యితఁడు."

ఇందు 'సూయాణము' అను పదమునకు అర్థము కావలె. దీనికి ఆంధ్రపదపారిజాతమునను, పురుషోత్తమకవీయమునను 'వైరిభయంకర దండయాత్ర' అనియు, శబ్దరత్నాకరమున 'శత్రుభయంకరమైన దండయాత్ర' అనియు అర్థము కలదు. కాని ఆఅర్థము శర్మగారిని తృప్తిపఱుపలేదు. ఆయన నాకు జాబువ్రాయుచు, పైపద్యములో సూయాణము వాడిన పాదము తీసికొని, ఇట్లు వ్రాసిరి:

"ఇందు సూయాణమను మాట కర్థము తెలియదు. పూర్వకవుల పెద్దపాత్తముల నెక్కడను, నాచదివినంత వఱకు, కనపడదు. పిఠాపురము నిఘంటువారి నడిగితిని. గిడుగువారి నడిగితిని. శబ్దరత్నాకరము జూచితిని. "లక్ష్మీనారాయణీయము" జూచితిని. సరియైన యర్థముపట్టునకు తగినట్లు తేలలేదు. చివరకు మీకడ నీసందియము తీఱఁగలదని నమ్మికతో వ్రాసికొనుచున్నాను. మీ వీలునుబట్టి, తడవైనను, పరికించి తెలుపుఁడు."

నిఘంటువులలోని అర్థముకంటె మఱొకఅర్థము నాకును తెలియదు. దానితో సరిపెట్టుకొనవచ్చునని నాకు తట్టినది. అయినను, అరయుట నాపాడి

కావున, సూయాణమునకు తెనుఁగునిఘంటువులలోని అర్థము కాకవాడుకలో ఉన్నచో మఱొక అర్థమును, సంస్కృతనిఘంటువులం దెందేని తెలిపినచో దానిప్రకృతుల నానార్థములును, ఆ ప్రకృతుల - సూయున, సూయాన, సుయాన ? శబ్దముల-వ్యుత్పత్త్యర్థమును దయచేసి తెలుపుదురుగాక ! అని పండితులను వేఁడుచున్నాను.

తెనుఁగుఁగుడి, ది ౨౫-౭-౩౬. } మానేపల్లి రామచంద్రశాస్త్రి, గవర్నరుపేట, బెజవాడ.

# ఎస్. ఎస్. ఎల్. సి. పాఠ్యగ్రంథ విమర్శ

(చిత్రగుప్తుడు)

ఈ సంవత్సరము (1936 - 37) స్కూలు ఫైనలు పరీక్షకు నిర్ణీతమైన తెలుగు పాఠ్యగ్రంథమును గురించి చాల విస్తారమగు విమర్శ జరుగుచున్నది. ఇందులోని టిప్పణ భాగమును కర్ణపర్వమును తొలగించవలసినదని మద్రాసు టీచర్సు గిల్డు తెలుగుశాఖవారు ఆగస్టు 6 వ తేదీని తీర్మానించిరి.

ఈ పాఠ్యగ్రంథము, ఆంధ్ర, మద్రాసు, ఈ రెండు సర్వకళాపరిషత్తులును మెట్రిక్యులేషను పరీక్షకుగాను నియమించినవి. కావున దీనికి రెండు సర్వకళాపరిషత్తులవారును ఎస్. ఎస్. ఎల్. సి. బోర్డువారును ఇందరును ఉత్తరవాదులు.

నేటి యీమాటను వివరించుటకు ముందొక సంగతి చెప్పదగియున్నది. విద్యాలయములలో ఆద్యంతము నియమితమగుచుండు పఠనీయసామగ్రి కంతటికిని పాఠశాలలలోను కళాశాలలలోను బోధకులుగానుండువారే నిర్ణేతలై బయటిపండితుల కేరికిని ప్రవేశమే లేకపోవుట సంభవించియున్నది. ఇందులో గుణము లేదనరాదు. కాని దోషము మాత్రము తప్పదు. మనదేశములో ప్రభుత్వపుటొత్తిడి విద్యావిషయములందున కలదు. గ్రంథాలయములందుంచదగిన గ్రంథములు తమ నౌకరు ఒప్పుకొనిననేగాని తాము గ్రాంటులిచ్చుటలేదని నిర్ణయించు ప్రభుత్వము విద్యాలయములగ్రంథనిర్ణయమున నెంత తనపలుకుబడిని వినియోగించునో చెప్పనక్కరలేదు. అట్టి సందర్భమునందు ఎల్లకాలము సర్కారుదయమీద ఆధారపడు జీతములు కైకొనుచు వారినౌకరులతసఖీలకు లోనైన ఉపాధ్యాయులు ఎంతవారైనను స్వతంత్రులుగా నుందురనుమాటపొసగదు. కాబట్టి యీ సంస్థలలో కొంతమట్టుకు బయటి స్వతంత్రులకు ప్రవేశమేర్పరచనిచో పాఠ్యగ్రంథవిమర్శవలన నెక్కువ ఫలముండబోదు.

మన పాఠ్యగ్రంథ నిర్ణయమున మనకు కలిగిన పారతంత్ర్యము నేడు విమర్శలో నుండునట్టి గ్రంథముయొక్క అట్టమీదనే కన్పించును. లోపలి ముఖపత్రమును దీనికి సాక్ష్యమే. ముద్రలోనుంచి తుడిచివేయుటకు రాని 'ఆంధ్ర విశ్వకళాపరిష'త్తను తెలుగక్షరములుతప్ప తక్కినదంతయును ఇంగ్లీషుభాషలో లిఖితము. విషయసూచికప్రక్కన 'కంటెంట్సు' గద్యపద్యాముల కర్తాదులకు పైన 'అన్నొటేషను'ఇంగ్లీషులో తప్పినవికావు. 'టిప్పణి'యని తోచక 'గద్యపద్యాదుల కర్తాదు'లని రెండాదులు చేర్చి ఇంగ్లీషు పద్యమును భాషాంతరీకరించిన గాని తెమల్చలేని మహాపండితులు మరి యేమి చేయగల రందురేమో? విశ్వకళాపరిషత్తులేమి చేయుచున్నవి? ఎస్. ఎస్. ఎల్ సీ. బోర్డేమి చేయుచున్నది?

ఇక విమర్శ్యయం దుండు అసలు గ్రంథము 138 పేజీల పెద్దక్కరములయచ్చు. టీక 125 పేజీల చిన్నక్కరముల యచ్చు. పెద్దక్కరముల లెక్క వేసినయెడల నిది 187 పేజీలగును. పాపము స్కూలుఫైనలు పరీక్షార్థులకీ సర్వమును పరీక్షార్థము చదువదగినదే. కాబట్టి జరుగవలసిన మొదటికార్యము, టిప్పణి పఠనీయభాగము కాదని నిర్ణయించుట. ఇది జరిగెనేని పాఠముచెప్పు పండితులకుకొంతస్వాతంత్ర్యము కలుగును. తాముటిప్పణిని ప్రతిఫలించుబోధ కావించవలెన నెడిశృంఖలమునుండి తప్పించుకొంటిమని వారు సంతసింతురు. 'టిప్పణి'యు మాదిరి పరీక్షాపత్రములు ప్రత్యుత్తరములతో గూడ సమగ్రముగా నుండునట్లు వ్రాయక కొంత బోధకులు కొంత విద్యార్థులు స్వతంత్రముగా ఆలోచించుకొనుటకు అవకాశ ముండునట్లు వ్రాయించుట తరువాతిపని.

ఇప్పటి యీ గ్రంథమునకు టిప్పణి వ్రాసిన పండితులెవ్వరో కాని వీరు అసమర్థులు మాత్రము కారు. అతిసమర్థులు. ముఖపత్రము వ్రాయించినపండితులు ఇంగ్లీషున కెంతదాసులో టిప్పణివ్రాసిన ఈసమర్థపండితులుసంస్కృతమున కంతటిదాసులు. వీరికి, తెలుంగుబాసకు స్వరాజ్యము ప్రతిపాదించు ధోరణియే లేదు. ఏకర్ణపర్వమును త్రోసిపుచ్చవలసినదని నేడాందోళనకలిగినదో ఆకర్ణపర్వమునకు టిప్పణి యారంభించుచు ఈ పండితుడు శ్రీ శతఘంటము వేంకటరంగశాస్త్రిగారి కులనామ గోత్రములను జెప్పుటకు స్వవచనములు చాలవని ఆశాస్త్రులవారి సంస్కృత జటిలదీర్ఘసమాసభాష నెరవుదెచ్చికొనిరి. చూడుడు.

"ఆయన నియోగిశాఖాబ్రాహ్మణుడు;" "సంస్కృతాంధ్రభాషాకవిత్వచమత్కార పరితోషిత బుధస్తోమ సీతారామకవిలలామపుత్రుడు" "సకలశాస్త్రనిరంకుశ పాండితీధుర్య లక్ష్మీనరసింహ సుధీవర్య సచ్ఛాత్రుడు" "శ్రీ కాళహస్తి నగరాధినాథ శ్రీమద్దామర కుమారార్క మహీపాల కరుణాపురస్సర బహుమానపాత్రుడు."

పాపము! బళ్లలో పాఠముచెప్పు పండితులు ఈగద్దెను ప్రతిపదార్థ - తాత్పర్య సమన్వయములు బోధింపనైన బోధింపవలెను. లేదా విద్యార్థి గుడ్డిపాఠముగ వల్లించిపరీక్షయందు గ్రుమ్మరింపబోయి కకవికలై కార్యభగ్నుండైనను కావలెను

టిప్పణికారులైన ఈపండితునకు వ్యావహారిక భాషపై కసిదీర్చుకొనవలెనను కండూతి పుట్టినది. మరి యెచ్చటను వీరి కవకాశము కలుగలేదు కావలెను. ఈవ్యాఖ్యానమునందు మూడుఘట్టములలో నీ పండితుడు అవకాశము లేనిచోట అవకాశము కల్పించుకొని అసభ్యప్రవర్తన కనుపరచెను.

మొదటిది 155 వ పేజీలో

"ఆంధ్రదేశమున నప్పుడుగాని యిప్పుడుగాని సకలజనులును ననవరతము చదువుచునుండు గ్రంథములు కవిత్రయమువారి యాంధ్రమహాభారతమును, బోతన యాంధ్రభాగవతమును మాత్రములే. కావున నయ్యవి జీవితముతోఁ గూడి యున్నవి. (అర్థమేమి ? సజీవములనియా? జీవకళ కలవనియా ? ) తక్కిన మహాకవులు వ్రాసిన మహాగ్రంథములు సజీవములైనవి కావా ? అనినచో జీవితముతోఁ గూడినవే యైయున్నను ఈమాఁటికిఁగల ప్రాశస్త్యము తక్కినవానికి లేదని రూఢిగఁ జెప్పవచ్చును. ఇసల్లపుట్టలవలె నీ కాలమున వ్యావహారిక భాషలో (The So Called Modern Telugu) వ్రాయఁబడు భావకవిత్వములు భావములులేనివై నిర్జీవములై వాని వ్రాసిన గ్రంథకర్తల పెట్టియలయందుండుఁ గాని, భారత భాగవతరామాయణములకుఁ గల వన్నెయు వాసియును వానికి రావని భావము."

ఏమి యీ సందర్భశుద్ధి!

229 వ పుటలో

"సౌందరనందము నూతన కావ్యము. భాష గ్రాంథికమే. లోకవ్యవహారసిద్ధమైనదే" యని వ్రాసి యంతట నిలువక

"కాని మాడరన్ తెలుగు అని యాంధ్రలోకమున నొకరిద్దరు చెప్పుకొనుచు వ్రాయుచు నుపన్యాసములిచ్చుచు నుండు వికారభాష కాదు."

అని కల్పించుకొని వ్రాసిరి. ఇంతటను వీరికి తనివితీరలేదు. మరి ప్రక్కపుటలోనే

"ఈ కాలమున నాంధ్రభాషలో నోనమాలుకూడ వ్రాయను జదువను నేర్వక యాంధ్రభాషలోఁ దమకంటె గొప్పపండితులు వేఱొకరు లేరని తలఁచుచు మాసపత్రికకు సంపాదకులై యుండు పండితమ్మన్యులకీ రెండుగ్రంథములందలి వచనరచన పెనుబండవలెనున్నను"

అని తెంపరితనమున మాసపత్రికసంపాదకుల నందరను నోనమాలు నేర్వనివారలని దూషింప సాహసించిరి.

ఇక్కడకీ పండితుల కగ తీరలేదు.

239 వ పుటలో

'వారలను నేను వధించుట యొండె' 'నేను వారల వధించుట యొండె' యను వాక్యమున 'ఒండె' ను వ్యాఖ్యవ్రాయుట వీరిపని. దానికి 'కాని' అను సముచ్చయార్థము వ్రాసిరి. దాని స్వరూప వివరణ చేసిరి. 'ను' సముచ్చయమని అప్రస్తుతమును త్రవ్వి దానికుదాహరణము లీయ నుపక్రమించిరి. అచ్చటినుండి ఇప్పుడు వ్రాయఁబడు నవీన వచన గ్రంథములమీదికి లంఘించిరి "The So called Modern Telugu Prose Books" అని ఆంగ్లమున పునరుక్తిగా నపహసించి అందు 'రాముఁడుగాని లేక లక్ష్మణుఁడుగాని' అను దుష్టప్రయోగము లనేకములు కానవచ్చుచున్నవి. ఇదియే "మాడరన్ తెలుగుసుమా ! " యనిపకపకనవ్వి ఇంకేమియో వ్రాసి విద్యార్థుల కొక సుగ్రీవాజ్ఞను శ్రుతపరచిరి.

"కవిత్రయమువారొనర్చిన యాంధ్రమహాభారతమును క్షుణ్ణముగఁ బరీక్షలకని నియమింపఁబడు గ్రంథములంబలె సంస్కృతాంధ్రములం దసమాన పాండిత్యము కల గురువుముఖముగాఁ జదివినంగాని వచన రచనకును బద్యము లల్లుటకును బ్రయత్నింపఁగూడ" దనిరి.

'వాడుక భాష' మీఁది వంతతో గూడ వీరికి వీరి దృష్టియందు సంఘ సంస్కారు లగునట్టివారియందరి మీదను వదలనట్టి వైషమ్యము కలదు. చూడుడు. అశ్వమేధ పర్వమున

క॥ స్త్రీ సంతోషించు తెఱం
గాసపడని మనసు కలుగు♦నట్టి యధముఁ డి
చ్చో సడిఁగను; చని యచ్చోఁ
గాసింబడు జమునిభటులు ♦ గారియవెట్టన్.

అను పద్యము. దీనికి వీరువ్యాఖ్య వ్రాయుచు

"ఈతీరున స్త్రీల ననాదినుండి పురుషులు గౌరవించుచు వచ్చుచున్నారు. ధర్మమునకుఁ గట్టువడిన హైందవ సంఘమున వారికిఁగల స్థానము ఖండాంతరములందలి స్త్రీలకు లేనే లేదని రూఢిగఁ జెప్పవచ్చును" అనిరి. బాగు. ఇంతటితో విరమించిన గౌరవమే. కాదు, అది వీరు దక్కించు

కొన నోచుకొనలేదు. మరి ముందుకు సాగినారు. ఈక్రింది వ్రాత వ్రాసినారు:—

"మూర్ఖుఁ డెవఁడో యొకానొకఁడు స్త్రీనిఁ గ్రూర దృష్టితోఁ జూచి హింసించెను. అది వ్యాజముగాఁగొని, స్త్రీలఁ బురుషులు గౌరవింపక హింసించుచున్నారను నపప్రథనర్మమునకు బద్ధమగు హైందవసంఘమునిర్మాణ క్రమమెఱుఁగని పాశ్చాత్త్యు లొక కొందఱును, వారిచే శిక్షితులైన సంఘసంస్కర్తలొక కొందఱును, వ్రాసిన వ్రాతలవలనను అప్పుడప్పుడెడతెగక చేయుచుండు నుపన్యాసములవలనను వచ్చినదే...

హిందూదేశమున గొప్పగొప్ప హైందవ కుటుంబములందు (అనఁగా పాశ్చాత్త్యుల సహవాసమువలనఁ గళంకము నొందక యుండు కుటుంబములు) నేఁటికిఁ గూడ స్త్రీల కొసఁగబడి యుండు మహోన్నతస్థానము ప్రపంచమునందు వెండియు నే సంఘమునం దుండు స్త్రీలకియ్యఁబడి యుండదని నొక్కి వక్కాణింపవచ్చును."

ఈ పండితులు వ్రాయు 'పడు' లలోను 'వలన'ల లోను పూర్వాపర సందర్భశుద్ధిలేని వచనములలోను జిక్కుకొని నొక్కులుపడు సరస్వతిమొర వినువారు లేకపోయిన లేకపోవచ్చును గాని "పాశ్చాత్త్యుల సహవాసమువలన కళంకము నొందక యుండు కుటుంబము"లను పరమనీచభాషనుమాత్రము పరిశీలించి వీరిచేత బహిరంగ క్షమాపణ వ్రాయించనిచో విద్యాధికారు లుండియు లేనివారగుదురని చెప్పక తప్పదు.

ఇక వీరు సాంఘికాభిప్రాయములు ప్రకటించుటలోఁ గూడ నితరులకు నొప్పి కలుగునట్లు విశృంఖలముగా విహరించిరి.

చూడుడు పుట 172.

'శిఖ'కు వ్యాఖ్యానము. అర్థము-జుట్టు. బాగున్నది. దానికిమరి వివరణ "అనఁగా వికారమైన ముందుజుట్టు (అనఁగా కొప్పు) కాదు" ఏల యీయధికప్రసంగము?

ఇఁక 'విధవావివాహములు'. పుట 157

"ఈసహగమనమను నాచారమువలన నాకాలమునఁ బూర్వసువాసినులు లేరు. విధవావివాహము లప్పుడు లేవు. జనసంఖ్యఅధికమగుటలేదు. అయిరోపాలో విధవల పెండ్లిండ్ల వలన కలుగుచుండు జనసమూహమునకు నిలువ జోటు చూపనెంచి యందలి రాజ్యభారములేలు నేలిక లన్యోన్య మనవరతము కుక్కలవలెబోట్లాడుచుందురు. విధవావివాహములు లేనిచోటుల యిట్టియుద్ధములకు ప్రసక్తి లేదు."

ఈ వాక్యములను వీరు ఏయవసరమును లేక వ్రాసిరి. వీరు భాగవత పంచమస్కంధములోని భరతోపాఖ్యానముకథాసంగ్రహమును స్వవాక్యములలో వ్రాయుచున్నారు. "తండ్రి లోకాంతరగతుఁడయ్యె. తల్లిసహగమనమొనర్చె"నని చెప్పి తాము ప్రయోగించిన ఈ సహగమన పదమునకు వ్యాఖ్యలో వ్యాఖ్య ఫుట్ నోట్ గా నిమిడ్చిరి. అప్పుడైనను సహగమనమను నాచార మిట్టిదని వివరించిరా! లేదు. విధవావివాహముమీఁద దండయాత్ర వెడలిరి.

బాల్యవివాహ విరోధులను ఈ పండితుడు వదలలేదు. డోరాకు వ్యాఖ్యానము వ్రాయుటయందు కల్పించుకొన్నాఁ డవకాశమును. విల్లియమును వలచి పెండ్లియాడి కొమరునిఁ గని విల్లియము మరణింపగ మరియొకని మేరీ వరించెను. ఈ క్రిందిప్రశ్న లుపయుక్తములని ప్రశ్నలు కల్పించి అందులో తుదిప్రశ్నలో మేరీకి బుద్ధివచ్చిన వెనుక నే విల్లియము పెండ్లియాడెనుగదా! అది రెండవ పెండిలి ఏల చేసికొనెను? అని ముగించిరి.

ఇన్నివిషయములందు కల్పించుకొనిన ఈ పండితునకు నేడెల్లర దృష్టి నాకర్షించిన 'అస్పృశ్యత' ను స్పృశించక వదలునంతటి నిబ్బరముండునా?

సౌందరనందముకథ మాలపల్లెలో సుందరియు నందుడును సమావేశమగుటతోఁగదా ముగియును! కావున పఠనీయభాగము సుందరివిరహసంవేదన మాత్రమే యైనను, వ్యాఖ్యానము ముగించుపట్టున మాలపల్లె ప్రసక్తి రాకున్నను పూర్వకవుల దారిఁ ద్రొక్కనందుకు కవులను భూషించుచు అత్యనవసరముగ గాంధినిగూడ నీపండితులు ఈక్రిందితీరున లాగికొనివచ్చిరి.

"ఆకాలమున బౌద్ధసన్యాసులు మాలపల్లెలకేగి మంచి మాటలు చెప్పి దేహశౌచమ్ము బోధించుచుఁ దామే చేయుచునుండి' రనునది సత్యమునకు దూరము గాక మరేమగును? గంధియును నాతనియనుచరులును మాలపల్లె సంస్కరించు కార్యము బౌద్ధమత సన్యాసుల కంటగట్టుట యనుచితము. వెండియు నధర్మము." బౌద్ధమతమం దేవగింపుకల్గించుటకును వీరు ప్రయత్నించిరి. 'అపగత పుష్ప సాయక విహార విహార'మని కవులు బుద్ధుని విహారము నెచటనో వర్ణించిరట! అది విద్యార్థులు పఠింపవలసిన భాగమునందు లేదు. దానిని లాగితెచ్చి రమేశచంద్రదత్తాదిగా గల దేశచరిత్ర గ్రంథకర్తలు వ్రాసియున్నారని ఈ క్రింది వాక్యములు ద్రోల్చి యీ పండి

తులు తమ యసహనమును రసికతయును విద్యార్థులకు వ్యాపింపజేయ ప్రయత్నించిరి.

'అపగత పుష్పసాయక విహార విహారము' అని కవులు గౌతముఁ డుండిన విహారముం గూర్చి చెప్పియుండినను, గౌతమబుద్ధుఁడు సిద్ధిచెందిన పెక్కేండ్లకు బౌద్ధమతము బోధించుటకై బౌద్ధమతదీక్షవహించిన బౌద్ధ సన్యాసులును బౌద్ధ సన్యాసినులును చేరియుండిన విహారములెల్ల అపగత పుష్పసాయక విహార విహారములై యుండినవి. పుష్పసాయక విహారమున కాటపట్టులైనవి.

వ్యాఖ్యవ్రాసినపండితుని యభిప్రాయములుసరియైనవా కావా యనియు ప్రశ్నించుట ఈ విమర్శన యందు ప్రధానముగాదు. స్కూలుఫైనలు విద్యార్థుల కొరకు వ్యాఖ్య వ్రాయునట్టి వీరికీ విశృంఖల విహారము తగదని ఎవ్వరును అంగీకరింపగలరు.

ఇక పఠనీయములుగ నిర్ణీతములైన పద్య గద్య ఖండము లుచితములా? యనునది తరువాతిప్రశ్న. మద్రాసు టీచర్సు గిల్డువారు ప్రత్యేకము కర్ణపర్వమును ఎత్తిచూపినారు. దీనిని మహాద్భుత మేధావంతులగు శతఘంటం వేంకటరంగశాస్త్రిగారు విరచించి రనుట నిజమే. కాని ఎస్. ఎస్. ఎల్. సి. కి పఠనీయము చేయవచ్చునాయనిన ఎట్టివారును చేయతగదని యొప్పుకొనక తీరదు. ఇతరులు చూపిన యశ్లీలములటుండ, మొదటి కారణము: ఇది ఆ తరగతివిద్యార్థుల యోగ్యతకు చాల తలమెట్టునది. ఒకవేళ బి. ఏ. కు వచనపాఠముగా పెట్టదగిన దగును. అప్పుడును ఈ గ్రంథశైలి విద్యార్థులు నేరువదగు నని పెట్టదగినదిగాదు. చారిత్రిక శైలివిమర్శనమున నిదిఅత్యుపకారిగా నెన్నదగినది గావున పఠనీయము. నేటి పరిస్థితి ప్రజాసత్తాక పరిస్థితి.ఈపరిస్థితి కోరునట్టి శైలిసంక్షేపితసులభవాక్య సమన్వితమగు లలితశైలి. శతఘంటం వేంకటరంగశాస్త్రిగా రనంత భారతసాగర విహారులు కావున తిక్కన సంక్షేప వచన శైలి నొకకొంతయలవరుచుకొనిరి. ప్రదర్శించిరి. కాని తిక్కన లాలిత్యము వీరి కబ్బినది కాదు. కావున ప్రధాన గుణమున కొంత కరవు కల్గినది. ఎట్లయినను, కర్ణపర్వము ఎస్. ఎస్. ఎల్. సి. పాఠము నుండి తీసివేసిన బాగుండును. తక్కుంగల పఠనీయ వచన ఖండములును కొన్ని యనర్హములే. సిరియాలు కథలోని యీ క్రింది వాక్యముం గనుఁడు.

"అప్రకారము పోవఁగానటకుముందు కపటపుమాయాయోగియగు నానెలతాల్పు ముసలివేషము మానివేఱొండు రూపముతో చిఱుతొండనంబికుమారుఁడగు సిరియాళు మనముఁ జలింపఁజేయు నిచ్చతో నాపసివాఁడు పఠించు నొజ్జయింటికిఁ బోయి కేలఁగల పుస్తకమున వ్రాయఁబడిన నీలకంఠస్తవము చదువు సిరియాళుం గని యాబాలునిఁ జేరఁగ నరుదెంచి నిలఁబడియె."

అట్టి వచన రచనయేనా విద్యార్థులు నేరువందగు? శకట రేఫములు అరసున్నలు నిండియున్న దృష్టియా?

మరియొక యుదాహరణము 'డోరా' లోనిది తిలకింపుడు.

యువతీయువకుల నాకర్షించి భార్యా పతులనుగా నొనర్చునది పరస్పరానురాగము. ప్రప్రథమమున భిన్నమూలములైనను నొక్కచోటఁ గలిసి, వారి వారి మనోగతులకు నేకవాహినిగాఁ బ్రవహింప వలయు రాగవాహినులు ప్రతికూల మార్గంబులఁ బోయినచో నవి యెన్నఁడుఁ జేరవు.నిర్బంధవివాహంబుల వలన ననర్థంబులువొరయు."

ఈ రచయిత టెనిసన్ వ్రాసిన 'డోరా' చదివి స్వతంత్రుఁడుగా వ్రాసినట్లును కానరాదు. ఇంగ్లీషులోని ఏ డోరాకథనో వచనరూపమైనదానిని ముక్కశ్చముక్కగా తెలుగుజాతీయమును గాని, భావలాలిత్యమును గాని తుదకు పూర్వాపరవచనమాత్రసందర్భ శుద్ధినిగాని పాటింపక యితడు వ్రాసినాడు. కాని అరసున్నలు పెట్టుటయందును ప్రథమమీది పకారమువకారముగా మార్చుయందును నెరజాణతనమును కనుపరచినాడు.

ఇక విమర్శ పెంచనక్కరలేదు. సర్వకళాశాలల వారును, ఎస్. ఎస్. ఎల్. సీ. బోర్డువారును కన్నులు తెరవరేని విద్యార్థులకు చేఁజిక్కునది మన్నుగాని జీవకళగల భాష కాదు. గౌరన ద్విపదలో వ్రాసినరీతిని లలిత వచన రచనలు చేసినవారు లేనేలేరా? ఉన్నచో అధికారుల దృష్టికి వీరు గోచరింపరా? విచారింపందగు.

---

☞ ఈ వ్యాసమచ్చు పడునప్పుడు ఎస్. ఎస్. ఎల్. సి. తెలుగు పాఠ్యగ్రంథ పఠనీయభాగములలో కొన్ని మార్పులు జరిగినట్లు తెలియవచ్చినది.

# బియ్యపుగుట్టు - బీదసాదల ఆయువుపట్టు

(శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రి గారు)

1 హిందూదేశములో వింధ్యపర్వతములకు ఉత్తరముననుండు జాతులన్నియు హెచ్చుగా గోధుమలను, కొద్దిగా వరిబియ్యమును తిందురు. వింధ్యకు దక్షిణమున నున్నను, మహారాష్ట్రులు ఉత్తరజాతులనే అనుసరించెదరు. వారుగాక తక్కిన దక్షిణాపథు లందరును, అనగా, కర్ణాటక, కేరళ, తమిళ, ఆంధ్రదేశీయులు వరిబియ్యమునే అత్యధికముగా వాడుదురు. సుమారు 40 సంవత్సరముల పూర్వము మనదేశములో వడ్లమరలుగాని, బియ్యపు మరలుగాని ఏర్పడలేదు. అందరును దంపుడు బియ్యమునే వాడుచుండిరి. కొందరు తామే దంచుకొనిరి. మరి కొందరుదంపించుకొనిరి. హిందూదేశము అంతటిలో 4 కోట్ల 88 లక్షల ఎకరములభూమి నీటితో సాగగుచున్నది అందులో 1 కోటి 86 లక్షల ఎకరములు వరిపైరు వేయుచున్నారు. సగటున ఎకరమునకు 12 బస్తాలు పండిన ఎడల, 22 కోట్ల 34 లక్షల బస్తాలు వడ్లు తయారగును. 2 మనుష్యులు 1 బస్తా దంచెదరు. కాన 44 కోట్ల 68 లక్షల జనమునకు 1 రోజుపని కలుగును. ఏడాదిపొడుగున పనిచేసిన ఎడల 12½ లక్షలకు పనికలుగును. 60 రోజులు సెలవులు వదలినచో 15 లక్షలకు పనికలుగును.

2 హిందూదేశములో ఇప్పుడు అన్నిరకముల పనిచేయుచున్న యంత్రశాలలు షుమారు 8 వేలు; వాసిలో పనిచేయువారిసంఖ్య షుమారు 14 లక్షలు. భారతీయులందరును దంపుడుబియ్యముతినే ఎడల 8 వేల యంత్రశాలలలో పనిచేయు జనముకంటె హెచ్చుమందికి పనిగలుగును.

3 ఈ 8వేల యంత్రశాలలలోను బియ్యమును చేయుటకు ప్రత్యేకముగా మరలు కలవు. పండిన వండ్ల నన్నిటిని మరలో వేసినను 2500 మరలు కావలసివచ్చును. మర 1 కి 40 మంది కూలీలు లెక్క వేసినను 1 లక్షజనమునకు మాత్రమే బియ్యపు మరలు పనిచూపగలుగును. కాబట్టి ఈ మరలవల్ల 14 లక్షల జనమునకు జీవనోపాధి నశించును.

4 బియ్యపు మరలకు 7½ కోట్ల రూపాయలు పెట్టుబడి కావలసి వచ్చును. ఒక జట్టుకు కావలసిన దంపుడుసామాను లన్నియు, రెండు రోకళ్లు 1 జల్లెడ, 1 చేట, 1 కుంది, 1 రాయి, వీటి ఖరీదు 3 రూపాయలకు మించదు. 15లక్షల జనము కొత్తగా పరికరములన్ని సంపాదించినను 45 లక్షలుకు మించిన మూలధనము అక్కరలేదు. మరియు ఈపనిముట్లన్నియు మనదేశములో దొరుకునవి. బియ్యపు మరలకు కావలసిన యంత్రములు విదేశములనుండి దిగుమతి కావలసియున్నవి. పైదెల్పిన 7½ కోట్లమీద చౌకవడ్డీ చూచుకొన్నను అనగా, 0-8-0 చొప్పున చూచినను 45 లక్షలరూపాయలగును. మరలమీద పెట్టవలసిన 7½ కోట్లను నిలవయుంచుకొని వడ్డీని మాత్రము వాడినచో పండిన వడ్లన్నియు దంపించ వచ్చును.

5 మరలలో కనీసము రోజుకు 10గంటలు పనిచేతురు. ఇద్దరు మనుష్యులు 10 గంటలలో 2 బస్తాలవడ్లు దంచుదురు. కనీసము 1½ బస్తా దంచగలరు. 1 బస్తా వడ్లకు 0-6-0 చొప్పున ఒక్కొక్కరు 0-4-6 సంపాదించగలరు. బియ్యపు

మరలలో మగవానికి 0-6-0 ఆడుమనిషికి 0-4-0 చొప్పున కూలివచ్చును. కాని ఇదిబస్తీలో చేసేపని. మొదటిది పట్టెటూళ్ళలోని పని. కూలి తేడా ధరల తేడాకు సరిపోవును లేదా కష్టపడి 2 బస్తాలు దంచిన ఎడల తేడా ఉండదు.

6 దంపుడు బియ్యములో ఉన్న విటమిన్ లేక జీవాణువు మరబియ్యములో లేదు. దీనిని మొట్ట మొదట బటేవియాలో ఏక్‌మన్ అను వైద్యుడు కనిపెట్టెను. మనుష్యులకు కోళ్ళకు మరబియ్యమును పెట్టగా నంజువచ్చెను. ఉభయులకు చిట్టు తవుడు బియ్యముతో కలిపిపెట్టగా నంజు నయమయ్యెను. మరబియ్యములో లేక, చిట్టు తవుడులో నున్న వస్తువేదో ఆయన కనిపెట్ట లేకపోయెను. గ్రిజన్ అనునతడు చిట్టు తవుడు చేసిన పనిని, ఒక్కాళ్ళు చేయునని కనిపెట్టెను. వెడ్డర్, చేంబర్లైన్, అను వైద్యులు వీనిగుణములను కనిపెట్టిరి. అది వేడివల్ల చెడిపోవును, నీటిలో కరగును. ఫంక్ అను వైద్యుడు దీనికి Vitamin (B) జీవాణువు బి అను పేరు పెట్టెను. మెక్కర్‌సన్ అను వైద్యుడు వీనిని మరింత పరిశోధించెను. సైనికులును, నావికులును, గర్భిణీస్త్రీలును, పిల్లలకు పాలిచ్చు తల్లులును, కాయకష్టపడువారును ఈవిటమిన్ బి లేని ఆహారము తిన్నయెడల, మొదట అజీర్ణము తర్వాత తిమ్మిరులు తర్వాత నంజు ఏర్పడును. సోడాఉప్పు వేసినఎడల ఇది నశించును. కాబట్టి ఈవిటమిన్ బి కోరువారు మరబియ్యమును తినరాదు. దంపుడు బియ్యమును కూడ మెరుగు పెట్టించరాదు. చేబియ్యమును కూడ అధికముగా కడగరాదు. గంజి నేమాత్రమును పారబోయరాదు. ఇట్లు వంటచేసుకొన్నచో అన్నము రుచిగానుండును. బలమిచ్చును. నంజు నాశనమగును. రక్తము శుభ్రమగును. కాన ఇతర జాడ్యములకు తావుండదు.

7 ముడిబియ్యము వండుట మనవారికి చేతగాదు. ఆబియ్యమును మూడుగంటల సేపు నానబోసి నీళ్ళలోనే ఉంచవలయును? తర్వాత నీళ్ళు తీసి ఎసరులో పోయవలెను. ఏమాత్రము పలుకు లేకుండా మెతుకుకు మెతుకు అతుకుకొనకుండా దివ్యముగా ఉడుకును. గాంధిమహాత్ములవారు మగన్‌వాడీలో ఇట్లు చేయుచున్నారు. వినయాశ్రమ ఖద్దరుసంస్థానములలోని అనుభవమును ఇదియే.

8 మరబియ్యముకంటె దంపుడు బియ్యము ఒడుగు. దీనికి వినయాశ్రమములో లెక్కలు కట్టిరి. మరబియ్యముకన్న దంపుడుబియ్యము హెచ్చునీటిని పీల్చును అన్నము బరువు హెచ్చును ఒడుగగును కనుక హెచ్చునుంది తినుటకు వీలు కలుగును.

9. దంపుడుబియ్యము ఇప్పుడు మరబియ్యము కన్న ప్రియముగానున్నవి. పాతబియ్యమునకు బస్తా 1కి రు 1-0-0 తేడాగలదు ఎవరివద్దవారు దంచుకొన్నచో వారికి పనియు ఆరోగ్యమును కలుగును. ఈధర తేడాయుండదు, దంచుకోలేని వారు కొనవలెను. వారు హెచ్చు పెట్టు 1-8-0 లో షుమారు 1 రూపాయి ఒడుగువలన కలసి వచ్చును. తక్కిన 0-8-0 మందు ఖర్చులును, రోగమును బాధయును తగ్గుటచేత కలసివచ్చును. ఈతేడాకు మరొక కారణముకూడా చెప్ప వచ్చును. లాభదృష్టిగల వ్యాపారస్థులు కొందరు, పాత కొత్తధాన్యములను కలుపుటచేతను, ఖరీదు గల రకములలో తక్కువరకమును కలుపుటచేతను చౌకగా అమ్మగలుగుచున్నారు మరియు, దంపుడుబియ్యమని చెప్పబడు వాటిలో

కూడ కొన్ని చిక్కులుగలవు. వడ్లను బియ్యమును రోకళ్లతో దంచువారు కొందరు, వడ్లనుచేతిమర మీద పట్టించి బియ్యమును రోకంటితో దంచు వారు కొందరు, ఒంటిపట్టు బియ్యమును తెచ్చి దంపుడు బియ్యముక్రింద వాడువారు మూడవ వారు. ఏవిధమైన మర పనికిరాదని ఆయుర్వేద యునాని వైద్యులు చెప్పుచున్నారు గుంటూరు డాక్టరుగారగు శంకర వెంకట్రావుగారు మర లలో తయారగు, ముడిబియ్యము పనికిరావనిరి. కాంగ్రెసు అధ్యక్షులగు డాక్టరు ఆన్సారిగారు వెంకట్రావుగారిని బలపరిచిరి. గాంధీగారు వీరి అభిప్రాయమును అంగీకరించిరి. నీటితో లేక ఆవిరితో కలుగు తడివేడి లేక పొడివేడి వడ్లను బియ్యము పైపొరలో నుండు జీవాణువులు, లవ ణములు నశించునని అన్సారిగారు స్థిరపరచిరి దంచుటలో గాలితగులుటచేత, వేడియుండదు. కాబట్టి మరబియ్యము ఏరూపమునను పనిక రావు.

10 వడ్లు దంచగా నాల్గవవంతు ఊకఅగును. (మానికెకుసోలెడు) ముడిబియ్యమును దంచిన చిట్టు తౌడు 100 టికి 15 వంతున అగును (మానికకు ½ సోలెడు) ఇట్లు మూడరసోలలు పోగా, తవ్వెన్నరసోలెడు బియ్యము మిగులును. మరబియ్యముకన్న దంపుడుబియ్యమే చౌక అగును.

11 వడ్లగింజలో ఒకమూల దానిపిత్తనముం డును. అనగా అది మొలకెత్తుశక్తి. మోటుగా దంచుట చేతగాని అధికముగా మెరుగు పెట్టుట చేతగాని ఈమొలకభాగము నూకగా వేరైన ఎడల తక్కిన బియ్యపుగింజ వట్టిపిప్పిమాత్రమే. ఆపిప్పిని తిన్నను తినకపోయినను ఒకటియే. కాబట్టి నేర్పుగాదంచి ఊకను మాత్రము తీసివేసి నూకకాకుండ పైపొరపోకుండా అత్తెసరుపెట్టు కొని తిన్న బియ్యము చాలా శ్రేష్ఠము. మహా త్మాజీ దీనినే తినమని ఆజ్ఞాపించుచున్నారు. ప్రముఖులగు వైద్యుల అభిప్రాయ మిది. నాకలు తిను ఉప్పరవాండ్రు నడిఎండలోకూడ మిక్కిలి కష్టమగు పారపలుగు పనులను చేయగలుగు చున్నారు. బియ్యమును తిను నాజూకులు బిందె ఎత్తలేరు.

12 క్రొత్త బియ్యము కన్న పాతబియ్యమును తినుటయే శ్రేష్ఠము. పాతరవేసిన వడ్లబియ్యము దుర్బలులకు రోగులకు బాలింతరాళ్లకు పనికి వచ్చును. పరిలో వడ్లబియ్యము లేక కొట్లో వడ్లబియ్యము విత్తనములకు పనికివచ్చు వడ్ల బియ్యము సామాన్యులు తినవలయును. తెల్లగా నున్న క్రొత్త మరబియ్యము తినువారికన్న దంచిన పాతబియ్యమునే తినేవారికి ఒదుగువలన అధికమైన లాభము కలుగుచున్నది. నూటికి 34½ అనగా షుమారు 3 వ వంతు తేడాకలదు. ఇప్పుడు క్రొత్తధాన్యమునకును, పాతధాన్యము నకును, 100 కి 5½ వంతున తేడాకలదు. ఈతేడా తీసివేసినను అచ్చుఒదుగునే పట్టి క్రొత్త మర బియ్యమును తినువారికన్న పాత మెరుగుబియ్య ము తినేవారు కనీసము 1 రూపాయకు పావలా చొప్పున లాభము పొందుచున్నారు. ఇది గమ నించక బీదలు చౌకయని క్రొత్తమర తెల్లబియ్య ము తిని ధననష్టమునకు ఆరోగ్య నష్టమునకు పాలగుచున్నారు.

క్రొత్తమర తెల్లబియ్యముకన్న క్రొత్తముడి దంపుడుబియ్యము నూటికి 15 వంతులు ఒదుగు. క్రొత్తముడి దంపుడు బియ్యముకన్న పాతముడి దంపుడుబియ్యము నూటికి 7 వంతులు ఒదుగు. పాతముడి దంపుడుబియ్యముకన్న పాత తెలుపు

దంపుడుబియ్యము నూటికి 10 వంతులు ఒదుగు క్రొత్త మరతెల్ల బియ్యముకన్న, పాతముడి దంపుడుబియ్యము నూటికి 22 వంతులు ఒదుగు.

కాబట్టి క్రొత్తమరతెల్లబియ్యము తినువారి కన్న పాత తెలుపు దంపుడు బియ్యము తినువారు నూటికి 34 వంతులు ఒదుగుద్వారా లాభము పొందుదురు.

13 బియ్యమును ఏల మరలో దంచి అధికముగా మెరుగు పెట్టిరని అడుగవచ్చును? పాశ్చాత్యవర్తకులు హిందూదేశము వచ్చిన పిమ్మట భారతీయకూలీలను వారివారివలసరాజ్యములకు తీసుకొని పోయిరి. అట్లు వలసపోయిన భారతీయులు ఆయా దేశములలో నుండియు ఈ వరిబియ్యమును కోరిరి. వారికై దూరదేశములకు బియ్యము ఎగుమతి చేయవలసివచ్చెను. అట్టి ఎగుమతి బహుకాలము పట్టుచుండెను. దంపుడు బియ్యమునకు కొద్దిరోజులలో పురుగు పట్టును. మెరుగు అధికమైన కొలదియు మర బియ్యమునకు పురుగు సోకదు. ఏల? దంపుడు బియ్యములో తియ్యదనముగలదు. మరబియ్యములో తీపిలేనేలేదు. పురుగు గూడ ఆశించని మరబియ్యము నాగరికులు తినుట ఆశ్చర్యకరము.

14 బియ్యములకుపట్టు పురుగులు 2 విధములు. 1. ముక్కుపురుగు. ఇది తీపిగల దంపుడు బియ్యమునకే పట్టును. చెరుగుటచేతను బియ్యము కడుగునపుడు పైతేలినవి తీసివేయుట చేతను ఇవిపోవును. 2 తెల్లపురుగు. అది మర బియ్యమునకు పట్టును. గాలిలోనుండు తేమ చేతగాని, తడి తాకుటచేతగాని ఇదివచ్చును. అన్నమువండి పులుసుచారులతోను చల్లతోను కలిపి తినునప్పుడు బియ్యపుగింజలంత పొడుగున ఈ తెల్లపురుగు కనుపించును. రోతపుట్టి కక్కువచ్చును.

15 ట్రినిడాడ్‌లో భారతీయులుకలరు. వారు చౌకబియ్యమును ఇండియానుండి తెప్పించుకొని దానిని నిలవబెట్టితిందురు. వారిని పరీక్షచేయగా స్కర్వీయను జాడ్యము వారి ఒంటిమీద ఉన్నట్టును దానికి బియ్యమే కారణమనియు తేలెను. ఈ సంగతిని ఆండ్రూసుగారు హరిజన పత్రికలో వ్రాసిరి.

16 బియ్యములో గండ్రనూక, సన్ననూక, రెండుకలవు. గండ్రనూక కూలీలకును, సన్న నూకను ముగ్గుక్రిందను వాడుచున్నారు. ఈ రెండు తప్పులే. ఈనూకలో బియ్యములోని మొలక గలదు. గండ్రనూకను వండించుకొని తిన్నఎడల తియ్యగానుండును. వినయాశ్రమవాసులు రుచిచూచిరి. సన్ననూకలో కొంచెము మట్టియుండును కొంచము సేపు నీళ్ళలో నానపోసి మట్టి అడుగుకు దిగగానే నూకనుతీసి ఎండపోయవలెను దానిని ఉప్మాగా తినవచ్చును. లేదా పిండిచేసి గంజిలోను, పులుసు, కూరలలోను వాడుకొనవచ్చును. వడ్లగింజలో వదలివేయవలసినది ఊక ఒక్కటియే. సంజువచ్చినవారికి తవుడురొట్టె పెట్టించి డాక్టరు వెంకటరావుగారు సంజుకుదిర్చిరి

17 ఊకయు వృథాపోదు. దానిని పొయ్యిలోనికిని, మరలలోనికిని పెంకు (ఇటికలలోనికిని, పిడుకలలోనికిని, విభూతిపండులోనికిని వాడవచ్చును. కాల్చినఊక మంచిపండ్లపొడి. ఊకను Activated Carbon (ఆక్టివేటెడ్ కార్బన్) గా మార్చి బెల్లపుపానకము, చెరుకు పానకములో నుండు మాలిన్యమును పోగొట్టవచ్చును.

18 దంపుడు బియ్యము బీదలకే ముఖ్యము. కూరలుగాని నెయ్యి పెరుగుగాని వారికి సుళువుగా దొరకవు. మరబియ్యములోని లోపమును పాలు పెరుగు నెయ్యి వాడు భాగ్యవంతులు సర్దుకొనగలరు. బీదలు వీర్యములేని బియ్యమును తిన్నచో వారుమరింత దుర్బలులగుదురు.

19 మరచిట్టును తౌడును పశువులుబాగుగా తినును. మరబియ్యము నివి ముట్టవు. ఎందువల్ల? మరబియ్యముపిప్పి, బియ్యములోనుండు సారమంతయు చిట్టు తౌడులలోనికి దిగును. గొడ్లు పెరుగును. మనుష్యుడు సన్నగిల్లును. చౌకయని భ్రమపడకుము. తెలుపుచూచి మోసపోకుము. ఆయుర్వేద యునానివైద్యులఅనుభవము వల్లను పాశ్చాత్యశాస్త్రజ్ఞుల పరిశోధనవల్లను, భారత జాతి క్షేమాభిలాషియగు మహాత్మాజి చేతను ధృవపరచబడిన రోకటిపోటు దగిలి ఊకవదలించబడి జీవకళతో వెలుగుచు, ఆరోగ్యమునకు కుదురై, బలిష్ఠమగు ఆహారమైన ముడిబియ్యమునే తినుము. మరలనుండి మరులుము. బీదలకు పనిచూపుము. రోగమునకు దూరమగును. గ్రామ సౌభాగ్యమును కాపాడుము. నిజముగా దంపుడుబియ్యమే చౌక.

20 లోటుపాటులేని నమ్మకమైన దంపుడు బియ్యము గుంటూరుజిల్లా దంపుడు బియ్యము సంఘమువారివద్దను, బెజవాడలో హనుమంతరాయ స్వదేశీ స్టోర్సువారి వద్దను దొరకును. ఈ సంఘములు లాభమునకు పెట్టలేదు. బీదసాదలు బాగు బడుటకే, నిష్కామమైన సేవకే పెట్టిరి.

## తిల్లిక = దీపము

'తిల్లిక = దీపము' అని తెలిసిన తెనుఁగువారిని అందఱను, అది ఎక్కడ వాడుకలో ఉన్నదియు- ఏ పాత్త్రములో వాడినదియు తెలుప వలయునని ఆంధ్రపత్రికలో కోరినపుడు ముఖ్యముగా గ్రంథాలయాభిమానులను కూడ పేర్కొంటిని. కాని వా రెవరును తిల్లిక వాడుకను గూర్చి ఇప్పటికి తెలుపమికి మిక్కిలి వగచుచున్నాను. తెనుఁగునాటను సుమారు ౫, ౬ వందలగ్రంథాలయములు లెక్కకు వచ్చుచున్నవి. అందు సగమైనను పనిచేయుచున్నవనుకొనుచున్నాము. వానికొఱకు పాటుపడువారు పెక్కురు కలరు. తెనుఁగును గూర్చిన గుట్టుమట్టులరయుట గ్రంథాలయాభిమానులకు ముఖ్యమగు పనులలో ఒకటి.

కావున, దయచేసి, మేము బాగుగాపనిచేయుచున్నామని తలంచు గ్రంథాలయ నిర్వాహకులైనను తిల్లిక వాడుకనుగూర్చి అరసి, తెలిపెదరుగాక! అని మరల వారిని వేడుచు హెచ్చరించుచున్నాను.

ది ౨౪-౮-౧౯౩౬,
తెనుఁగుగుడి, బెజవాడ.

మారేపల్లి రామచంద్రశాస్త్రి,
గ్రంథాలయ సేవకుఁడు.

"జ్ఞానదానముకంటెను జన్న మున్నె"

# ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము

## కేంద్రగ్రంథాలయ ప్రయత్నము

1914 వ సంవత్సరమాదిగా ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము తెలుగు దేశములోని గ్రామసీమలయందు గ్రంథాలయ నిర్మాణములను ప్రోత్సహించి కల్పించుచు గ్రంథాలయోద్యమాభిమానమును పురిగొల్పుచు పని చేయుచు వచ్చినది. ఈ ప్రయత్నము చక్కగా ఫలవంతమైన దనుటకు సందేహము లేదు. నూర్లకొలంది గ్రంథాలయములు నెలకొని పనిచేయుటే గాక గ్రంథాలయమునకు స్థానికసంస్థలు విరాళములిచ్చుటకు వీలులేదని పోరాడుచుండిన మదాసు ప్రభుత్వమువారు తామే సంవత్సరమునకు కొంత మొత్తము - చాలతక్కువేయైనను గ్రంథాలయముల కని విడదీసి స్థానికసంస్థల మూలకముగానే పంచిపెట్టించుచున్నారు. నేటిదినము దేశములో గ్రంథాలయోద్యమతత్త్వము బాగుగా వ్యాప్తినొంది పని చాలినంత జరుగుటలేదే కేంద్రగ్రంథాలయములేదే మండల గ్రంథాలయములు లేవే సంచార గ్రంథాలయములు చాలవే యని హృదయావేదన నందు జనసమూహ మేర్పడినది. ఇదివరకేర్పడిన పునాదులపై మంచి నిర్మాణకార్యము పూనవలసిన ముహూర్తము సంప్రాప్తమైనది.

అందుచేత ఆంధ్రగ్రంథాలయసంఘమువారు కేంద్రగ్రంథాలయమును స్థాపింప నిశ్చయించినారు. ఇదివఱలో నీవిషయమున నాలోచనలు జరుగలేదని కాదు. 1916 లో నే బెజవాడలోని శ్రీ రామమోహనగ్రంథాలయమును కేంద్రగ్రంథాలయము కావింపవలెనని ఆగ్రంథాలయసంఘ సంకల్పము తీర్మానపురూపమును దాల్చినది. కాని కారణాంతరములచేత ఆపని సాగలేదు ఆగ్రంథాలయము నగరగ్రంథాలయముగా నభివృద్ధియైనది. చక్కని సేవ చేయుచున్నది. కాబట్టి నేడు ప్రత్యేకముగానే కేంద్రగ్రంథాలయోద్యమము నడచుట సర్వవిధములను ప్రయోజనకరము.

దీనికి కార్యస్థానము బెజవాడ. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘకార్యస్థాన మిచ్చటనే కలదు. కేంద్ర గ్రంథాలయమునకు శాఖా సంస్థలుగా ప్రతిమండలము నందును నొక్కొక్కటిగా ఈరాజధానిలోని మండలములలోను, మైసూరు నైజాము మధ్యపరగణాలలోని తెలుగు ప్రాంతములలోను ఏర్పడి తీరవలసి యున్నది.

ఈ సంస్థయందనేక డిపార్టుమెంటు లుండగలవు.

1. గ్రంథము లెరవిచ్చు శాఖ: మండల శాఖల మూలకముగా చదువరులకు గ్రంథములు చదువుకొనుటకు ఇచ్చుసట్టికార్యక్రమమును ఈడిపార్టుమెంటంతటనునిర్వహింపగలదు.

2. రెఫరెన్సు డిపార్టుమెంటు : విజ్ఞానశాఖలయందు పరిశోధనలు కావించు పండిత విద్యార్థులకొఱకే ప్రత్యేక గ్రంథసముదాయము నిర్మితమయి గ్రంథాలయమున స్థాయిగా నుండగలదు.

3. సంచారగ్రంథోద్యమము డిపార్టుమెంటు: దీనికి ఉద్దేశములు రెండు: గ్రంథాలయములు లేనిప్రాంతములలోని ప్రజలకు గ్రంథములు ఎరువిచ్చుచుండుట; తన్మూలముగా కలుగు విద్యావ్యాసంగపు అభిరుచిని పురస్కరించుకొని

27



గ్రంథాలయ స్థాపనమును ప్రోత్సహించుట, ఈడిపార్టుమెంటు గ్రంథాలయ పేటికలు, బండ్లు, పడవలు ఇత్యాదిసాధనములను సేకరించుకొనవలెను. ప్రభుత్వమే ఈ కార్యదక్షత వహించునఱకు మోటారులు, రైళ్లు, విమానములు ఈపనికి వినియోగపడునని వ్రాయుట వలన ఫల ముండదు.

5. వ్రాతప్రతుల (కవిలెకట్టల) డిపార్టుమెంటు: అచ్చుగ్రంథముల పోషణ కొక మార్గము; వ్రాతప్రతుల తాటాకు గ్రంథములిందెక్కువ యుండును. పోషణ మఱియొక మార్గము. వ్రాతప్రతులు చేర్పనిది పరిశోధకులకు జీవకళయే యుండదు. కాఁబట్టి ఈడిపార్టుమెంటు తప్పక యారంభింపఁదగినది.

6. పత్రికల డిపార్టుమెంటు : ప్రపంచమునందనుదినము ప్రచారమగునట్టి నవనవ వైజ్ఞానిక విశేషములు నాఁడే గ్రంథరూపము దాల్చుట లేదు. సజీవసంఘమునకు ఈవిజ్ఞానమే మొదట నెఱుంగతగినది. కావున గ్రంథాలయములో పత్రికలడిపార్టుమెంటు ప్రథమావసరము. ఇందు మూఁడుపనులు జరుగుచుండును. ౧. గ్రంథాలయమునందు అప్పటిపత్రికలు చదువరులు చదువుకొనుట కేర్పఱచుట ౨. ప్రాఁతపత్రికలు చదువుకొనిచూచుకొన నెంచినవారికి వానినిసంపుటీకరించి భద్రపఱచియొదవించుట; ౩.వర్తమానవిజ్ఞానము ఏప్రత్యేకవిషయమందైనను తెలిసికొనఁగోరు పాఠకునకు అట్టి ప్రత్యేక విషయిక సామగ్రిని సమకూర్చి యిచ్చుట. ఉదాహరణము : ఒక వ్యవసాయదారుఁడు వర్తమానసంవత్సరమున వ్యవసాయశాస్త్రవేత్తలు వ్రాసినవిషయవివరణం కావలయునని కోరు ననుకొందము. దాని నతనికి అమర్చిపెట్టుట కేంద్రగ్రంథాలయముపని. ఏతదర్థము పత్రికలలో ఆయా విజ్ఞానవిభాగమునకు చెందిన సామగ్రిని వేఱువేఱుగా కత్తిరించి ఒక్కచోట చేర్చి అతికించి సంపుటీకరించి అట్టలు కట్టి భద్రపఱచవలెను. వానికి సూచీకరణము కూడ (ఇండెక్సింగు) జరుగును.



7. ఆంధ్ర కళోపాసకుల డిపార్టుమెంటు : ఆంధ్రప్రతిభ ఆంధ్రతేజస్సు ప్రాచీనము అర్వాచీనము రెండును వట్టి వ్రాఁతలలోనే వెలువడలేదు. చిత్రలేఖనము, చిత్రలేపనము, శిల్పము, చెక్కడము ఇత్యాది సర్వమార్గములను వెలువడినది. దొరకినంతవఱకు చిత్రవస్తువుల సేకరించి కేంద్రమున చేర్పనిచో ఆంధ్రాభ్యుదయమున కవసరమగు మహత్తమ వికాసభాగ్యము మనకు దూరమై పోవును కాఁబట్టి యీ డిపార్టుమెంటునుకూడ నెలకొల్పవలసియున్నది.

ఈ అన్నిడిపార్టుమెంటులుగాక కేంద్రగ్రంథాలయమున శిశుశాఖయొకటి ప్రత్యేకముగా నుండ తగియున్నది. నిజముగా నేఁటి శిశువే రేపటిప్రజ. పెద్దవారికంటె నెక్కువయగు సహకారము శిశువులతో జరుపుట విజ్ఞానవ్యాపకులవిధి.

ఇంతటిపని సులభసాధ్యము కాదు. కాని ఎంతటి ఘనకార్యమైనను స్వల్పముగా నేని ఆరంభింపనిది రూపము దాల్పదు. కావున కొందఱు మిత్రుల తోడ్పాటుతో ఉత్సాహయుత గౌరవోద్యోగులతో ఈ ప్రయత్నము వెంటనే ఉపక్రమించుచున్నాము.

ఇందుకు కావలసిన సదుపాయములలో

మొదటిది

గ్రంథకర్తల, ప్రచారణకర్తల స్వాధీనము.

కేంద్రగ్రంథాలయమునం దుంచుటకు రెండు ప్రతులును, తెలుఁగుదేశములోని వివిధభాగము

లలో ప్రచారము చేయుటకు మూఁడు ప్రతులును మొత్తము ఐదేసి ప్రతులు తప్పకవారలీ కేంద్ర గ్రంథాలయమునకు ఇచ్చుట తమ కనీసధర్మముగా నెంచి ప్రసాదించవలెను.

పత్రికాప్రచురణకర్తలు.

తమ పత్రికలను మాకొఱకు ప్రత్యేకమైదు ప్రతులు మన్నునట్టి చక్కనికాగితముపై అచ్చువేసి దయతో మా కందఁజేయవలెను. కారణము స్పష్టము. సంపుటములుగాను కత్తిరింపులుగాను దీనిని మేము చిరకాలము వేలలక్షలు చదువరులకొఱకు భద్రపఱచి ఆపత్రికలకు స్థిరత్వము చేకూర్చెదము.

ఇఁకపైని సర్వప్రయత్నములకొఱకును కావలసిన ద్రవ్యమునంచెనా స్థూలదృష్టితో వేసితిమి. ఈక్రింద దానిని కననగును.

భవనములు.

| | | |
|---|---|---|
| అసలు భవనము | ... | రు 20,000 |
| శిశుశాఖ | ... | 5,000 |
| కార్యనిర్వహణనిధి | ... | 25,000 |
| ఆయా జిల్లాలలోని కేంద్రగ్రంథాలయ మండలశాఖలు | ... | 30,000 |
| ఉచితముగా రాని, గ్రంథముల కొనుగోలు | ... | 10,000 |
| ఇతరబాపతులు (ముఖ్యముగా బీరువాలు వగైరా) | .... | 10,000 |
| | | రు 1,00,000 |

గ్రంథకర్తలు, ప్రచురణకర్తలు, మునిసిపాలిటీలు, లోకలుబోర్డులు, ఉదారాశయులగు జమీందారులు, శ్రీమంతులు, ప్రజాసామాన్యము అందఱును తమశక్తి వంచనలేక సహాయపడిననే యీపని గట్టెక్కఁగలదని మేము చెప్పకయే స్పష్టపడఁగలదు సర్వాభివృద్ధికిని ప్రధానాధారము కాఁదగి అభిప్రాయభేదమునకు ఏఅవకాశములేని ఈయజ్ఞమునందెల్లరును పాల్గొని దేశక్షేమము, ప్రజాసేవ, ఈశ్వర ప్రసాదము మూఁటిని సాధించి తెలుఁగునాటికి వన్నె దెత్తురుగాక యని ప్రార్థించు చున్నాము.

కార్యస్థానము
గాంధివిలాస్, బెజవాడ.

గాడిచెర్ల హరిసర్వోత్తమరావు,
అధ్యక్షుడు.

## ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘసామాన్య సంఘసమావేశము.

పై సమావేశము బెజవాడ ఖద్దరు సంస్థానపు 'గాంధివిలాసము'లో దిః8—8—1936 తేది సగలు 3 గం॥కు జరిగెను. శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారిని కార్యనిర్వాహక సంఘుఅధ్యక్షులుగాను, ఆంధ్రప్రముఖులను పలువురను ఉపాధ్యక్షులుగాను, శ్రీ ఉప్పలూరి రామశాస్త్రిగారిని సహాయ కార్యదర్శిగాను ఎన్నుకొనిరి. కేంద్రగ్రంథాలయ ప్రచారమునకును, ఆంధ్రగ్రంథాలయ ప్రచారమునకును వ్రాసిన విజ్ఞప్తులను విని అంగీకరించిరి. ఉపసంఘ నివేదికలు పంపనివారికి హెచ్చరికలు వ్రాయతీర్మానించిరి. ఆంధ్రదేశ కేంద్రగ్రంథాలయ స్థాపనమునకు తగిన కృషి చేయుటకు ఉపసంఘము నేర్పఱిచిరి. నరసారావుపేట తాలూకాలో గ్రంథాలయోద్యమవ్యాప్తి కావించుటకు శ్రీరాజా మానూరి వేంకట జానకిరావుగారిని కోరిరి. ఆంధ్రదేశగ్రంథాలయ సంఘ ప్రథమాధ్యక్షులగు శ్రీ మోచర్ల రామచంద్రరావుగారి మరణమునకు చింతిల్లుచూ వారి ఆత్మశాంతికి భగవంతుని ప్రార్థించిరి.

# * పలుకుమనుగడ - తెనుఁగు

(శ్రీమారేపల్లి రామచంద్రశాస్త్రిగారు)

"గ్రుడ్డిగా ఏవికాని కైకొనను; తప్ప
నిసరిగా వచ్చియున్నవి నిలుపువాఁడ;
క్రొత్తవియు కూర్తు; పెఱవి కైకొందు; ఇటుల
పరఁగు నుడులవాడుక నాదు వ్రాఁతలందు"

మనపలుకుతల్లి తెనుఁగు. కనుక, దాని పుట్టుపెంపులను గూర్చి తెలిసికొనుటకును– వీలగునంతవఱకు ఇంకను దానికి ఇంపుసొంపులు సమకూర్చుటకును – కావలసినవి చేర్చి మఱింత వాసి తెచ్చుటకును కడంగుట, తెనుఁగువారికి తప్పనిపాడి. కాని, ఈపని ఇంతకు ముందు సరిగా జరిగినదని కాని, ఇపుడు జరగుచున్నదనికాని - చెప్పుకొని, ఉప్పొంగుటకు మనము నోచుకొనలేదు. కాన, తెనుఁగుమీఁద మన్నన కలవారు తమపాడి గుర్తించి, అది సరిగా చేయుటకు కడంగవలె.

తెనుఁగు మనుగడనుగూర్చి తెలిసికొనుటకు ముందు, మొత్తముమీఁద పలుకుల మనుగడనుగూర్చి కొంత తెలిసికొనుట మంచిది.

## మనుగడలు

నాటి మనుగడలు వ్రాయుటలో దిట్టలమని విఱ్ఱవీఁగు తెల్లవారికే, మందిమనుగడనుగూర్చికాని - నేలమనుగడనుగూర్చికాని – పలుకుమనుగడనుగూర్చికాని, ఇప్పటికి సరిగా తెలిసినటుల కానరాదు. అట్టిచో, మనుగడ వ్రాయు నేర్పే లేనివారని వారు వెక్కిరించు - ఇండియావారికి పలుకుమనుగడ తెలియుట ఎట్లు? ఎల్లపలుకులకును తల్లి అని మనవారు కొందఱు తలంచు సంస్కృతమునకే నిండు మనుగడ లేకున్నయెడ, దానిపిల్లగా కొందఱు లెక్కించు తెనుఁగునకు మనుగడ లేకున్న వింత ఏమి? మనుగడలకు తక్కిన నాడులవారిచ్చిన పెద్దఱికము ఇండియావారియ లేదని ఒప్పుకొనక తప్పదు. అవి వ్రాయుటలో తెల్లవారు మంచి నేర్పరులుగా ఉన్నారు. వారి వ్రాఁతలు చూచి, నేర్చుకొని, ఇండియనులలో కొందఱు మంచి మనుగడలు వ్రాయుచున్నారు. కాని, ఇంకను ఒక లోటు కాన వచ్చుచున్నది; ఎవరును ఉన్న పొత్తము లన్నియు అరసి, మనుగడలు వ్రాయుచున్నట్లు కనఁబడదు. కాన, ఇపుడైన మనుగడలు వ్రాయువారెల్లరును 'సెక్రిట్ డాక్ట్రిన్' మొదలగు 'దివ్యజ్ఞాన సమాజము' వారి పొత్తములు సైతము చదివి, వానితోడ్పాటుతో మనుగడలు వ్రాయుట మంచిదని తలంచెద.

## మందిమనుగడ

పలుకులు మందితోడివి. కావున, పలుకుమనుగడ తెలిసికొనవలయుననిన, ముందు మందిమనుగడ తెలిసికొనవలె. కాని, ప్రకృతి శాస్త్రములనే నమ్ముకొన్న తెల్లవారిలోని నెఱవాదులుకూడ, మంది ఎట్లు పుట్టిరో, ఎప్పుడు ఎక్కడ ఆపుట్టుక మొదలయ్యెనో, సరిగా తెలుపఁజాలకున్నారు. సంస్కృతపు వ్రాఁతలలో మంది మనుగడనుగూర్చి లేక పోలేదు. కాని, అది పలుచోట్ల- పలుతెఱంగులుగా కానవచ్చును. అంతయు అరసి, నిజము తేల్చి, తెలుపఁగలవారు కానరాకున్నారు. దివ్యజ్ఞానసమాజమువారు సంస్కృతపు పొత్తములను - తెల్లవారి పొత్తములను పరికించి మందిమనుగడను గూర్చియు - పలుకుమనుగడనుగూర్చియు తేట తెల్లముగా వ్రాసి యున్నారు. కాఁబట్టి, వారు వ్రాసినది ప్రాపుగా చేకొని,

## పలుకుమనుగడ

టూకీగా తెలుపనగును. మంది 7 తల్లితెగలుగా ఉందురు. ఒక్కొక తల్లితెగలో 7 పిల్లతెగలుండును. పిల్లతెగలనుండి కోవలును, వానినుండి కుదుళ్ళును, వానినుండి వంగడములును చీలును.

మొదటి తల్లి తెగవారు వేల్పులు. వారికి మనపట్టున డెందమే లేదయ్యె. డెందములేనియెడ తలంపులే పుట్టవు; అవి పుట్టనిచో పలుకు పుట్టనేరదు. కాన, మన లెక్కను బట్టి చూచునపుడు, వారికి పలుకే లేదనవలె.

రెండవతల్లితెగవారితో సడి పలుకు (ధ్వనిభాష) మొదలయ్యె. ఏపలుకులో కాని అ-ఇ మొదలగు నిండులును, క్-గ్ మొదలగు అరలును ఉండును. తమంతతామే నిండుగా పలుక వీలగునవి నిండులు. సగమే పలుక వీలగునవి అరలు. నిండులనే అచ్చులు?, ప్రాణములు, స్వరములు- అందురు. అరలను హల్లులు?, ప్రాణులు, వ్యంజనములు- అందురు. ఈతెగవారు అ-ఆ మొదలగు నిండులే పాట పాడినట్లు పలుకుచుండెడివారు. అయినను, అవితలఁపులను సరిగా తెలుపక పోవుట చేతను, అరలువారు వాడక పోవుట చేతను, వారిపలుకుతో మనపలుకునకు పోలిక లేదు; అందుచే దానితో పొత్తును లేదు.

మూఁడవతల్లితెగవారికి-వినికిసోఁకుపసలకుతోడు చూపుపసయును చేరి, పెరుఁగతొడంగె. కాన వారు వెలిజగమును వెనుకటికంటె బాగుగా కనుఁగొనఁగలిగిరి. వా

8

* పలుకు = భాష; మనుగడ = చరిత్ర.

పెంపువడియును హెచ్చె. కాని, క్రొత్తగా ఏర్పడినవారిమంటి మేనిలో తలంపు మిక్కిలి తక్కువగా పెరిగె. అందుచే ఈ తెగలోని మొదటి రెండుపిల్ల తెగలలోను పలుకు మెల్ల మెల్లగానే ఏర్పడ మొదలిడె. కాన, అది అప్పటి పెద్దపెద్ద పురుగుల రొదకంటెను, మొదటి మెకముల అఱుపులకంటెను ఏదో కొంత మెఱుగని చెప్పతగినదే కాని, సరి అయినది కాదు. అప్పటికి పేడులుగా ఉండిన ఈ తెగవారు, మగవారుగాను - ఆడువారుగాను మారి, బిడ్డలను కన సాగిరి. కాని, వారికి మదిలేదయ్యెను. అందువలన, వేల్పులు కొందఱు మందితెగకు వన్నెతెచ్చుటకు, వారిలో పుట్టవలసివచ్చె. అప్పుడే పలుకు రూపుతాల్చె. అదే పలుకుతల్లికి పసితనము. నాటిపలుకే, నిజమునకు, పలుకువెలదికి పసితనపుపలుకని చెప్ప 'ప్రాకృతము' కానగు. 'భారత్యాబాలభాషితం ప్రాకృతీఖ్యాయతేభాషా' అని వక్కాణించినది శంభురహస్యము. అపుడు మంది అందఱును ఒకేపలుకు మాటలాడెడివారు. అప్పటినుండి ఆపలుకు నానాటికి పెంపొందినట్లు తెలియవచ్చును. (తెనుగు-తోబుట్టువులు, ౧౩-౧౬ పొరటలు చూడుఁడు.)

## ౧ ఒంటి *ఉలివు నుడిపలుకు (ఏకాక్షరపదభాష)

మంచిచెడ్డలు తరచి - నిగ్గు తేల్చుపస బాగుగా కలిగినపుడే, పలుకు బాగుగా పెరుఁగును. కాఁబట్టి, 3 వ తల్లి తెగలోని ౬,౭ పిల్లతెగలలో మందిడెందమునకు బలిమి చేకూరినకొలఁదిని, పలుకుకూడ పెరుఁగ మొదలిడి, హెచ్చుగా వాడుకలోనికివచ్చె. అపుడు దానిలో ఒంటిఉలివు నుడులే ఉండెడివి. అదే ౪ వ తల్లి తెగలోని మొదటి రెండుపిల్లతెగలవారును వాడుచుండిరి. ఇపుడు వారితెగలకు చెందిన పసుపుపచ్చవారి పలుకులుసైతము ఒంటిఉలివు నుడి పలుకులే. వానిలో చీనావారిపలుకు మేటి.

## ౨ జంటనుడిపలుకు (ద్విపదభాష)

౪ వ తల్లితెగలోని 3 వ పిల్లతెగనాఁటికి, ఒంటి ఉలివు నుడి పలుకులో రెండేసినుడులు కలిపి వాడుట మొదలిడిరి. ఆవాడుక ఆపిల్లతెగలోను, ౪ వ పిల్లతెగ వారగు తురేనియనులలోను, ౫ వ పిల్లతెగవారగు సెమిటిక్కులలోను, నానాఁటికి హెచ్చె. కావున, ఒంటిఉలివు నుడిపలుకు జంటనుడిపలుకుగా మారినది. తురేనియనులు ఒడ్డుపొడుగులు కలవారు. కాన, వారిని ౫ వ తల్లి తెగవారగు ఆర్యులు రాక్షసులని, వారి పలుకును 'రాక్షసి' అనిరి. తురేనియనుల పలుకే సరిఅయిన మొట్టమొదటి జంటనుడి పలుకు. మేక్సుముల్లర్ పండితుఁడు తెలిపినట్లు "తలఁపు పలుకులు ఒక్కటే" కాన, తురేనియనులు మొదలగువారిలో తలఁపుబలిమి తగ్గినకొలఁదిని - వారి జంటనుడి పలుకుకూడ తగ్గి, ఇంచుమించుగా పేరుమాసిపోయె. వాని చివురుటెంపముక్కలనఁదగు నుడులేవో కొన్నియే ఇప్పుడు అమెరికా తొలికాఁపుల పలుకులలో అందందు కానవచ్చును.

౪ వ తల్లితెగలోని ౨ వ పిల్లతెగవారు కొందఱు సుమారు ౨ లక్షల యేండ్లకిందట అట్లాంటిక్ ఖండము నుండి బయలుదేఱి-ఆఫ్రికాఖండమును చుట్టివచ్చి, ఇండియాకిందితట్టు చేరిరి. అచ్చట అప్పటికి 3 వ తల్లితెగలోని ౭ వ పిల్లతెగవారు నెలకొనియుండిరి. ఆ యిరుతెగలవారికిని పొత్తు కుదిరె. అందుచే, వారిలో ఒండొరులకు పెండ్లిండ్లు జరిగె. వారిబిడ్డలే ఇండియాలోని తెన్నాటివారు - ద్రావిడులు. వీరు మంచుకొండవఱకును నెఱసియుండిన ఇండియా అంతయును లోఁబఱచుకొని, ఊరూండ్లయి, ఏలుచుండిరి. "ఒకప్పుడు ద్రావిడభాషలు మాటలాడువారు, ఉత్తరహిందూస్థానమం దంతటనుకూడ, బెలూచిస్థానమునుండి బంగాళమువఱకును, వ్యాపించియుండుట నిక్కమని తలంపఁబడుచున్నది." అనియు, "ద్రావిడభాషలు మాటలాడువారు ఉత్తరహిందూస్థానములో, పంజాబును - ఎగువగంగలోయయు కలసినచోట, నడి - ఇండో - ఆర్యన్ కాలము తుదివఱకును ఉండుట వింతకాదు." అనియు, సునీతికుమారచట్టర్జీ పండితుఁడు తెలిపినాఁడు. హరెప్ప, మహంజోదారోలలో త్రవ్వఁగా బయలుపడిన నాగరకత ద్రావిడులదేకావచ్చునని సర్ జాన్ మార్షల్ పండితుఁడు మొదలగువారు తలంచుచున్నారు. దివ్యజ్ఞానసమాజమువారి వ్రాఁతలనుబట్టి పరికించునెడల, ద్రావిడుల నాగరకత ౫, ౬ వేల యేండ్లకిందటికేకాక, అంతకంటె ఎంతో వెనుకకు పోవును. ఈ పట్టున భూతత్త్వశాస్త్రమునుబట్టికూడ అరయవలయు. ద్రావిడులు తెన్నాటివారు కాన వీరి పలుకుల వంగడము తెన్వంగడము. దీని తల్లిపలుకు తొలితెన్పలుకు - తొంటిద్రావిడభాష. దీనినుండి పుట్టిన తెనుఁగు, తమిళము మొదలగు పలుకులుకూడ మొత్తముమీఁద జంటనుడిపలుకులే.

## 3 చేర్పుల పలుకు (ప్రత్యయభాష)

౪ వ తల్లి తెగలో మిక్కిలి పెంపొందిన 3 వ పిల్ల

*ఉలివు (సిలబిల్) = ౧ తనంతతాను పలుకుఅ-ఆ మొ. స్వరములలో ఒకటి ౨. అ-ఆ మొ. స్వరములలో ఒకదానితోకలసి పలుకు క్-గ్ మొ. వ్యంజనములలో ఒకటి.

తెగవారిలో తలఁపు పెరిఁగినకొలఁదిని వారిపలుకును పెరిఁగి తుదకు చేర్పులపలుకుగా మాఱిపోయె. అదే ఆర్యులకు పలుకుతల్లి అయ్యె. వారువడి - ఆసియాలో అది వాడుచుండినపుడుదానికి 'సెంజార్' అని పేరఁట. క్రీ ము. ౨౦,౦౦౦ ఏండ్ల క్రిందట శ్వేతద్వీపములో ఒకరకపు సంస్కృతమని గుర్తింప వీలయిన పలుకు వాడెడువారని తొల్లిజరిగినది తెలిసికొనఁగలవారు తెలుపుచున్నారు. అదే శుక్రమండలమునుండి వచ్చిన వేల్పులపలుకు కానగునని వారికి తట్టెనఁట. అదే గీర్వాణముకానగు. గీర్వాణులు దేవతులుకావున, గీర్వాణము దేవభాష. అదే ఆయ్యవారల గుట్టుపలుకు-గురుదేవులగు ప్రభాష. అది ఆర్యులతో ఇండియాకు వచ్చినది. అప్పటికి ఇప్పటి పంజాబు పట్టున కోటలు కట్టుకొని, ద్రావిడులు రాచరికము చేయుచుండిరి. వారితో ఆర్యులు పోరిపోరి, తుదకు కొందఱితో చెలిమిచేసికొని, కొందఱను గెలిచి, తాము, అందు నెలకొనిరి. వారిపలుకు నానాఁటికి మాఱుచువచ్చె ఈమార్పు మంత్ర - బ్రాహ్మణ - సూత్రములలో కాన వచ్చును. ఆపిమ్మట మార్పుచెందిన గీర్వాణభాషను పాణిని మొదలగువారు రమారమి ౨౫౦౦ ఏండ్లక్రిందట సంస్కరించిరి. అట్లు సంస్కరింపఁబడిన భాషయే సంస్కృతమయ్యె. అదేగ్రాంధిక భాషగాను, పండిత భాషగాను అప్పటినుండి ఇప్పటివఱకును వాడుకగుచున్నది. ఇఁక, మందిమాటలాడుచుండిన పలుకు మాఱుచు వచ్చి, హెచ్చుమంది వాడుచుండిన తొలితెగ పలుకుతో చేరి, ఆయానాడులను బట్టి శౌరసేని, మాగధి, మహారాష్ట్రి మొదలగు ప్రాకృతము లేర్పడుటకు తోడ్పడినది. కావున, నిజమునకు, తొంటి ప్రాకృతములకు తల్లి తొలితెగ పలుకేకాని, ఆర్యభాషకాని, ఇరానియను భాషకాని, కాదు వాని పెద్దఱికమున కొన్ని ప్రాకృతములు తరువాత ఏర్పడిన ఏర్పడుఁగాక! ఆ తొంటి ప్రాకృతములుమాఱి మాఱి, తుట్టతుదకు ఇప్పటి నాటిపలుకులుగా వెలయుచున్నవి.

## ఇప్పటి పలుకులు

ఇపుడు నేల నాలుగువైపులను మాటలాడుచున్న సుమారు ౯౦౦ పలుకులును, పైని తెలిపిన ౩ తెఱంగులలో ఏదో ఒకదానిలో చేరును. దీనిని పరికించిన నేర్పరులు కొన్నికొన్నింటిని కొన్నివంగడములలో చేర్చినారు. అందు, ఇండియాలో మిన్నలుగా ఉన్నవి ౩: ౧ వడవంగడము-ఆర్యభాషా కుటుంబము; ౨ తెన్వంగడము-ద్రావిడ భాషాకుటుంబము; ౩ నడివంగడము-ముండాభాషాకుటుంబము. ౧౯౩౧సం॥పు లెక్కలనుబట్టి మొదటిదానిలో హిందీ మొదలగుపలుకులు మాటలాడువారు ౨౫,౭౪,౯౨,౮౦౫ గురు; రెండవదానిలో తెనుఁగు మొదలగు పలుకులు మాటలాడువారు ౭,౧౬,౪౪,౭౮౭ గురు; మూఁడవదానిలో సంతాలిమొదలగు పలుకులు మాటలాడువారు ౪౬,౦౯,౫౮౮ గురు; మాటలాడుమందిని బట్టి పలుకులలో పెద్దఱికమీ క్రింది తెఱఁగున ఉన్నది: ౧ చైనీసు; ౨ ఇంగ్లీషు; ౩ రష్యను; ౪ జర్మను; ౫ స్పేనిషు; ౬ జపానీసు; ౭ హిందీ; ౮ బంగాలి; మన తెనుఁగు ఇండియాలోని పలుకులలో మూఁడవది.

హెచ్చువాడుకనుబట్టి, ఈ క్రింది పలుకులు గొప్ప జగము పలుకులని పేరొందినవి; ౧ ఇంగ్లీషు - ఇది ౫౦ కోట్లమంది మీఁద పెద్దఱికము చేయుచున్నది; ౨ ఫ్రెంచి! ౩ స్పేనిషు; ౪ అరబ్బీ; ౫ హిందూస్థాని - అన్నియెడలను వాడునదికావున, నిజమునకు, ఇదే హిందీకంటె ఇండియాపలుకనుటకు తగినది. దీనిని రోమనువ్రాలలో పెంపొందింప కడంగుచో ఇంగ్లీషురానివారు ఇది అన్నియెడలను మాటలాడుటకేకాక బేహారము మొదలగు పనులకు కూడ వాడుకొన వీలుకలుగును.

## చేయవలసిన పని

ఇండియాలో ఏ పలుకు మాటలాడువారైనను తమ నాటిలో తాము పెంపొందుటకు మొదట తమ తల్లిపలుకే బాగుగా నేర్చుకొనవలె. పైనాడులవారితో పొత్తుకావలసినచో హిందూస్థానియు- ఇంగ్లీషును, మతగ్రంథములు చదువుకొనఁగలుగుటకు హిందువులు సంస్కృతమును, మహమ్మదీయులు అరబ్బీయును నేర్చుకొనవలె. నేర్పరులు కాఁదలఁచువారు తమతల్లిపలుకునకు తోడుగా సంస్కృతము, ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మను మొదలగు పలుకులును, పలుకులలో నెఱవాదులగుటకు పొత్తుగల పలుకులన్నియును నేర్చుకొనవలె. మేటిపలుకులలోని నిగ్గంతయు తమపలుకులోనికి తెచ్చుకొనవలె.

తెనుఁగున గట్టివారు కాఁదలఁచువారు తెనుఁగుతో పాటు దాని తోఁబుట్టువులగు తమిళము, కన్నడము, మలయాళము, తుళు, కోఁడు మొదలగు పలుకులును, దాని తోడులగు ప్రాకృతము, సంస్కృతము, మరాటి, ఒడియా మొదలగు పలుకులును చదువవలె. మేటిపలుకులలోని మేలుబంతిపొత్తములు పరికించి, తెనుఁగులో అట్టివి వ్రాసి, తమ పలుకుతల్లిని గద్దె ఎక్కింపవలె; తెనుఁగుతల్లికి తగిన బిడ్డలని మన్ననలంది, ఉప్పొంగఁగల ఉనికిలోనికి రావలె.

కాన, తెనుఁగువారు తమపలుకుతల్లిని బాగుగా కొలిచి, కైసేసి, మేలొందెదరుగాక!

# పాఠశాలలు - గ్రంథాలయములు

(శ్రీయార్లగడ్డ శ్రీకృష్ణచౌదరిగారు,
రేపల్లెతాలూకాగ్రంథాలయసంఘాధ్యక్షులు.)

ఒకనాఁడు సర్వప్రపంచమునకు జ్ఞానభిక్షఁ బెట్టిన భారత దేశము - పశ్చిమదేశము లన్నియు గాఢాంధకారములో మునిఁగియున్నపుడు జ్ఞానజ్యోతిని ప్రకాశింపజేసిన భారత దేశము అనాగరికులై గొడ్డుమాంసము దినుచున్న జాతికి సహితము జ్ఞానోదయము గలుగఁజేసిన భారత దేశము - ఋషీశ్వరులకును, త్యాగులకును, వీరులకును ఆవాసమైన భారత దేశము - పతివ్రతాతిలకములకును, వీరనారీమణులకును పుట్టినిల్లని కీర్తిగడించిన భారత దేశము - ఏమైనది? తారుమారైనది. తలక్రిందులైనది. దానిసత్వ మనుభవించుచున్నది. దీనికి విమోచన మెట్లు? మార్గ మెద్ది? గమ్యస్థాన మెక్కడ? అని విచారించుచో రెండేమార్గములు: పాఠశాలలు-గ్రంథాలయములు. జాతీయభావములును స్వదేశభక్తియుహృత్కమలమునజీర్ణించిపోయిన, ఉపాధ్యాయబృందము పాఠశాలలకు సంప్రాప్తము గావలెను. శాంతస్వభావము, వినయనమ్రతలు, విద్యాసంపన్నత, దాస్యవిమోచనమునకు మార్గాన్వేషులగు యువకరత్నములు, గ్రంథాలయములకు గావలెను. * * * *

"అండ్రూకార్నిజి" యను ధనికుఁ డెన్నియో గ్రంథాలయంబులు నిలిపి ప్రోత్సాహపఱచెను. అట్టిమహనీయు లీ దేశమున కొరతవడుట మన దురదృష్టమని తలఁచవలెను. గ్రంథాలయంబుల సంఖ్యగూడ మన దేశమున బహుస్వల్పముగ గోచరించుచున్నది. ఒక్కబరోడారాజ్యములో మాత్రము శారదాదేవి రాజుయొక్క యాదరణముబొందఁగల్గినది. ఆరాజ్యములో ప్రతియొక్క పాఠశాలలో గ్రంథాలయ మున్నట్లు తెలియుచున్నది. పాఠశాలకు సంబంధములేని యితర గ్రంథాలయముల నెన్నియో రాజాగారు పోషించుచున్నారు అటనున్న కేంద్ర గ్రంథాలయములనుండి జిల్లా, తాలూకా, గ్రామ గ్రంథాలయముల కెంతయు సహాయసంపత్తి గలదు. మ్యాజిక్ లాంతర్లవల్లనేమి, చిత్రలేఖనము వల్లనేమి, యా గ్రంథాలయములు ప్రజల నాకర్షించుచుండును. స్త్రీశాఖ, బాలశాఖయను విభజనలుగూడ ప్రతి గ్రంథాలయమందుఁ బొడగట్టుచుండును. ఇట్టిసత్సంకల్పముతో గ్రంథాలయోద్యమమునకు దోడ్పడుచున్న బరోడా మహారాజగు శ్రీశ్రీశ్రీ 'శాయాజీగయక్వార్' మహాశయులెంతయు ధన్యులు. మరపురాని సచ్చరిత్రలో శ్రీవారి నామము సువర్ణాక్షరములతో విలసిల్లుచుండును. బరోడారాజ్యమును తిలకించియె శ్రీ శ్రీ తిరువాన్కూరు మహారాజాగారు గూడ తమరాజ్యమందు గ్రంథాలయోద్యమము విస్తరింపఁజేయుటకు ప్రయత్నించుచున్నారు. ప్రతిరాష్ట్రమునందును గ్రంథాలయోద్యమమునకు తమజీవిత సర్వస్వమునుగూడ ధారవోసిన మహామహులు కొందరుండఁబట్టియె శారదాదేవి సజీవముతో నుండఁగలిగినది. 1910 - 11 సం॥లో మన యాంధ్రరాష్ట్రమున గ్రంథాలయోద్యమము ప్రారంభింపఁబడి దినదినాభివృద్ధి బొందిన

దంటే దాసికి చిరస్మరణీయులగు నిద్దరు వ్యక్తులు గలరు. ఒకరు కీర్తిశేషులైన సూరివేంకట నృసింహశాస్త్రి గారు; రెండవవారు నాటినుండి నేటివరకుగూడ యెడతెఱపిలేని గ్రంథాలయసేవ జేయుచున్న శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్య పంతులుగారు. ఆంధ్రరాష్ట్రమున గ్రంథాలయోద్యమము చిరస్మరణీయతఁ బొందవలెనంటే మనమెల్లర ముపేక్షాపరులమై యూరకొనక ప్రతిమానవుఁడు స్వకుటుంబాభివృద్ధి, స్వశరీరారోగ్యము నెట్లు గోరుచు బాటువడునో గ్రంథాలయోద్యమము నకుఁగూడ నట్లు పాటుబడుట తన పరమావధి యని తలఁచవలెను. దేశారాధనము ప్రతివ్యక్తికి నేకరింపదగు నమూల్యాభరణము. దేశోద్ధరణకు కృషి చేయవలెనన్న! దేశసేవచే జీవయాత్ర నడుపవలెనన్న! పాశ్చాత్యదేశములతో బాటు మనదేశము పోటీకి నిలువవలెనన్న! పురాతనమహోన్నత్యనిత్య సామ్రాజ్య సౌభాగ్యములు తిరిగి ప్రసాదించవలెనన్న! తద్దేశవాసుల యార్థికవృత్తులు సంపాదించవలెనన్న! వారి సౌభాగ్యములలో పాలుపంచుకొనవలెనన్న! మనదేశంబు తొల్లింటి యౌన్నత్యంబు, బొందవలెనన్న సిరిసంపదలు సత్కళాభివృద్ధి గాంచవలెనన్న! ఇహపరసౌఖ్య మందవలెనన్న! మన భావికాలాభివృద్ధికి మూలకారణము లగు విద్యార్థులగు యువకులకు నీతిమార్గంబులు ప్రసాదించవలెనన్న! మన బాలబాలికల విద్యావ్యాసంగములు పెంపొందించవలెనన్న! దేశబాంధవుల భావోదయములు ప్రకాశింపఁ జేయవలెనన్న! దేశముయొక్క ప్రాభవ ప్రతిష్ఠలను కీర్తిగౌరవములును గాపాడవలెనన్న! మానవహక్కులకును - స్వాతంత్ర్యములకును, శాశ్వతమైన పునాదులు వేయవలెనన్న! జ్ఞానులయు, త్యాగులయు, వీరులయు సచ్చరిత్రలు మఱపురానట్లు చేయవలెనన్న! గ్రంథాలయంబులె సాక్షీభూతములని తలంపవలెను. వేలకొలది గ్రంథాలయములు స్థాపింపజేసి యందున్న జ్ఞానామృతము ప్రజలు గ్రోలునట్లు చేయవలసిన బాధ్యత గ్రంథాలయసేవకులయం దున్నదనమాట మఱవగూడదు. భారతదేశీయ మహాజన నభాధ్యక్షులగు పండిత జవాహరిలాల్ నెహ్రూగారు అలహాబాదులో ఆనందభవనమం దొక పెద్ద గ్రంథాలయమును స్థాపింప సంకల్పించియుండుటలో గ్రంథాలయోద్యమమందు శ్రీవారి కెట్టి యాదరణాభిమానములు గలవో గ్రహింపుడు.

జర్మన్ విశ్వవిద్యాలయమునకై యాకర్షింపబడి
మదరాసు, మైసూరు, అన్నామలై యూనివర్సిటీలచే మెప్పొందిన

## గానకళాచంద్రిక

ఇయ్యది, టెక్నికల్ పరీక్షార్థుల కత్యంతోపయుక్తమగు సంగీతలక్ష్య, లక్షణములను వాగ్గేయకారకుల జీవితములను వ్రాయబడి ప్రభుత్వామోద మొందిన గొప్ప సంగీత లక్షణగ్రంథము.

400 పుటలు. నిండుక్యాలికో వెల రు 2—0—0.

గ్రంథకర్త: అరిపిరాల సత్యనారాయణమూర్తి,
గాంధీనగర్, బెజవాడ.

# ఐర్లండులో గ్రంథాలయోద్యమము

(శ్రీ గో. రాధాకృష్ణమూర్తిగారు బి. ఏ)

## I

### మొదటిమాటలు

ఐర్లండు ఒకద్వీపము. ఇది ఇంగ్లండుకు పడమట కొంచెము పైగా ఉత్తరాననున్నది.

దీన్ని ఇంగ్లండునుస్కాట్లండును కలిపి గ్రేట్ బ్రిటన్ అనిఅంటారు. ఇదంతా ఇదివఱకు ఇంగ్లీషువారి అధిపత్యములోనిదే. ఐర్లండు వైశాల్యం 23,582 చదరపు మైళ్లు. ఇందలి మొత్తము జనసంఖ్య 4,256,561.

* * * *

15 ఏండ్లక్రింద చెలరేగిన రాజకీయ విప్లవముల వలన ఈ ద్వీపము రెండు భాగాలైనది. అవి దక్షిణ ఐర్లండు,-దీనినే "ఐరిష్ ఫ్రీస్టేట్," అంటే ఐరిష్ ప్రజాస్వామికము, అని అంటారు. ఉత్తరఐర్లండు - దీన్ని అల్స్టర్ అని కూడ అంటారు.

* * * *

ఐరిష్ ప్రజాస్వామికము పుట్టి 12,13 ఏండ్లయినది. దీనికి ముఖ్యపట్టణము డబ్లిన్ నగరము. దక్షిణ ఐర్లండు వైశాల్యం 26,600-చ॥ మైళ్ళు. దీనిజనసంఖ్య 3,000,000. వీరిలో నూటికి 99 మంది రోమన్ కాథోలిక్కులు.అనగా క్రైస్తవ ప్రాచీన సాంప్రదాయకులు. డబ్లిన్ నగరములో 317,000 మంది ఉన్నారు.

ఉత్తర ఐర్లండు. ఇది ఇంకను బ్రిటిష్‌వారి యాజమాన్యంక్రిందనే ఉన్నది. దీనిని ఈ ఉత్తర ఐరిష్‌వారే కోరుకున్నారు. ఇందులో అందరూ ప్రొటెస్టెంట్లే. అంటే వీరు రోమన్ కాథోలిక్కులకు భిన్నులు. ఈభాగపువైశాల్యము 69,82.2 చ॥మైళ్లు.ఇందలిజనసంఖ్య 1,256,561. దీనికి ముఖ్యపట్టణము బెల్‌ఫాస్ట్ నగరము. దీనిలో 415,151 మంది ప్రజలున్నారు.

* * * *

ఈ క్రింది వ్యాసము రెండుభాగాలుగా చేయబడినది. మొదటిదానియందు ప్రజాస్వామిక ఐర్లాండులోని గ్రంథాలయోద్యమమునుగూర్చి వ్రాయబడియున్నది. రెండవదానిలో ఉత్తర ఐర్లాండులోని గ్రంథాలయచరిత్ర చేర్చబడినది.

దీనిని చదివినవారు, ప్రజాస్వామిక ఐర్లాండులో గ్రంథాలయముల స్థితి ఉత్తర ఐర్లాండు వానికన్న మిన్నగా ఉన్నదని గ్రహింపగలరు. దీనికి కారణముకూడా వారికి వెంటనే గోచరించును.

### ప్రాచీనదశ

ఐరిష్ ప్రజాస్వామ్యము పుట్టి 10,12 సంవత్సరముల కన్న మించదు. కాని ఆదేశపు గ్రంథాలయములు పుట్టి 1500 సంవత్సరములపైన ఐనది.

మొట్టమొదటిగ్రంథాలయము క్రీ॥ శ॥ 1020 నాటిదని కొన్ని నిదర్శనముల వలన తేలుచున్నది.

"మిడిల్ ఏజస్[1]" లో పశ్చిమ ఐరోపాఖండమంతటికిని ఐర్లండు విద్యకు ఉనికిపట్టు. అప్పట్లో డబ్లిన్ నగర మందలి భాండాగారములందు "గేలిక్" ఐర్లండుకు సంబంధించిన పుస్తక సముదాయ మంతా భద్రపరుపబడినది. అవే తరువాత వానికి బీజములైనవి. వీనియందు ప్రాచీనమైన వ్రాత ప్రతులు, చారిత్ర విషయక మైనట్టివి, సాధారణముగ దొరకనట్టి గ్రంథములు నిలువచేయబడినవి.

అప్పటి డబ్లిన్ నగరమందలి గ్రంథాలయములు చాల వఱకు పబ్లిక్ లైబ్రరీలు. అందటి అందు బాటులోనుండి, అందటి వినియోగార్థము ఏర్పడి నప్పటికిని ఆకాలములో వానికి ప్రాపకము చాల తక్కువ.

* * * *

### ఉద్బోధన బీజములు

ప్రజలలో గ్రంథాలయములయందు మంచి అభిప్రాయమును కలుగ చేయవలెను. వాని ఉపయోగమునువారు అవగాహనము చేసికొనవలెను.

ఇట్టిపని చేసినవారలలో ప్రథముడు, ముఖ్యుడు, థామస్ డేవీస్ అను నాతడు. దేశముల భాగ్యోదయమునకు మంచి పాఠశాలల స్థాపనము ముఖ్యము; వానికన్న ధర్మపుస్తక భాండాగారములు మరింత ముఖ్యములు అని డేవీస్, తదితరులు బాగుగ గ్రహించిరి.

మంచి గ్రంథాలయస్థాపనము నెదుటమానవునితదితరములైన ఘనకార్యములు దిగదుడుపుకైన పనికి రావని డేవీస్ ఒకానొకప్పుడు అనియున్నాడు. తాను "నేషన్" పత్రికయందు ప్రజలకు గ్రంథాలయోద్యమావసరముగూర్చి మిగుల ఉద్బోధన చేసినాడు. అప్పుడప్పుడే దక్షిణ ఐర్లం

---

1. క్రీ॥ శ॥ 1000-1400 మధ్యకాలమునకు ఐరోపా దేశచరిత్రలో "మిడిల్ ఏజస్" అని అందురు.

దులో తెగపుట్టుచున్న "రిపీల్ అసోసియేషన్2"లను గూడ సంబోధించి, ప్రతిచోటను గ్రంథాలయములను, పఠనమందిరములను నెలకొల్ప ప్రార్థించినాడు. ఇది మంచి సమయము. దీనిని అజాగ్రత్తవలనను, ఉత్సాహ శూన్యతచేతను మనము త్రోసిపుచ్చిన, చివరకు దానికై మిగుల వగవవలసివచ్చును అని ఆమహనీయుడు "నేషన్" పత్రికయందు వ్రాసినాడు.

దురదృష్టవశమున ఆతరుణము విడిచివేయబడెను. 1845లో డేవిస్‌మహాశయుడు మరణించినాడు. సంస్కరణోద్యమమునకు చెందిన అతని మిత్రులు దేశమునుండి తరుమబడినారు. మరల అమృతజీవుని ఆశయములు నిండుటకు అరువది సంవత్సరములు కాలగర్భాన కలియవలసివచ్చినది.

* * * *

## చట్టముల యుగము

ఇంతలోనే, ఇంగ్లండులో ప్రజలలో ఒక సంచలనము పుట్టినది. దానివలన 1850 లో "పబ్లిక్ లైబ్రరీస్ అక్టు" అనుచట్టము సృష్టింపబడినది.

దీని వెనుకనే 1855 లో ఐర్లండు అంతటికి చెందునట్లు మొదటిసారి ఒకచట్టము నిర్మింపబడినది. దాని పేరు "పబ్లిక్ లైబ్రరీస్ (ఐర్లండు) అక్టు"

ఈ చట్టమువలన కలిగినసదుపాయములు:—

ముఖ్యమైన పట్టణములలో గ్రంథాలయములు స్థాపించవలెను. 'గ్రంథాలయసుంకము' అను పేర ఒక పెన్నీ చొప్పున వసూలు చేయవలెను. గ్రంథాలయములకు సంబంధించిన జమాఖర్చు లెక్కల వ్రాయుచుండవలెను.

### తరువాతచట్టములు:—

1877 లో పైచట్టము కొంచెము మార్పు చెందినది. దీని మూలమున గ్రంథాలయాధికారులకు గ్రంథాలయములకు కావలసిన అప్పు చేయుటకు హక్కు పుట్టినది.

ఇదే 1894 లో "యంగ్ ఐర్లండు లీగ్" అను సంస్థవలన మరింత మార్పుచెందినది.

దీని తర్వాత, 1902 లో మరల మార్పు చెంది ఇదివరకే మేని సౌకర్యములు లేకపోయిన, వాని నన్నిటిని కల్గించినది. తరువాత 1920 లో ఇదివరకున్న ఒకపెన్నీ గ్రంథాలయ-సుంకము మూడు పెన్నీలవరకు హెచ్చుచేయబడినది. ఈ పైని వ్రాయబడిన చట్టములు ఐర్లండుదేశ మంతటికి చెందుచున్నవి,

దక్షిణఐర్లండులో ప్రజాస్వామికము ఏర్పడినప్పటినుండి గ్రంథాలయ చట్టములు మరి పుట్టలేదు. కాని 1925 నకు చెందిన "ఐరిష్ ఫ్రీస్టేట్ లోకల్ గవర్నమెంటుఅక్టు ఆఫ్1925" అనుదానియందు మిగులముఖ్యమగు కొన్ని వాక్యములు చేర్పబడినవి.

### దీనివలన కాబడిన మార్పులు:—

గ్రంథాలయ నిర్వాహకులు వస్తు ప్రదర్శనములను, ఉపన్యాసములను ఏర్పరుపవచ్చును. వానికి అగు వ్యయము గ్రంథాలయములసుంకపు నిధినుండి చేయవచ్చును.

ఈ హంశములో ప్రజాస్వామికఐర్లండు గ్రేటుబ్రిటనును గూడ మించిపోయినదట.

* * * *

## డబ్లిన్ గ్రంథాలయాలు

1877 లో డబ్లిన్ నగరమందు "జాతీయ గ్రంథాలయము (నేషనల్ లైబ్రరీ)" అను పేరిట ఒక గ్రంథాలయము స్థాపింపబడినది. అపిమ్మట 1884 లో రెండు పబ్లిక్ లైబ్రరీలు వెలసినవి.

1903 లో డబ్లిన్ నగరమందు సెంట్రల్ లైబ్రరీ (కేంద్ర గ్రంథాలయము) అను దానిని స్థాపించుటకు ప్రయత్నము జరిగినది. దానికై ఆండ్రూ కార్నెజీ మహాశయుడు 28,000 పౌనుల విరాళమునొసగెను. కాని అది ఆయన అనుమతిమీదనే జిల్లా గ్రంథాలయములకు వెచ్చింపబడినది. నాటినుండి నేటివఱకు ఉద్దేశము నెరవేరలేదు.

1925 లో కార్నెజీ ట్రస్టువారు నగర గ్రంథాలయములకు పుస్తకములకై 7,500 పౌనులు దానము చేసిరి, వీరును గ్రంథాలయ కేంద్రీకరణమునకు పాటుపడిరి.

1930 లో తేబడినచట్టము ననుసరించి నగరమందలి స్వతంత్ర గ్రంథాలయములను ఐక్యము చేయుటకు ప్రయత్నములు జరుపబడినవి. నగరమునకు చుట్టుపట్ల చిన్నచిన్న భాండాగారములు స్థాపించుటకుగూడ ప్రయత్నములు చేయబడుచున్నవి. 1937 లోగా అట్టి ఆశయము కొనసాగవచ్చునని తలపవచ్చును.

డబ్లిను లోని గ్రంథాలయములు మంచి నవీనపద్ధతులతో నిర్వహింపబడుచున్నవట. వానివలన కలుగు లాభములు ఇంతింతగావట. వానిలో మొత్తము 150,000 గ్రంథములున్నవి. ప్రతి సం॥రము 1,000,000 కన్న ఎక్కువ గ్రంథములు చదువబడుచున్నవట. ఇదంతయు ఒక్క డబ్లిన్ నగరమందే అను మాట మరవకూడదు.

ఇందు ప్రతి గ్రంథాలయమందు పిల్లల శాఖలున్నవి. వీని యాజమాన్యమున 1932-'33-ఒక్క ఏడాదిలో పిల్లలకు ఆంగ్లమున, ఐరిష్‌భాషలోను నూరు ఉపన్యాసములు ఇవ్వబడినవట!

* * * (సశేషము)

2. దక్షిణ ఐర్లాండు స్వాతంత్ర్య సమరంలో పుట్టిన కొన్ని సంఘాలు.

# భ్రమరాంబా మల్లేశ్వర గ్రంథాలయము

## బెజవాడ

### 24–12–27 నుండి 30–4–35 వరకు

### చరిత్రలోని కొన్ని విషయములు

ఈ గ్రంథాలయము శ్రీ రౌద్రినామ సంవత్సర ఆశ్వయుజ శు ౧౦ లు శుక్రవారము సరియగు 1920 సం అక్టోబరు 22 తేదీన ప్రప్రథమమున శ్రీ భ్రమరాంబా మల్లేశ్వరస్వామివారి సన్నిధిన ఒక చిన్నగదియందు, తత్త్వ వాసమాజము తరఫున పొట్టి వెంకట సుబ్బయ్యగారిచే నెలకొల్పబడి నానాటికి శుక్లపక్షశీతభానునిపగిది కళలను సేకరించుకొని బాలారిష్టములను గడచి, నూతన వికాసమున నుప్పొంగుచు సహజకాంతులచే ప్రజల హృదయముల నాకర్షించి ముద్దుబిడ్డయై ప్రవర్తించుచున్న కాలమున దీని భావివృద్ధిని కోరిన పెద్దలు కొందరు ఉపలాలనము చేయ నంతకంతకు శోభితమై పొడగట్టుచు ది 31-7-1924 తేదీకి సరిఅయిన రక్తాక్షినామ సంవత్సర ఆషాఢ బ 30 లు గురువారము రోజున పౌగండోత్సవమున అత్యుత్సాహముతో విరాజిల్లెను. అప్పటినుండియు నీ సంఘమునకు స్థాయి చిక్కినది. శ్రీ కన్యకాపరమేశ్వరీ అన్నసత్రము కమిటీవారి ఆదరణచే విశాలమైన భవనము సంపాదించి పఠనాలయమున కనువగురీతిని పరికరములను సేకరించినది.

ఈ సంస్థ పలువుర ఉద్దేశముల కనుగుణముగ 1890 సం॥ 21 అక్టు ననుసరించి 1933 సంవత్సరములో రిజష్టరు చేయబడినది.

### గ్రంథములు.

ఈ గ్రంథాలయమునందు పలువిధములైన ఆర్థిక, రాజకీయ, పారిశ్రామిక, నైతిక, మత గ్రంథములు పెక్కులు గలవు. లోగా 1927 డిసెంబరు 23 తేదీవరకు నున్న రు 1826-0 0 లు విలువగల 1389 గ్రంథములుగాక నూతనముగా రు 2250-0-0 లు విలువగల 2470 గ్రంథములు, రు 380 లు విలువగల 197 పత్రికా సంపుటములు చేకూర్చబడినవి. ఇందులో పలువురు దాతలు ఉచితముగా సంఖాభివృద్ధి ననుసరించి సమర్పించిన గ్రంథములను కొన్నిగలవు. ఇందులకు వారెంతయు మాకు ప్రశంసార్హులు.

### బాలశాఖ

పిల్లలయొక్క ఉపయోగము ననుసరించి, ప్రత్యేక గ్రంథములును, వినోద పరిశ్రమలద్వారా బుద్ధిని వికసింప జేయు క్రీడాసాధనములును చేకూర్చబడి యున్నవి.

### భవనములు, కట్టడములు.

ఈ కార్యస్థానము శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీవారు ప్రసాదించిరి. దీనికి విద్యుద్దీపములును, నీటి పైపును, ఒక చిన్నతోటయు కలవు;

### పత్రికలు, ప్రేక్షకులు - హిందీపాఠశాల.

(1) ఈ గ్రంథాలయమున 3 దినపత్రికలు, 15 ద్వైవార, వార, పక్ష, పత్రికలు, 21 ద్వైమాస, మాసపత్రికలు తెప్పించబడుచున్నవి.

ప్రజల సౌకర్యార్థము ముఖ్యపత్రికలు కొన్ని సంవత్సర సంపుటములుగా నొనర్చి శాశ్వతరికార్డు క్రింద నుంచితిమి. 1920 సం॥ డిసెంబరు మొదలు ఆంధ్రదైనిక పత్రిక మాససంపుటములుగను, 1927 సం॥ మొదలు సమదర్శిని పత్రిక చాతుర్మాస సంపుటములుగను నేర్పరచబడి యున్నవి.

(2) గ్రంథాలయమందు 1927 డిసెంబరు 24 తేదీ మొదలు ది 30-4-35 వరకు వచ్చిన ప్రేక్షకులసంఖ్య సగటున రోజు 1కి 55 గురు చొప్పున 1,33,009 అయియున్నది. గ్రంథములు చదువుకొన్న వారి సంఖ్యరోజు 1కి 25 గురు చొప్పునను కలదు. ఇందులో పరాయి గ్రామస్థులకుకూడ పఠన సౌకర్యముల ననుసరించి గ్రంథము లింటికి, తీసుకొని వెళ్లుటకు తగిన వసతు లేర్పరుప బడినవి.

ఈ గ్రంథాలయమునందు హిందీ పాఠశాల హిందీ ప్రచారక సమితి వారి తరఫున జరుగుచున్నది.

## గ్రాంటులు, చందాలు, సభలు, విరాళములు.

ఈ సంఘమునకు గ్రాంటులవలనను, చందాలవలనను కొంత సహాయము చేకూరుచున్నది. వీని సహాయము మాకు స్వల్పమైనదికాదు. ఇంతవరకు మ్యునిసిపాల్టీనుండిషుమారు రు 1060-0-0 లు గ్రాంటుపూర్వకముగా సమకూడిన మొత్తమునకై మేము వారినెక్కువగ నభినందించుచున్నాము.

ఈ సంఘమునకు సుమారు రు 5-0-0 లు చందాలు గల తరగతులవారి 150 మంది చందాదార్లుగలరు.

ఇంతవరకు సుమారు 96 సభలుజరుగబడినవి. ఇందులో సంఘముతరఫున జరిగిన సభలు 46, ఇతర సభలు 50.

ఈ లయిబ్ర్రరీ కూడలిస్థానమం దుండుటచే సాంఘిక మతనైతిక విషయానేక సభలకు తా వొసంగుచు పురజనులకు విశేషసేవ జేయుచున్నది. ఈ సంఘమువారు ప్రజలయొక్క భౌతిక పారమార్థిక సంపదలను వృద్ధిపొందించుటకు ఆయా ఉద్యమములకు కావలసిన సహాయమును నీ రీతిగా సమకూర్చుచున్నారు.

## సామానులు

లోగడ మాకు అప్పగించిన గ్రంథాలయము తాలూకు 63 సామానులుగాక ఇంతవరకు 5బీరువాలు, 1డ్రాయరు, 1 పేముతో అల్లినకొయ్యకుర్చి, 2 బెంచిబల్లలు, 1 గ్యాసు లైటు, 1 వేదవృక్షము, 59 మ్యాజిక్కు లాంతరు స్లైడ్సు, 1 పెద్ద లెటరుబాక్సు, రాజపోషకులు వగయిరా పటములు బ్లాకులు మొదలయిన 197 సామానులు నూతనముగా సంపాదించబడినవి.

పండిత సన్మానమును జరుపుటేగాక వైదిక వాఙ్మయమును మతవ్యాపకత్వమును విపులముగా ప్రజలలో పురికొల్పు నుద్దేశముతో మేము తలపెట్టిన గ్రంథమాలతరఫున మొదటి పుష్పముగా శ్రీ విఘ్నేశ్వరపూజావిధానము వెలువడినది.

ఈ లయిబ్రరీయందు ప్రజలయొక్క ఉపయోగముకొరకు జ్యోతిషశాస్త్రసంబంధమైన గణితములకు మిగుల అనుకూలించు నట్టి సుమారు 50 సంవత్సరముల పాతపంచాంగములు స్వీకరించి సంపుటము చేయబడినదిగా తెల్పుటకు వేడుక పడుచున్నాము.

## ఛాయాపటములు, చిత్రపటసంపుటములు.

పఠనాలయములందును, లయిబ్రరీలయందును విద్వాంసులయొక్కయు దేశారాధకులయొక్కయు ధర్మదాతలైన ధనాఢ్యులయొక్కయు ఛాయాపటములను అలంకరించినాము.

దేశములో చిత్రకళా ప్రదర్శనమునందు ప్రాముఖ్యము వహించినట్టి పురాతన కట్టడములయొక్కయు, విశేషశిల్ప చాతుర్యముల ప్రకటించుప్రసిద్ధదేవాలయములయొక్కయు అనేక శాస్త్రజ్ఞులను, పరిశ్రమలను, కళలను, భక్తులను, దేశారాధకులను, సంస్కర్తలను వారివారి ప్రశంసాపాత్రములైన సాంప్రదాయముల సూచించుపటములు సంపుటములుగ కూర్చబడి పురజనులయొక్క సౌకర్యార్థమై భద్రపరచబడియున్నవి.

## ది 24-12-27 మొదలు ది 30-4-1935 వరకు

## ఆదాయవ్యయములు.

| జమ | జమ | ఖర్చు |
|---|---|---|
| శాశ్వతచందాలు, ధర్మములు, విరాళములు, లాటరీ, కట్నములు మొదలగువానివలన | రు 9435 6 0 | |
| ఖర్చు | | |
| కొత్తగాకొన్న పుస్తకముల వెల, మరమ్మతులు, పత్రికల చందాలు వగైరా | | రు 1712 13 6 |
| జీతములు | | 4239 3 9 |
| భవనముమరమ్మతులు | | 260 14 9 |
| చిల్లరఖర్చులు | | 1873 9 9 |
| ఇతరులవల్ల రావలసినజమ | | 1299 1 6 |
| చిఠాదాఖలా నిలవ | | 49 10 9 |
| | రు 9435 6 0 | రు 9435 6 0 |

# పశ్చిమ గోదావరిజిల్లా గ్రంథాలయ కార్యసంఘ సమావేశము

## అధ్యక్షులు సర్దార్ దండు నారాయణరాజుగారు-భీమవరం - ది. 2—8—36

భీమవరము జిల్లాబోర్డు,పటేలు గ్రంథాలయ,భవనమున 2-8-36 న పశ్చిమగోదావరిజిల్లా గ్రంథాలయకార్యనిర్వాహక సంఘసమావేశము అధ్యక్షులగు శ్రీయుత దండు నారాయణరాజుగారి అధ్యక్షతను జరిగినది. సభకు హాజరైన కార్యసంఘసభ్యులు శ్రీయుతులు భూ. తిరుపతిరాజుగారు (ఉ॥ అధ్యక్షుఁడు) డాక్టరు పా. సత్యనారాయణశర్మగారు తేతలి సత్యనారాయణమూర్తిగారు కార్యదర్శులు వద్దిపర్తి రాజారావుగారు వేగేశ్న సూరపరాజుగార్లు. ఆంధ్రదేశగ్రంథాలయసంఘకార్యదర్శి శ్రీ అ. వేంకటరమణయ్యగారు కూడ హాజరైరి. గ్రంథాలయాభిమానులు భూ. రామమూర్తిరాజుగారు, పా. వీరాస్వాగారు మొదలగువారుకూడ విచ్చేసిరి. కార్యసంఘమువారీ దిగువ తీర్మానములను ఏకగ్రీవముగా గ్రంథాలయాభివృద్ధికిగాను తీర్మానించిరి.

ది 3-5-36 న ఆమోదించ బడిన నెం 3 రు తీర్మానాను సార మీ దిగువ ప్రణాళికను ఏకగ్రీవముగా తీర్మానించిరి.

### ప్రణాళిక

ప్రచారము:——గ్రామఫోను, భజనలువగైరాలతో జనులను గ్రంథాలయములవద్ద గాని గ్రంథాలయ సంఘ యాజమాన్యమున జరుపబడు ఉపన్యాస వేదికలయొద్దకు గాని ఆకర్షించుట; తదుపరి గ్రంథాలయోద్యమమును గురించియు విజ్ఞానవ్యాపకమున కవసరమగు నితర విషయములను గురించియు ఉపన్యాసము లిప్పించుట.

మ్యాజికులాంతరు బొమ్మలతో గ్రంథాలయములు బాగుగా వృద్ధిఅయిన స్థలములను, వన్నెకెక్కిన గ్రంథాలయములను చూపి ఉపన్యాసము లిప్పించుట; వీనినన్నిటిని వివరములతో నిర్ణయించుటకు ప్రచారక సంఘమును ఎన్నుకొనుట.

ఈ ప్రచారము తొలుదొలుత గ్రంథాలయములున్న గ్రామములలోనుతదుపరి యితరగ్రామములలోను చేయుట.

ఈ ప్రచారము గ్రంథాలయాభిమానముగల గ్రంథాలయ యాత్రికుల వలనను, ఈ సంఘమువారిచేగాని యితరసంస్థలవలన నియమింపబడిన యీ సంఘముక్రింద పనిచేయు ప్రచారకులవలనను జరుపవలయును.

ఇందుకుగాను రివిన్యూడివిజను ఒకటికి
గాని, రెండు తాలూకాలకు ఒక్కరు చొ॥
గాని జిల్లామొత్తముమీద ముగ్గురుప్రచారకులకు
నెల 1కి రు25 + 10 భత్యము=35 చొ. రు 1260-0-0
మూడు గ్రామఫోనులు ప్లేట్లతో సహా మూడు 150-0-0
మాజికులాంతర్లు స్లైడ్సుతో 300-0 0
———
రు 1710-0-0

నిర్మాణము:—ప్రతి గ్రామములోను గ్రంథాలయము లున్నచోట్ల వానిని పునరుద్ధరించుట. లేనిచోట్ల స్థాపించుట. వీనియన్నిటియందు ఒకేమాదిరి నిబంధన లేర్పాటు చేయుట. ఒక తాలూకాయందు అన్నిగ్రామములలోను గ్రంథాలయములను ఆ తాలూకా గ్రంథాలయ సంఘములో చేర్చునట్లు ఏర్పాటుచేయుట. తాలూకాసంఘము లేనిచోట్ల నిట్టి సంఘమును స్థాపించుట.

అన్ని తాలూకా గ్రంథాలయములను జిల్లాగ్రంథాలయసంఘములో చేరునట్లు చేయుట.

జిల్లా గ్రంథాలయ సంఘమువారిచే నిర్ణయించబడు ప్రకారము తాలూకా గ్రంథాలయములును, తాలూకా సంఘము నిర్ణయించబడిన ప్రకారము గ్రామ గ్రంథాలయములును, గ్రంథాలయోద్యమమును నడుపునట్లు చేయుట.

జిల్లా గ్రంథాలయము ముఖ్యస్థానమందు కేంద్రగ్రంథాలయముగా ఏర్పాటు చేయుట. అలాగుననే తాలూకాముఖ్యస్థానమందు కేంద్ర తాలూకా గ్రంథాలయమును ఏర్పాటు చేయుట.

జిల్లా గ్రంథాలయము విలువగల గ్రంథములను తెప్పించి తాలూకాగ్రంథాలయములకును తద్వారా గ్రామ గ్రంథాలయములకును సంచారగ్రంథాలయపేటికల ద్వారా సరఫరా చేయు ఏర్పాటు చేయుట.

తాలూకా గ్రంథాలయములు, గ్రామ గ్రంథాలయములందున్న గ్రంథముల సంయుక్తగ్రంథపట్టికలను తయారు చేసి అన్నిగ్రామగ్రంథాలయములకు అందిచ్చు ఏర్పాటు చేయుట.

గ్రామ గ్రంథాలయములవారు కోరు గ్రంథములను తాలూకాగ్రంథాలయమువారు సరఫరా చేయుట.

గ్రామ గ్రంథాలయములందు తఱచు పెద్దల రావించి యుపన్యాసములిప్పించుట. మ్యాజికులాంతరు చూపించుట. రాత్రి పాఠశాలలు పెట్టించుట.

పత్రికలయందలి ముఖ్యవ్యాసములను గ్రంథములందు ముఖ్య విషయములను చదువురానివారికొరకు చదివి వినిపించుట.

గ్రామగ్రంథాలయముల కొఱకు వలయు గ్రంథములను క్రోడీకరించి, వారికి వారిఖర్చులపై తెప్పించి యిచ్చుట.

గ్రామములో చదువు నేర్చినవారందరు గ్రంథాలయమునకు వచ్చునట్లు చదువ నభిలాషకల్గునట్లు చేయుట.

చదువురానివారికి దేశవిషయములను గురించి వినుటకు ఆసక్తికల్గించుట.

గ్రంథాలయములందు బాలురకు ఆకర్షణీయమగు ప్రత్యేకపు ఏర్పాట్లు కలుగజేయుట.

బాగుగా పనిచేయు గ్రంథాలయమునకు జిల్లా మొత్తముమీద ఒక బహుమానము వస్తురూపకముగా ఇచ్చుట, ఆంధ్రమందు మంచి వక్తకు ఒక బహుమానము వస్తురూపకముగా ఇచ్చుట.

ఇందుకుగాను:—

| | |
|---|---|
| 3 గ్రంథాలయపు బండ్లకు 1కి రు 100 చొ. | రు. 300 |
| 50 గ్రంథాలయపు పెట్టెలు పెట్టెకు 10 చొ. | 500 |
| 1 బహుమానము గ్రంథాలయముకు | 100 |
| 1 ,, వక్తకు | 100 |
| జిల్లా గ్రంథాలయ ఖర్చులకు | 200 |
| తాలూకాలకు తాలూకా 1కి 100 చొ. | 700 |
| 3 ప్రచారకులకు, బండ్లు లాగుటకు 3 కూలీలకు నెల 1కి రు 10 చొ. | 360 |
| ఇతరములు. | 30 |
| | రు. 2290 |

ఆచరణ:—1. జిల్లా తాలూకా గ్రంథాలయములకు పోషకచందాదారులను చేర్చుట.

2. విరాళములను రొక్క—వస్తురూపములుగా వసూలు చేయుట.

3. జిల్లాలోని అన్ని సహకార సంస్థలను వారి సాముదాయ ఫండునుంచి విరాళముల నిప్పించవలసినదిగా కోరుట.

4. జిల్లాబోర్డువారిని సాలీనా రు 4000/-లు విరాళము ఈ సంఘమునకు యిప్పించవలసినదని కోరుట.

5. గ్రామ గ్రంథాలయములు దిన వారపత్రికలు తెప్పించుకొనే ఖర్చులలో సగము అయినను జిల్లాబోర్డువారు విరాళముగా నిప్పించగలందులకు జిల్లాబోర్డువారిని కోరుట.

6. జిల్లాబోర్డు గ్రంథాలయములను ఆయా తాలూకా గ్రంథాలయ సంఘ యాజమాన్యమునకుగాను తాలూకా సంఘముయొక్క ప్రతినిధుల తోను, జిల్లాబోర్డుప్రతినిధులతోను కూడిన ఉపసంఘ యాజమాన్యమునకు ఇవ్వవలసినదిగా జిల్లాబోర్డువారిని కోరుట.

7. జిల్లాబోర్డుగ్రంథాలయము లన్నిటికి యీ జిల్లా గ్రంథాలయ సంఘము వారిచే ఆమోదించబడిన మాదిరి తీర్మానములు ఏర్పరుప్పనట్లు జిల్లాబోర్డువారిని కోరుట.

8. పాఠశాలగ్రంథాలయములను ప్రజల అందరిఅందుబాటులో నుంచునట్లు ఏర్పాటుచేయుటకు జిల్లాబోర్డువారిని కోరుట.

9. పాఠశాలోపాధ్యాయులు గ్రంథాలయాలలోభాండాగారిగానుండుటకు అనుమతి యిప్పించుమని జిల్లాబోర్డువారిని కోరుట.

10. జిల్లాబోర్డు గ్రంథాలయముల భాండాగారులకు ట్రయినింగు యిప్పించగలందులకును, ఇక నియమింపబోవువారిని ట్రయినింగు అయినవారిని నియమించుటకును బోర్డువారిని కోరుట.

11. జిల్లాబోర్డు గ్రంథాలయములలో సాలీనాచందా రు 3/- నుంచి రు 0-4-0 లకు తగ్గించమని జిల్లాబోర్డువారిని కోరుట.

12. జిల్లాబోర్డు గ్రంథాలయములను, బోర్డువారు సహాయముచేయు గ్రంథాలయములను తనిఖీ చేయుచు సక్రమమార్గములతో నడిపించుటకు జిల్లాబోర్డుగ్రంథాలయోద్యోగిని ఏర్పాటుచేయమని బోర్డువారిని కోరుట.

13. జిల్లాబోర్డు గ్రంథాలయములోని గ్రంథములను పరిసర గ్రామములలోని గ్రామ గ్రంథాలయములకు అరువులిచ్చుట.

14. తాలూకా ముఖ్యస్థానమునందుండు గ్రంథాలయములను కేంద్ర గ్రంథాలయముగ ఏర్పరచుటకు గాను జిల్లాబోర్డువారిని కోరుట.

15. పంచాయితీ గ్రంథాలయములలో వార్తాపత్రికలకు సిబ్బందికిని అగు ఖర్చులు మంజూరు చేయగలందులకు లోకల్ బోర్డు ఇన్‌స్పెక్టరుగారికి శిఫార్సు చేయగలందుకు జిల్లాపంచాయితీ ఆఫీసరుగారిని కోరుట.

16. గ్రంథాలయ భవనములు కట్టించుటలోను, గ్రంథములు కొనుటలోను అగు ఖర్చులలో సగముఖర్చు గ్రాంటుగా యిప్పించగలందుకు జిల్లా బోర్డు వారిని కోరుట.

16 తీర్మానము: ఈదిగువవారిని గ్రంథనిర్వచనోపసంఘముగా ఎన్నుకొనడమైనది.

1. శ్రీయుత శనివారపు సుబ్బారావుగారు
2. ,, మంగిపూడి పురుషోత్తమశర్మగారు
3. ,, జటావల్లభుల పురుషోత్తంగారు

17. తీర్మానం: ఈ దిగువవారిని ప్రచారకోపసంఘముగా ఎన్నుకోవడ మైనది.

1. శ్రీయుత శనివారపు సుబ్బారావుగారు
2. ,, తా. కుటుంబశాస్త్రిగారు
3. ,, సామవేదం సత్యనారాయణగారు

18. తీర్మానం: సెప్టెంబరుమాసములో తణుకుతాలూకా ద్వితీయ గ్రంథాలయ సభయు, గ్రంథాలయ యాత్రయు ఏర్పాటుచేయుటకు తీర్మానించడమైనది.

19. తీర్మానం : ఈ జిల్లా సంఘమును త్వరలో రిజస్టరు చేయించుటకు తీర్మానించడమైనది.

20. తీర్మానం : తాలూకా కేంద్రమందున్నూ, జిల్లాబోర్డు గ్రంథాలయ భవనమునందును, జిల్లాకేంద్ర జిల్లాబోర్డు గ్రంథాలయమునందున్నూ, వరుసగా తాలూకా గ్రంథాలయ సంఘమునకును జిల్లా గ్రంథాలయసంఘమునకును ప్రత్యేకస్థలము నేర్పాటుచేసి ఆఫీసునుంచుటకు అనుమతి యిప్పించగలందులకు జిల్లాబోర్డువారిని కోరుటకు తీర్మానించడమైనది

21. తీర్మానం : జిల్లాలోని జిల్లాబోర్డు గ్రంథాలయములో ప్రస్తుతమున్న సాలీనాచందా రు 3-0-0 ల నుంచి 0-4-0 లకు తగ్గించగలందులకు జిల్లాబోర్డువారిని కోరుటకు తీర్మానించడమైనది.

(సం) దం. నారాయణరాజు,
౨2—8—36.

## సనాతనధర్మము — శారద ఆక్టు

శారద ఆక్టువలన సనాతనధర్మపరులు కొందరు తమ పిల్లల వివాహములను నైజాంరాష్ట్రము - ఫ్రెంచిరాష్ట్రములకు వెళ్ళిన్ని, మఱికొందరు రహస్యముగను జరుపుకొనుచున్నారు. కొందరు బహిరంగముగ చేసి జరిమానాలు చెల్లించుచున్నారు. సనాతనపరులు శారదఆక్టు రద్దు చేయవలెనని కోరుచుండ, ఇంకను కఠిననిబంధనలతో బలపఱుపవలెనని సంస్కర్తలు కోరుచున్నారు. ఈమధ్యకాలములో ఏమి చేయవలెనను ఆందోళన సనాతనధర్మపరులలో బయలుదేఱినది. ఇందునుగుఱించి విచారించి అభిప్రాయమిచ్చుటకు ఈదిగువ వ్రాసిన పండితులతో కూడిన ఒక పరిషత్తు ఏర్పాటుచేయబడియున్నది. ఈ పరిషత్తును సమావేశపరుచుటకు శ్రీమాన్ సి. రాజగోపాలచారి, బి. ఏ, బి.ఎల్. అడ్వకేటుగారి అధ్యక్షతక్రింద అహ్వానసంఘ మేర్పడియున్నది. పరిషత్తువారి విచారణకొఱకు సూచనల పంపువారు సమావేశకర్తపేర పంపవలసిదిగా ఇదివరకే తెలుపబడియున్నది. "రజస్వల కాకమునుపు కన్యాదానము చేయవలెననియు, ౧౮ సంవత్సరములు నిండినతరువాత వివాహము జరుపవలెననియు, ఈ విధానము శారదఆక్టుకుగాని సనాతనధర్మమునకుగాని విరుద్ధము కాదనియు" ఒకసూచన ఆహ్వానసంఘమువారివద్దకు చేరియున్నది. పండిత పరిషత్తువారి సమావేశము వెంటనే జరిపి తగు నిశ్చయముచేసిన యెడల సనాతనధర్మపరులలోఉన్న ఆందోళనమునకు ఉపశాంతికలుగునని నమ్ముచున్నాను. ఈదిగువ పేర్కొనబడిన పండితులకు ఆహ్వానములు పంపబడినవి.

పండితులు.

1 తాతా సుబ్బారాయశాస్త్రిగారు
2 దెందుకూరి నృసింహశాస్త్రిగారు
3 వడలి లక్ష్మినారాయణశాస్త్రిగారు
4 ఉప్పులూరి గణపతిశాస్త్రిగారు
5 ముదిగొండ వెంకటరామశాస్త్రిగారు
6 వేమూరి రామగోవిందశాస్త్రిగారు
7 పుల్య ఉమామహేశ్వరశాస్త్రిగారు
8 జనమంచి శేషాద్రిశర్మగారు
9 ప్రభల లక్ష్మినృసింహంగారు
10 కాశీ కృష్ణాచార్యులుగారు
11 సూరి రామసుబ్బరాయశాస్త్రిగారు

పెక్కుమంది సభకువచ్చుటకు వాగ్దానము చేసిరి. పరిషత్తుసమావేశము రాబోవు దసరాలోగా జరుపుటకు ప్రయత్నములు జరుగుచున్నవి.

(సనాతనధర్మాభిలాషి)

# సంపాదకీయములు

## ఆంధ్రదేశ కేంద్ర గ్రంథాలయము.

కేంద్ర గ్రంథాలయ ప్రయత్నమునకు సంబంధించిన ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము వారి విజ్ఞప్తిని విడిగా ప్రకటించు చున్నాము. సమగ్రముగావిషయములనుఅందేవివరించినాము. ప్రత్యేకము మేము వ్యాఖ్య వ్రాయ నవసరము లేదు. జాతీయవికాసమునకు మొదటి సోపానము కావలసిన ఈ కార్యక్రమమును తలధరించితీర్చినన్గాని తెలుగునాటికి కార్య నిర్వహణశక్తి కలదనుట తెల్లముకాజాలదు చాలకాలముగా ఉత్తమసంవేదనా పరులను కీర్తిమాత్రము మనకు కలిగియున్నది; కాని కార్యపరులని కీర్తి మనమిప్పటికి సంపాదించలేదు. ఆంధ్రులు ఇప్పట్టున కొరవడనిదీక్షపట్టి పనిచేసి ఆరడులు కారనిపించుకొందురని నమ్ముచున్నాము.

## ఆంధ్రదేశసంస్థలు.

మానవులలో శాంతికొఱకు కృషిఎంత అవసరమో ఆకృషిఫలితమును నిర్మాణరూపముగా ప్రత్యక్షపఱుచుచుండుట అంతముఖ్యమే. నిర్మాణము సంస్థలవలన జరుగుచుండును. ఇట్టి సంస్థలను గుఱించియు- వాని ఉద్దేశములు ఫలితార్థములను గుఱించియు ప్రజలు తెలిసికొనుచుండుటవలన మానవశాంతికి ఎక్కువ ఉపయోగము కలుగుచుండును. ఆంధ్రదేశములో ఇందుకొఱకు జరుగు ప్రయత్నములు వాని ఫలితార్థములును మా చదువరులకు తెలుపుచుండ దలచితిమి. కావున పనిచేయుచున్న ఆయాసంస్థల వారు తమ ప్రయత్నఫలములు మాకు తెలుపకోరెదము.

## ఆంధ్ర సేవాసంఘము.

జాతీయాభి వృద్ధికొరకు ఆంధ్రదేశములో జరుగుచున్న పలువిధములగు కృషులను కేంద్రీకరింపచేసి వికాసముతో అభివృద్ధిచేయుటకు గాను ఈ సంవత్సరము జూన్ నెలాఖరున బెజవాడ వద్ద గుణదల ఖద్దరుసంస్థానములో ఒక సభజరిగియున్నది. ఆసభకు వార్ధానుండి గాంధిసేవా సంఘాధ్యక్షులగు శ్రీయుత కిశోరిలాల్ మశ్రువాలాగారు, ఆసంఘసభ్యులగు ధర్మాధికారిగారు వచ్చియుండిరి. ఆసభలో మన ఆంధ్రదేశములోని అనేక ప్రముఖులు ఆలోచించి, ఆంధ్రసేవా సంఘమును ఏర్పాటుచేసి యుండిరి. ఆంధ్రదేశములోని పలురకములగు జాతీయ సంస్థలను పరిశీలించి, నివేదికను తయారుచేయుటకు ఒక ఉపసంఘముకూడ ఏర్పడియున్నది. వ్యక్తులుగాను, సంస్థలుగాను, ఆంధ్రదేశములో పలుతావుల జరుపుచున్న కృషులను కేంద్రీకరింపచేసి, జీవకళతో ఆంధ్రదేశ నిర్మాణకార్యక్రమము అభివృద్ధి పొందుటకు సర్వయత్నములు చేసెదరని నమ్ముచున్నాము.

## ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్య సంఘము.

మతముపేరిట జరుగుచున్న ప్రాణిహింసను పూర్తిగా మాన్పించుటకును. మాంసాహారమును విసర్జింప ప్రోత్సహించుటకును, మానవాళిలో శాకాహార సిద్ధాంతాచరణములను వ్యాపింపజేయుటకును, పై సంఘము ఏర్పఱుప బడినది. అఖిల భారతదేశీయ మహాసభాధ్యక్షులయిన శ్రీయుత బాబురాజేంద్రప్రసాద్ గారు ఆంధ్రదేశములో పర్యటనముచేయు సంద

ర్భమున ఖద్దరు సంస్థానమునకు దయచేసిన 14-11-1935 తేదీన ఈ సంఘమునకు ప్రారంభోత్సవము జరిగెను. ఈ సంఘములో పాలక శాఖ, ఆర్థికశాఖ, ప్రచారశాఖ - అనుమూఁడు శాఖలుకలవు, ఇదివరకే ౧ శ్రీయుత గొల్లపూడి సీతారామశాస్త్రిగారు ౨ అయ్యదేవర కాళేశ్వరావుగారు ౩ మారేపల్లి రామచంద్రశాస్త్రి గారు ౪ టంగుటూరు ప్రకాశంగారు ౫ కొండ వెంకటప్పయ్యగారు ౬ కాశీనాథుని నాగేశ్వరావుగారు మొదలగు ప్రముఖులుపాలక వర్గములోను, ప్రముఖులగు వర్తకులును, ప్రచారకులున్నూ, ఆర్థిక ప్రచారశాఖలలోను, చేరియున్నారు. ఆంధ్రరాష్ట్రములో అచ్చటచ్చట ఇందుకొఱకు కృషిచేయుచున్న అన్నిసంఘములయు వ్యక్తులయు అనుబంధముతో వీరికృషి సత్వరాభివృద్ధి పొందుగాక.

## బ్రాహ్మణత్వము - త్యాగశీలత

నేడు మతములు - వర్ణములు వాటివాటి సూక్ష్మరూపమును బట్టి ఆచరింపబడుటలేదు. పైతంతు మాత్రము విధిగా సాగుచున్నది. స్థూల - సూక్ష్మధర్మములను గూర్చి విజ్ఞాన వంతులలో తగాదాలు ప్రబలుచున్నవి. ఇందుకు పర్యవసానముగ మతములు వర్ణములు అంతరించవలెనను ఆందోళన హెచ్చుచున్నది. ఈస్థితిలో కొందఱు పెద్దల సంతకములతో ఈదిగువ లక్ష్యముతో ఒకనూతనోద్యమమునకు ప్రయత్నములు జరుగుచున్నవి:

"లోక క్షేమమునకై ఏర్పడిన వర్ణాశ్రమ ధర్మములు యథానియతస్థితికి వచ్చి సంరక్షింపబడవలెననిన వేదవిహితమగు బ్రాహ్మణ సంఘమేర్పడవలెను. అట్టి సంఘము ఏర్పడుటకు బ్రాహ్మణులు పూర్వమువలెనే త్యాగశీలురై వేదవిద్యా పరులై ఉండవలెను. కావున వ్యక్తులుగా కాని,కుటుంబములుగా కాని,ఆస్తిసంపాదనేచ్ఛ లేక ఉండువారిని పోగుజేసి వారిబాలురకు తగిన శిక్షణమియ్య వలసియున్నది. ఇప్పటి బ్రాహ్మణ వర్ణములలో పైస్థితికి వెళ్లఁజాలనివారు అధ్యాపనాశీర్వచనాది గౌరవములను వదులు కొనుట ఉచిత పద్ధతి"

ఇది సక్రమముగా నడచినయెడల మతవర్ణములను గుఱించి జరుగుచున్న వివాదములు తీర్చుటకు తగిన అర్హులు కొందఱు లభింపఁగలరేమో !

## భారతి ముఖచిత్రము

భారతి సంపాదకులకు మా యభినందనములు మేము గత ఏప్రిల్ సంచికయందు చేసిన సూచనను వీరు మన్నించిరి. ముఖచిత్రమున హిందీ ప్రాబల్యమును తీసివేసిరి. చక్కని తెలుగక్షరములతో భారతిని పూజించిరి. అర్ధనిమీలిత న్యాయమున సమాధియందుండు మూర్తిని చిత్రించి మూర్ధాలంకరణముగ జూకామల్లెలును సంతరించిరి. నక్షత్రము చిత్రించి తిలకమును దీర్చిరి. తేజస్సును ప్రతిఫలింపజేయు పరసరాంబుదావరణము ధ్యానసమాధి కొక నవీనశోభనొసంగినది.

జులై ఆగస్టునెలలలో మా పత్రిక వెలువడమిచే వచ్చిన వ్యాసాదులును, గ్రంథపత్రికల విమర్శనములును - అన్నియు - ఇందుప్రకటింప జాలమికి వగచుచున్నాము.

సంపాదకులు.

# ఏలూరు, అన్నదానసమాజము — Annadanasamajam, Ellore.

ఏలూరు, అన్న, వస్త్ర, వైద్య విద్యాదానసమాజము 1913 సం॥ రమున స్థాపింపబడెను. ప్రభుత్వమువారు స్థలము ధర్మముగ నొసంగిరి. మ. రా. శ్రీ బొమ్మా రత్నంగారి ద్రవ్యసహాయమున భవనము నిర్మింపబడెను. ఇందు ప్రతిదినము అశక్తులకు అన్నదానము జరుగుచున్నది. ప్రతిసంవత్సరము 15 డిశంబరున బీదలకు వస్త్రదానము జరుగుచున్నది. వేసవికాలమున మంచినీళ్ల చలివేంద్రిలు పెట్టబడుచున్నవి. వైద్యదానము ప్రతిరోజు సాయంకాలము సమాజమువద్ద జరుగుచున్నది.

ఒకరోజు అన్నదానమునకు రు 60 లు ధర్మమిచ్చిన స్థిరాస్తులవల్ల వచ్చే ఆదాతో వారు కోరిన తేది 1 రోజున బీదలకు అన్నదానము జరుగును. వస్త్రదానము శాశ్వతనిధి ధర్మము రు 10 లు లగాయతు ఈయవచ్చును. ధర్మములకు రశీదులను, శాశ్వతనిధి ధర్మములకు రసీదులతోసహా పట్టాలను 5 గురు శాశ్వతధర్మకర్తలు (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. ఎల్లరు సహాయపడ గోరుచున్నాము. ఇతర వివరములకు :—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు
కొత్తమాసు సీతారామయ్యగారు, (సోల్ట్రిస్టీలు)
పసుమర్తి పురుషోత్తంగారు, (ప్రెసిడెంటు)
మద్దుల వెంకట చినరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు)
నున్నా గంగరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు)
కందుల రామయ్యగారు, (సెక్రిటరీ)
} శాశ్వతధర్మకర్తలలోనివారు

---

# ఏలూరు, హిందూ యువజనసంఘము
## Youngmen's Hindu Association, Ellore.

ఈగ్రంథాలయము 1904 సం॥రమున స్థాపింపబడెను. 1918 సం॥రము సంఘమురిజిష్టరు అయినది. 1928 సం॥రము మ. రా. శ్రీ రా. బ. మోతే గంగరాజు జమీందారుగారి ద్రవ్యసహాయమున నూతన దివ్యభవనము (రు 50,000 లు వెచ్చింపబడి) నిర్మింపబడినది. ఇందు దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆంగ్ల, ఆంధ్రిభాషలయందు వచ్చుచున్నవి. ఆంగ్ల, ఆంధ్రి, సంస్కృత గ్రంథములు సుమారు 13 వేలవరకు గలవు. మ్యాజిక్ లాంతరు, వ్యాసరచన పోటీపరీక్షలు, విషయనిర్ధారణ సభలు, వక్తృత్వపోటీపరీక్షలు ప్రతిసంవత్సరము జరుపుచు అందు తీర్ణులకు బహుమతు లొసంగబడుచున్నవి. ఇంకను గ్రంథములు, పత్రికలు తెప్పించవలసిన యున్నవి. ఎలక్ట్రిసిటి, రేడియో అవసరము. ప్రతిసంవత్సరము ఆదాయమునకు మించిన వ్యయమగుచున్నది. కాన ఎల్లరు శక్తికొలది సహాయపడుడు. ధర్మములకు రశీదులను శాశ్వత ధర్మములకు రశీదులతోపాటు పట్టాలను, 5 గురు శాశ్వతధర్మకర్తల (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. క్యాటలాగులు అచ్చువేయబడెను. బజారులో బ్రాంచి లైబ్రరీకూడ కలదు.

ఇతర వివరములకు:—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు, (ధర్మకర్తృసభాధ్యక్షులు)
మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు, (ధర్మకర్తృసభాగౌరవకార్యదర్శి)

RSVM01A158



Grandhalaya Sarvasvam-Registered No. M 1714

ఓ రి యం ట ల్

గవర్నమెంటు సెక్యూరిటీలైఫ్ అస్యూరెన్సుకంపెనీ, లిమిటెడ్

స్థాపితము 1874. హెడ్ ఆఫీసు : బొంబాయి.

**1935** నివేదిక — సంగ్రహము.

| | | | |
|---|---|---|---|
| జారీచేసిన క్రొత్త పాలిసీలు | రూ. 8,89,89,149 | చెల్లించిన క్లెయిముల మొత్తం | రూ 17,43,21,855 |
| సాలీనా ఆదాయము | ,, 3,49,16,412 | పెరిగిన ఫండు మొత్తములు | ,, 17,01,62,491 |
| అమలులోనున్న పాలసీలు | ,, 59,25,32,038 | | |

ఈ పైన తెలుపబడిన అంకెలు ఓరియంటల్ యొక్క ప్రజాదరణ, కంపెనీస్థిరత్వమునుగూర్చి వేనోళ్ళ చాటుచున్నవి.

ప్రజాదరణబొంది దినదినాభివృద్ధిగాంచుచున్న ఈ హైందవ భీమాసంస్థలో మీజీవితము భీమా చేసికొనుటకు ఆలసింపవలదు.

వివరములకు : ☛ పి. హెచ్. గుప్త, బార్-ఎట్-లా సెక్రటరీ, ఉత్తరజిల్లాలు,, గోడేవారివీధి, విశాఖపట్టణము,

లేక ఈక్రింది ఉదాహరింపబడిన కంపెని కార్యాలయములకు వ్రాయవచ్చును.

ఆగ్రా, అజ్మీర్, అహమ్మదాబాద్, అలహాబాద్, అంబాల, బెంగుళూర్, బెరియేలీ, బెల్లారి, కలకత్తా, కాలికట్, కోయంబతూర్, కొలంబో, ఢక్కా, ఢిల్లి, గౌహతీ, గుంటూరు, జల్గాను, జల్పాయిగురి, జబ్బల్‌పూర్, కరాచీ, కోలాలంపూర్, లాహోరు, లక్నో, మాండలీ, మధుర, మెర్కారా, మొంబాసా, నాగపూరు, పాట్నా, పూనా, రాయపూరు, రాజసాహి, రాంచీ, రంగూన్, రావల్పిండి, సింగపూర్, సుక్కూర్, తిరుచునాపల్లి, తిరువనంతపురము, విశాఖపట్టణము.

(Oriental)

# Gosamrakshana Samithi, Ellore.

## గోసంరక్షణ సమితి, ఏలూరు.

ఈ సమితియందు దిక్కులేని గోవులు రక్షింపబడును. పాలు ఉన్నయెడల చంటిబిడ్డలకు, దైవపూజలకు, బీదలకు ఉచితముగ నిచ్చెదరు. పచ్చిగడ్డి నిమిత్తము బీడుభూమి కొనవలసియున్నది. మంచిస్థితిలోనికివచ్చిన గోవులను గృహస్థులకు అమ్మెదరు. గోశాలనిమిత్తము స్థిరమైన స్థలము అవసరము. ధర్మములకు రశీదులు, శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా అయిదు గురకు తక్కువగాని శాశ్వత ధర్మకర్తల [రు 500 దాతలు] సంతకములతో పట్టాలనిచ్చెదరు. అభిమానులెల్లరు శక్తికొలది శాశ్వతనిధిధర్మములేకాక వార్షిక మామూళ్లను, నెల చందాలుగను వరిగడ్డి, తవుడు, విరాళములుగను సహాయపడి యీ సమితి అభివృద్ధికి తోడ్పడ గోరుచున్నాము.

గోసంరక్షణసమితి ప్రచురణములకు, రూల్సుబుక్కులకు, రిపోర్టులు మున్నగువానికి:—

ఏలూరు
5—1—1935.

రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుగారు, (ప్రెసిడెంటు, ట్రస్టీ.)
మద్దుల వెంకట చినరాజుశ్రేష్ఠిగారు, (వైస్ ప్రెసిడెంటు, ట్రస్టీ.)

బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు కుందా లక్ష్మీనరసయ్యగారిచే ముద్రింపబడినది.

| | |
|---|---|
| | మనసు ఫౌండేషన్<br>పుస్తకాల పరిశీలనాపట్టిక |

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01A158 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/54 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 47 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Hema |
| పేజీలు విడదీసినది | Hema |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | prayathi |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనిది | |
| తప్పులు | NO |
| పరిస్థితి | Good |